నవచేతన పబ్లిషింగ్ హౌస్
దశాబ్దకాలం వెదజల్లిన విజ్ఞానం, సాహిత్యం
2015 11th Anniversary
NBH
www.navachethanabooks.in
Navachethana Vignana Samithi
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68. ఫోన్:040-29884453/54



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



హర్యానాలో రూ.1500 కోట్ల కుంభకోణం
బయటపెట్టిన బిజెపి మంత్రి : ఇరకాటంలో సిఎం

వెనిజులా పరిణామాలతో ఉచితాలపై విషం కక్కుతున్న మరుగుజ్జులు 06



సంపుటి 09, సంచిక: 43 | శనివారం | 10-01-2026 | ఖమ్మం    Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## తెలంగాణ, ఎపి మధ్య
# వివాదాలొద్దు

## పంచాయితీ కాదు.. నీళ్లే కావాలి

- రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించుకుందాం
- జలాల విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలనుకోవడం లేదు
- ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టొద్దు
- ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

ప్రజాపక్షం/రంగారెడ్డి

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని, రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కోర్టుల్లో కాకుండా మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్ ప్రారంభోత్సవంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ నీళ్ల సమస్యపై స్పందించారు. జల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని ఆయన స్పష్టం చేశారు. పంచాయితీ కావాలా? నీళ్లు కావాలా? అని తనను అడిగితే తెలంగాణకు నీళ్లే కావాలని చెబుతానని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వివాదాలు కావాలా పరిష్కారం కావాలా అని అడిగితే పరిష్కారం కావాలని చెబుతానన్నారు. మన సమస్యలను మనమే సామరస్యంగా పరిష్కరించుకుందామన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ వేదికగా కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టకండి అని విజ్ఞప్తి చేస్తున్నానని తెలిపారు. ఇలా అడ్డంకులతో కేంద్ర ప్రభుత్వం నిధులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. తాము వివాదాలు కోరుకోవడం లేదని పరిష్కారం కోరుకుంటున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాలు కాదు ప్రజల ప్రయోజనాలు కోసం ఆలోచిస్తున్నామన్నారు. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పొరుగు రాష్ట్రం సహకారం ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. రెండు రాష్ట్రాలు(ఎపి, తెలంగాణ) పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అశాభావం వ్యక్తం చేశారు. ఎపి, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు ఇలా ఏ రాష్ట్రమైనా సరే మేం వివాదాలు కోరుకోవడం లేదన్నారు. ఈ విషయంలో ఎపి ప్రభుత్వం తరువాయి 2లో



## బిజెపి రాజకీయ లబ్ధికి
# ఇడి దుర్వినియోగం

- కేంద్ర సర్కార్‌పై మమతాబెనర్జీ ధ్వజం
- ఇడి దాడులను వ్యతిరేకిస్తూ మెగా ర్యాలీ
- ఢిల్లీలోని అమిత్ షా కార్యాలయం ఎదుట టిఎంసి ఎంపిల నిరసన



**కోల్‌కతా :** రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐప్యాక్ కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలను వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో శుక్రవారం దక్షిణ కోల్‌కతాలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేంద్రంతో తన ఘర్షణను తీవ్రతరం చేస్తూ, వీధులను మమత తన రాజకీయ యుద్ధ భూమిగా ఎంచుకుంది. అసెంబ్లీ ఎన్నికలు ముందు ఇడి చర్యను ర్యాలీ పాయింట్‌గా మార్చారు. కాగా, మమత బెనర్జీ 8బి బస్టాండ ప్రాంతం నుండి హజ్రా మోర్ వైపు నిరసన ప్రదర్శన కొనసాగిస్తుండగా, టిఎంసి అధినేత్రితో కలిసి సీనియర్ మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తలు నినాదాలు చేశారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర సర్కార్ రాజకీయ ప్రచారం కోసం కేంద్ర దర్యాప్తు సంస్థను దుర్వినియోగం చేస్తుందని మండిపడ్డారు. ఐప్యాక్ చీఫ్ ప్రతీక్ జైన్ లౌడాన్ స్ట్రీట్ నివాసంలో ఇడి సోదాల సమయంలో నాయటకీయంగా మమత అక్కడి వెళ్లిన విషయం తెలిసిందే. ఈ ఎపిసోడ్ అప్పటి నుండి పూర్తి స్థాయి కేంద్ర, రాష్ట్ర ఘర్షణగా మారింది. భారీ ర్యాలీ సందర్భంగా పార్టీ కార్యకర్తలు ప్రతుల్ ముఖోపాధ్యాయ రాసిన ఐకానిక్ గీతం 'అమీ బంగ్లాయ్ గాన్ గై' ని ఆలపించారు. మహిళలు శంఖం ఊదుతూ నిరసనకు రాజకీయ ధిక్కారాలతో నిండిన వీధి ఉత్సవంలో కనిపించింది. తన ట్రేడ్‌మార్క్ తెల్లటి కాటన్ చీర, శాలువా, తరువాయి 2లో

### మమతపై సిబిఐ దర్యాప్తు కోరిన ఇడి

ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సీనియర్ పోలీసు అధికారులు, ఇతరులపై సిబిఐ విచారణ కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించింది. పొలిటికల్ కన్సల్టెన్సీ సంస్థ ఐప్యాక్‌పై, దాని డైరెక్టర్‌పై తాము చేసిన రైడ్‌లను వీరు ఉద్దేశపూర్వకంగా అడ్డుకున్నారని ఇడి ఆరోపించింది. 'ఐప్యాక్ ప్రాంగణం నుంచి తాము స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాలు, ఎలక్ట్రానిక్ రికార్డులు, స్టోరేజ్ మీడియా, ఇతర పత్రాలను పోలీసులు చట్టవిరుద్ధంగా, బలవంతంగా తీసుకెళ్లారు' అని ఇడి తన రిట్ పిటిషన్‌లో ఆరోపించింది. 'వాటిని తక్షణమే స్వాధీనం చేసుకుని, సీల్ చేసి, ఫోరెన్సిక్ భద్రత కల్పించి, తిరిగి ఇడి కస్టడీకి అప్పగించాలని' కోరింది.

**హైకోర్టుకెళ్లిన టిఎంసి**

మరోవైపు, ఐప్యాక్ దాడుల్లో ఇడి స్వాధీనం చేసుకున్న పత్రాల దుర్వినియోగం కాకుండా కేంద్ర దర్యాప్తు సంస్థను నియంత్రించాలని టిఎంసి శుక్రవారం కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించింది. రానున్న ఎన్నికల కోసం టిఎంసి సిద్ధం చేసుకున్న రహస్య రాజకీయ, ప్రచార వ్యూహాలు, అంతర్గత తరువాయి 2లో




## ఫిబ్రవరి 1నే కేంద్ర బడ్జెట్!

ఈ నెల 28వ తేదీ నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యే అవకాశం

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 28న ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1, ఆదివారం నాడు ప్రవేశపెట్టనున్నారు. పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ ఖరారు చేసిన తాత్కాలిక షెడ్యూల్‌ను ఉటంకిస్తూ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జనవరి 28న ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారని అధికారులు శుక్రవారం తెలిపారు. ఈ సంవత్సరంలో పార్లమెంట్ మొదటి తరువాయి 2లో

## ఆస్కార్ బరిలో 'కాంతారా'

### రేసులో మరో మూడు భారతీయ సినిమాలు

లాస్‌ఏంజిలిస్: కాంతారాతో సహా మొత్తం నాలుగు సినిమాలు మన దేశం నుంచి అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డుల రేసులో ఉన్నాయి. 98వ అకాడెమీ అవార్డుల్లో అవార్డుల కోసం మొత్తం 201 చలన చిత్రాలు పోటీ పడుతున్నాయి. వీటిలో రిషబ్ శెట్టి 'కాంతారా'పై ఎక్కువ మంది ఆశలు పెట్టుకున్నారు. ప్రముఖ సినీ, రంగస్థల నటుడు అనుపమ్ ఖేర్ దర్శకత్వం వహించిన 'మహావతార్ నరసింహ', అభిషాన్ జీవింత్ తొలిసారి నిర్మించిన తమిళ చిత్రం 'టూరిస్ట్ ఫ్యామిలీ', హిందీ చిత్రం 'తన్వీ ది గ్రేట్' సైతం ఆస్కార్ బాబితాలో ఉన్నాయి. యుకే–ఇండియా సహ నిర్మిత సినిమాగా 'సిస్టర్ మిడ్‌నైట్' సినిమా కూడా ఆస్కార్ పోటీలో ఉంది. మొత్తంగా 317 సినిమాలు నామినేట్‌కాగా, వాటిలో ఉత్తమ సినిమా, ఉత్తమ దర్శకుడు వంటి అవార్డులు పొందడానికి 201 సినిమాలను ఖరారు చేశారు.




## పథకాలు ఎగ్గొట్టిందెవరో రైతులకు తెలుసు

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంపై మంత్రి తుమ్మల మండిపాటు 02






## డిజిపికి భారీ ఊరట

4 వారాల్లో నియామక ప్రక్రియ పూర్తి చేయాలి : హైకోర్టు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర డిజిపిగా శివధర్‌రెడ్డికి శుక్రవారం హైకోర్టులో ఊరట లభించింది. డిజిపి నియామకం చట్టవిరుద్ధమని పేర్కొంటూ దాఖలైన మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేస్తూ జస్టిస్ పుల్లా కార్తీక్ ఉత్తర్వులు జారీ చేశారు. రెగ్యులర్ డిజిపి నియామకం కోసం ప్రకాశ్ సింగ్ బాదల్ కేసులో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను అమలు ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. బి.శివధర్‌రెడ్డిని డిజిపిగా నియామకం చెల్లదని పేర్కొంటూ సోషల్ వర్కర్ తరువాయి 12లో

### బిఆర్‌ఎస్ ప్రభుత్వం పెట్టిన
# అక్రమ కేసులు ఎత్తివేయండి



### సిపిఐ విజ్ఞప్తి డిజిపికి వినతి పత్రం సమర్పణ

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో వామపక్ష పార్టీ నేతలతో పాటు ప్రజాసంఘాల నేతలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సిపిఐ బృందం శుక్రవారం రాష్ట్ర డిజిపి బి.శివధర్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నర్సింహ్మా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మారుపాక అనిల్ కుమార్‌లు డిజిపికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం చాడ వెంకట్ రెడ్డి, ఇటి నర్సింహ్మా మాట్లాడుతూ గత బిఆర్ ఎస్ ప్రభుత్వంలో తరువాయి 12లో

## సైబర్ బాధితులకు
# 'సి-మిత్ర' అండ

- దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్ పోలీసుల వినూత్న ప్రయోగం
- బాధితులకు భరోసాగా 'వర్చువల్ పోలీస్ ఆఫీసర్లు'
- ఇక ఇంటి నుంచే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసుకునే అవకాశం




ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రస్తుత డిజిటల్ యుగంలో సాంకేతిక విప్లవంతో పాటే సైబర్ నేరాలు కూడా కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. ఒటిపి మోసాలు, డిజిటల్ అరెస్టు, ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ వంటివి ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇలాంటి క్లిష్ట సమయాల్లో బాధితులకు అండగా నిలుస్తూ, వారు పోలీస్ స్టేషన్‌కు వెళ్లే శ్రమ లేకుండా త్వరితగతిన న్యాయం అందించేందుకు హైదరాబాద్ పోలీసులు దేశంలోనే తొలిసారిగా ఒక విప్లవాత్మక అడుగు వేశారు. అదే.. 'సి మిత్ర'. దీని ద్వారా ఫిర్యాదు చేయడం మొదలుకొని, ఎఫ్‌ఐఆర్ నమోదు అయ్యే వరకూ అంతా ఇంటి నుంచే పూర్తవుతుంది. సాంకేతికత ద్వారా పోలీసులే బాధితుల వద్దకు వచ్చే అద్భుతమైన 'వర్చువల్' పరిష్కారమిది. సాధారణంగా సైబర్ మోసం జరిగినప్పుడు బాధితులు '1930' నంబర్‌కు ఫోన్ చేసి గానీ, జాతీయ సైబర్ పోర్టల్ (www.cybercrime.gov.in)లో గానీ ఫిర్యాదు చేస్తారు. అయితే, ఆ తర్వాత ఎఫ్‌ఐఆర్ నమోదు కోసం కచ్చితంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సి ఉంటుంది. కానీ 'సి మిత్ర' రాకతో ఇక ఆ అవసరం ఉండదు. సమస్త ఫిర్యాదు ప్రక్రియ తరువాయి 2లో

# ఆయుధం వీడిన నక్సల్స్

- ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడలో లొంగిపోయిన 63 మంది మావోయిస్టులు
- 36 మందిపై సమష్టిగా రూ. 1.19 కోట్ల రివార్డు




**దంతెవాడ :** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు విడతల వారీగా లొంగుపోతున్నారు. తాజాగా దంతెవాడ జిల్లాలో 63 మంది నక్సల్స్ ఆయుధాలు వీడారు. వీరిలో 36 మందిపై సమష్టిగా రూ. 1.19 కోట్ల రివార్డును కలిగి ఉన్నట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. దంతెవాడ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గౌరవ్ రాయ్ మాట్లాడుతూ 18 మంది మహిళలతో సహా 63 మంది నక్సల్స్ 'పూనా మార్గెమ్' (పునరావాసం నుండి సామాజిక పునరేకీకరణ వరకు) కార్యక్రమం కింద దంతెవాడ సీనియర్ పోలీసు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఫ్) తరువాయి 12లో

## వన దేవతల ఘన కీర్తి
# ప్రపంచానికి చాటాలి

- చరిత్రలో ప్రత్యేక మైలురాయిగా మేడారం ఆలయం
- గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఆలయ ప్రాంగణ పునరుద్ధరణ
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



ప్రజాపక్షం/ములుగు

వన దేవతల ఘన కీర్తి ప్రపంచానికి చాటి చెప్పాలని, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, గొట్టు గోత్రాలు ఆచారాలు ప్రతిబింబించేలా ఆలయ ప్రాంగణ పునరుద్ధరణ జరుగుతున్నదని,ప్రపంచానికి ఆదివాసులు మూల పురుషులుగా ఉన్నారని, మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ పెట్టారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. శుక్రవారం తరువాయి 12లో

# యుఎస్ చర్యతో తీవ్ర ఉద్రిక్తతలు

## చమురు ట్యాంకర్‌ను యుఎస్ స్వాధీనం చేసుకోవడంపై రష్యా హెచ్చరిక



**మాస్కో:** రష్యా జెండాతో ప్రయాణిస్తున్న చమురు ట్యాంకర్‌ను అమెరికా స్వాధీనం చేసుకోవడాన్ని రష్యా తీవ్రంగా ఖండించింది. ఈ చర్య మాస్కో–వాషింగ్టన్ సంబంధాల్లో మరోసారి దూరం పెంచుతూ, యూరో–అట్లాంటిక్ ప్రాంతంలో సైనిక, రాజకీయ ఉద్రిక్తతలను మరింతగా ప్రేరేపిస్తుందని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఉత్తర అట్లాంటిక్‌లో 'బెల్లా–1' అనే నౌకను అమెరికా సైన్యం బుధవారం స్వాధీనం చేసుకుంది. అమెరికా ఆంక్షలను ఉల్లంఘించినందుకే ఈ చర్య తీసుకున్నామని యుఎస్ యూరోపియన్ కమాండ్ తెలిపింది. గత నెల వెనిజులాపై విధించిన చమురు నిషేధాన్ని తప్పించుకోవడానికి ప్రయత్నించిన తర్వాత ఆ నౌకకు 'మారినెరా' అని పేరు మార్చి రష్యా జెండా కింద నమోదు చేశారని అమెరికా పేర్కొంది. ఈ స్వాధీనాన్ని అంతర్జాతీయ సముద్ర చట్టాల ఉల్లంఘనగా రష్యా వర్ణించింది. డిసెంబరులో జారీ చేసిన అనుమతితో నౌక రష్యా జెండా కింద సాగుతోందని, సిబ్బందిపై కేసులు పెట్టే అమెరికా బెదిరింపులు అంగీకార యోగ్యం కావని తెలిపింది. వెనిజులా చమురు సంపదపై నియంత్రణ సాధించాలనే నవవలస వాద ధోరణిలో భాగంగానే ఈ చర్యని అమెరికా తీసుకుందని ఆరోపించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇప్పటివరకు ఈ వ్యవహారంపై స్పందించకపోయినప్పటికీ, నౌకలను రక్షించేందుకు నౌకాదళాన్ని వెంటనే మోహరించాల్సిందన్న ప్రతిపాదన వినిపిస్తున్నది. అయితే, అమెరికా మాజీ సహాయ విదేశాంగ మంత్రి డేనియల్ ఫ్రైడ్ ప్రకారం, ఈ ఘటనకు ప్రతీకారం తీసుకునే విషయంలో రష్యాకు పరిమిత అవకాశాలే ఉన్నాయి. ట్రంప్‌తో సంబంధాలు చెడగొట్టుకోవడం పుతిన్ కోరుకోకపోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

**అంతర్జాతీయ చట్ట ఉల్లంఘన: చైనా**

**బీజింగ్:** రష్యాకు చెందిన చమురు ట్యాంకర్‌ను అమెరికా స్వాధీనం తీసుకోవడాన్ని తీవ్రమైన అంతర్జాతీయ చట్ట ఉల్లంఘనగా పేర్కొంటూ, చైనా ఖండించింది. ఈ నిర్ణయం వాషింగ్టన్‌చైనాల మధ్య సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని, చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పోక్స్‌పర్సన్ మావో నింగ్ తెలిపారు. సముద్రంలో ఇతర దేశాల నౌకలను మన్మానంగా నిర్బంధించడం అంతర్జాతీయ చట్టవిధానాల తీవ్ర ఉల్లంఘనగా పేర్కొన్నారు. ఏకపక్ష ఆంక్షలు విధించడం, నిర్ణయాలు తీసుకోవడం, అమలు చేయడం వంటి చర్యలతో యుఎన్ భద్రతా మండలి నిబంధనావళికి విరుద్ధమని మావో నింగ్ అన్నారు. అంతర్జాతీయ సముద్ర చట్టం, యుఎన్ ఆజ్ఞాపత్రపు న్యాయ లక్ష్యాలు ఉల్లంఘించే ఏ కార్యాచరణనూ చైనా అనుమతించబోదని అన్నారు.

# అమెరికా ప్రోత్సాహంతోనే అల్లర్లు

## ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా ఖమేనీ ఆరోపణ

**తెహ్రాన్/వాషింగ్టన్:** ఇరాన్‌లో దేశవ్యాప్తంగా చెలరేగిన నిరసనలు వెనుక అమెరికా చేతులున్నాయని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ తీవ్ర ఆరోపణ చేశారు. శుక్రవారం రాత్రి ప్రభుత్వ టెలివిజన్‌లో ప్రసారమైన హఠాత్ ప్రసంగంలో ఆయన, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'ఆందోళనకారులు తమ వీధులను తామే ధ్వంసం చేసుకుంటూ మరొక దేశ అధ్యక్షుడిని, అంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను, సంతోషపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. నిరసనకారులపై కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టంగా సంకేతమిచ్చారు. ప్రసంగం సందర్భంగా సభలో ఉన్నవారు 'డెత్ టు అమెరికా' అంటూ నినాదాలు చేశారు. డిసెంబరు చివరిలో ఇరాన్ ఆర్థిక సంక్షోభంతో మొదలైన నిరసనలు, ఇప్పుడు ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంగా మారాయి. 12 రోజుల ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం తర్వాత ఆంక్షలు పెరగడం, ఇరాన్ కరెన్సీ రియాల్ భారీగా క్షీణించడం (డాలర్‌కు 14 లక్షల రియాల్‌కు పడిపోవడం) ప్రజల్లో ఆగ్రహాన్ని మరింత పెంచింది. ఈ నేపథ్యంలో దేశ బహిష్కృత యువరాజు రేజా పహ్లావి గురువారం రాత్రి 8 గంటలకు రోడ్లపైకి రావాలని పిలుపునివ్వడంతో వేలాది మంది తెహ్రాన్ సహా అనేక నగరాల్లో ర్యాలీలు నిర్వహించారు. 'డిక్టేటర్‌కు మృతి', 'ఇస్లామిక్ రిపబ్లిక్‌కు మృతి', 'పహ్లావి తిరిగి వస్తాడు' వంటి నినాదాలు మార్మోగాయి. ఈ నిరసనలు ఊపందుకోవడంతో ప్రభుత్వం ఇంటర్నెట్, అంతర్జాతీయ ఫోన్ సేవలను పూర్తిగా నిలిపివేసింది. ప్రపంచానికి నిజ పరిస్థితి తెలియకుండా చేయడానికే ఈ కమ్యూనికేషన్ బ్లాక్‌ఔట్‌ను విధించారని విశ్లేషకులు అంటున్నారు. కాగా, ఇరాన్ ప్రభుత్వ మీడియా మాత్రం నిరసనలను అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన ఉగ్ర ఏజెంట్లు రెచ్చగొడుతున్నారని ఆరోపించింది. వాహనాలు, మెట్రో, బస్సులు, ఫైర్ ట్రక్కులు దహనం చేశారని, ప్రాణనష్టం కూడా జరిగిందని పేర్కొన్నప్పటికీ వివరాలు వెల్లడించలేదు. అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న 'హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్స్ న్యూస్ ఏజెన్సీ' ప్రకారం ఇప్పటివరకు కనీసం 42 మంది మరణించగా, 2,270 మందికిపైగా అరెస్టయ్యారు. ఇలావుంటే, ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా స్పందిస్తూ, శాంతియుత నిరసనకారులను హత్య చేస్తే, ఇరాన్ ప్రభుత్వం నరకం అనుభవించాల్సి ఉంటుందంటూ హెచ్చరించారు. అవసరమైతే ప్రజలను రక్షించేందుకు అమెరికా ముందుకు వస్తుందని కూడా ఆయన అన్నారు. ఇదే సమయంలో ఖామెనేయి దేశం విడిచి వెళ్లే ఆలోచనలో ఉన్నాడని ట్రంప్ వ్యాఖ్యానించడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. కాగా, ఇరాన్ పాలకులు చూస్తున్న కోణంలో ఈ నిరసనలు కేవలం ఆర్థిక అసంతృప్తి కాదు.. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ప్రభుత్వాన్ని అస్థిరపరచేందుకు చేస్తున్న రాజకీయ ఆపరేషన్‌గా వారు భావిస్తున్నారు. ఖామెనేయి వ్యాఖ్యలు ఆ దృక్కోణాన్ని బలపరుస్తున్నాయి. మరోవైపు పహ్లావి యూరప్ దేశాలు, ట్రంప్ కలిసి ఇరాన్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రజలకు కమ్యూనికేషన్ తిరిగి కల్పించాలని కోరుతున్నారు. మొత్తానికి, ఇరాన్‌లోని వీధి ఉద్యమం ఇప్పుడు దేశీయ ఆర్థిక సంక్షోభాన్ని దాటి అంతర్జాతీయ శక్తుల మధ్య ప్రత్యక్ష రాజకీయ పోరుగా మారుతోంది. ఖమేనీ దృష్టిలో ఇది అమెరికా ప్రేరేపిత కుట్ర. ట్రంప్ దృష్టిలో ఇది ప్రజాస్వామ్య తిరుగుబాటు. ఈ రెండు వాఖ్యానాల మధ్య ఇరాన్ వీధుల్లో రక్తం కారుతోంది.. అదే ఈ సంక్షోభానికి అత్యంత భయానక సంకేతం.

# వెనిజులాలో ప్రతిపక్ష నేతలు, కార్యకర్తల విడుదల

## తమ అభ్యర్థన మేరకేనని ట్రంప్ ప్రకటన



**గ్వాటిరే (వెనిజులా):** వెనిజులా ప్రభుత్వం కీలక ప్రతిపక్ష నేతలు, మానవ హక్కుల కార్యకర్తలు, జర్నలిస్టులు సహా పలువురు ఖైదీలను విడుదల చేసింది. దేశంలో 'శాంతి సాధన' లక్ష్యంగా ఈ చర్య చేపట్టినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల మాజీ అధ్యక్షుడు నికోలాస్ మదురోను అమెరికా బలగాలు మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసుల్లో అరెస్టు చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. కాగా, ఈ విడుదల నిర్ణయాన్ని తమ ఘనతగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించుకున్నారు. తమ అభ్యర్థన మేరకే వెనిజులా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన, వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెజ్ ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూ,'మేము కోరిన ప్రతిదీ వారు చేశారు' అని వ్యాఖ్యానించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మదురో అరెస్టుకు సహకరించిన శక్తుల విషయంలో అనుమానాలకు తావిస్తున్నది. ఇలావుంటే, 'గణనీయ సంఖ్యలో' ఖైదీలు విడుదలవుతారని వెనిజులా నేషనల్ అసెంబ్లీ అధ్యక్షుడు జోర్జ్ రోడ్రిగెజ్ ప్రకటించినప్పటికీ, ఖచ్చితమైన సంఖ్య వెల్లడికాలేదు. విడుదలైన వారిలో ప్రతిపక్ష నేత బియాజియో పిలియేరి, 2024 అధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ ఎన్నికల కమిషనర్ ఎన్‌రికే మార్క్వెజ్ ఉన్నారని కారాకాస్‌కు చెందిన 'ఫోరో పెనల్' సంస్థ తెలిపింది. వీరిద్దరూ జైలు బయట కుటుంబ సభ్యులను ఆలింగనం చేసుకుంటూ కనిపించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. అలాగే ఐదుగురు స్పెయిన్ పౌరులు, వెనిజులాస్పెయిన్ న్యాయవాది, మానవ హక్కుల కార్యకర్త రోసియో సాన్ మిగెల్ విడుదలయ్యారని స్పెయిన్ ప్రభుత్వం ధృవీకరించింది. మాజీ ప్రతిపక్ష నేత మారియా కొరినా మాచాడో ఈ చర్యను నైతిక పరిహార చర్యగా అభివర్ణిస్తూ, 'దోచుకున్న సంవత్సరాలు తిరిగి రావు.. కానీ అన్యాయం శాశ్వతం కాదు' అని వ్యాఖ్యానించారు. ఫోరో పెనల్ అధ్యక్షుడు అల్ఫ్రెడో రొమీరో మాత్రం ఇది అణచివేత వ్యవస్థను కూల్చే ఆరంభమా, లేక తాత్కాలిక రాజకీయ సంకేతమా అన్నది చూడాల్సి ఉందని హెచ్చరించారు. డిసెంబర్ 29, 2025 నాటికి వెనిజులాలో రాజకీయ కారణాలతో 863 మంది నిర్బంధంలో ఉన్నారని ఆ సంస్థ అంచనా. ఖైదీల విడుదల వార్త వెలువడగానే దేశవ్యాప్తంగా జైళ్ల వద్ద కుటుంబ సభ్యులు గుమిగూడారు. వెనిజులా ప్రభుత్వం రాజకీయంగా సున్నిత సందర్భాల్లో ఖైదీలను 'బేరసారాల పావులా' ఉపయోగిస్తుందని విశ్లేషకులు అంటున్నారు. ఇదే సమయంలో అమెరికా వెనిజులా చమురు రవాణాపై నియంత్రణ పెంచుతూ రెండు ట్యాంకర్లను స్వాధీనం చేసుకోవడం, కొంతమంది ఆంక్షలను సడలించడం వంటి చర్యలు చేపట్టింది. వచ్చే వారం మాచాడో వాషింగ్టన్‌కు రావచ్చని, ఆమెను కలిసే అవకాశం ఉందని ట్రంప్ తెలిపారు.

# ట్రంప్‌కు మోదీ ఫోన్ చేయకపోవడంవల్లే..

## భారత్– అమెరికా వాణిజ్య ఒప్పందం కుదరలేదన్న లుట్నిక్



**న్యూయార్క్:** భారత్–అమెరికాల మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఇప్పటివరకు కుదరకపోవడానికి ప్రధాన కారణం ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఫోన్ చేయకపోవడమేనని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ చెప్పారు. 'ఆల్ ఇన్ పాడ్‌కాస్ట్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తాను మొదట యునైటెడ్ కింగ్‌డమ్‌తో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత, రెండు శుక్రవారాల్లో ఒప్పందం పూర్తిచేయాలి అని గడువు విధించామని, ఆ తర్వాత భారత్ తదుపరి దేశమని ట్రంప్ పలుమార్లు బహిరంగంగా చెప్పారని లుట్నిక్ గుర్తుచేశారు. 'మేము భారత్‌కు మూడు శుక్రవారాల గడువు ఇచ్చాం. అయితే ఒప్పందం తుది దశకు రావాలంటే మోడీ ట్రంప్‌కు ఫోన్ చేయాల్సి ఉండేది. కానీ భారత్ ఈ వ్యవస్థను అసౌకర్యంగా భావించింది. అందుకే మోదీ కాల్ చేయలేదు' అని ఆయన అన్నారు. ఆ గడువు ముగిసిన తర్వాత అమెరికా ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, వియత్నాంలతో వాణిజ్య ఒప్పందాలు ప్రకటించిందని లుట్నిక్ తెలిపారు. దీంతో భారత్ లైన్‌లో మరింత వెనక్కి వెళ్లిపోయింది అని ఆయన వ్యాఖ్యానించారు. తరువాత భారత్ సిద్ధమయ్యామని చెప్పినప్పటికీ, 'అప్పటికే రైలు స్టేషన్ వదిలి వెళ్లిపోయింది' అని వ్యాఖ్యానించారు. భారత్‌తో ఒప్పందం యుకె, వియత్నాంల మధ్యే పూర్తవాలని తాను ఆశించినప్పటికీ, దేశాల అంతర్గత రాజకీయాలు, పార్లమెంటు ఆమోద ప్రక్రియలు వంటి అంశాల వల్ల ఆలస్యం జరిగిందని లుట్నిక్ పేర్కొన్నారు. 'భారత్ చివరికి ఒప్పందం కుదుర్చుకుంటుంది, కానీ అనేక దేశాలు తమ తమ ప్రయోజనాలతో పోటీ పడుతున్నాయి' అంటూ ఈ ప్రక్రియ మరింత ఆలస్యమవుతుందనే సంకేతాలిచ్చారు. ఈ వ్యాఖ్యలు ట్రంప్ ఇటీవల చేసిన హెచ్చరికల నేపథ్యంలో రావడం గమనార్హం. రష్యా చమురు కొనుగోళ్లపై భారత్‌పై ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తూ, అవసరమైతే త్వరగా సుంకాలు పెంచవచ్చని ట్రంప్ చెప్పారు. ఇరు దేశాల మధ్య ఇప్పటివరకు ఆరు దఫాల చర్చలు జరిగినప్పటికీ, భారత వస్తువులపై ఉన్న 50 శాతం టారిఫ్‌ల పరిష్కారం సహా వాణిజ్య ఒప్పందం ఇంకా కుదరలేదు.

# తెలుగు రాష్ట్రాల మధ్య సౌహార్ద్ర వాతావరణం ఉంటేనే ప్రజల ప్రయోజనాలకు మేలు

## సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సౌహార్ద్ర వాతావరణం ఉంటేనే, ఉభయ రాష్ట్రాల అభివృద్ధికి, ప్రజల ప్రయోజనాలకు మేలు జరుగుతుందని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ అన్నారు. అనవసరమైన సెంటిమెంట్లను రెచ్చగొట్టడం అవసరం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు ముందడుగు వేసి తెలంగాణ ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమని ప్రకటించగా, మరోవైపు తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కూడా జల వివాదాలు, పోర్టులు, రవాణా వంటి అంశాలను పరస్పరం అనుసంధానంగా చర్చిస్తే మంచిదని నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధి ఆంధ్రప్రదేశ్‌కు, ఆంధ్రప్రదేశ్‌లోని సహజ వనరులు హైదరాబాద్ అభివృద్ధికి దోహదపడాలన్నారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చొని చర్చించుకోవడమే తెలుగు రాష్ట్రాలకు, తెలుగు ప్రజలకు శాశ్వత పరిష్కారమని నారాయణ అన్నారు. అనవసరమైన వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రయోజనం లేదని, అక్కడా, ఇక్కడా ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని వాడుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని తప్ప, నిజంగా తెలుగు ప్రజల శ్రేయస్సు కోరుకోవడం లేదని ఆయన చెప్పారు. ఇద్దరు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని చర్చించి, సమస్యను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని, ఇందుకు ఎవరి బెదిరింపులకు, బ్లాక్‌మెయిలింగ్‌లకు లోబడాల్సిన అవసరం లేదని, ఆ దిశగా దిశగా ముందడుగు వేయాలని నారాయణ కోరారు.

# పదేళ్లలో రైతు బంధు పేరుతో పలు పథకాలకు ఎగనామం

## మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ ప్రభుత్వంలో గత పదేళ్ల కాలంలో రైతు బంధు పేరుతో ఎన్ని పథకాలకు ఎగనామం పెట్టిందో తెలంగాణ రైతాంగానికి మొత్తం తెలుసని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. రైతుబంధు పేరుతో గత ప్రభుత్వం అన్ని పథకాలను నిలిపివేస్తే తాము ఈ సంవత్సరం అన్నింటినీ పునరుద్ధరిస్తున్నామని వివరించారు. తాము రైతుబంధును రూ.5 వేల నుండి రూ.6 వేలకు పెంచామని, రైతు భీమాను కొనసాగిస్తున్నామని, రెండేళ్ల కాలంలో రూ.1,05,000 కోట్లు రైతు సంక్షేమానికి ఖర్చు చేశామని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎరువుల కోసం సిద్దిపేట, గజ్వేల్‌లో క్యూ లైన్లు కట్టిన సందర్భాలు, క్యూ లైన్లలోనే రైతులు మరణించిన సందర్భాలు మరిచినట్టుగా ఉన్నారని ఎద్దేవా చేశారు.రైతులు కొనుగోలు చేయకుండానే 4.60 లక్షల టన్నులు ఈ యాసంగిలో అమ్ముడుపోయాయా? అని ప్రశ్నించారు.

వరి బోనస్ గురించి మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ నాయకులకు ఉందా..? వరి వేస్తే ఉరి అని అన్నారు కదా అని తుమ్మల గుర్తు చేశారు.

గత వానాకాలం కేంద్రం నుండి తగిన సమయంలో ఎరువులు అందకపోవడంతో కొన్ని రోజులు పడిన ఇబ్బందులును రాజకీయ లబ్ధి కోసం వాడుకోనున్నప్పటికీ, పంచాయతీ ఎన్నికలలో బిఆర్ఎస్‌కు రైతులు కర్రుకాల్చి వాత పెట్టారని తెలిపారు.

ప్రకృతి వైపరీత్యాల నష్టపరిహారం ఒకటి ఉంటుందనే స్పృహ కనీసం అధికారం కోల్పోయాకనైనా వచ్చిందన్నారు.

తాము వచ్చిన మొదటి సంవత్సరంలోనే రూ. 100 కోట్లు పరిహారం చెల్లించామని, రెండవ ఏడాది రూ.275 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు ఇచ్చామని వివరించా రు. యూరియా యాసంగి మొత్తానికి 10.40 లక్షల మెట్రిక్ టన్నులు అవసరమైతే ఇప్పటికీ 4.60 లక్షల మెట్రిక్ టన్నులు రైతులకు అందించామని, యాసంగికి కావాల్సిన ఎరువులో 6 లక్షల మెట్రిక్ టన్నులను డిసెంబర్ 31 కల్లా కేంద్రం నుండి తెప్పించామని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు.

గత ప్రభుత్వంలో ఐ.టి మంత్రిగా పనిచేసిన వారు కూడా రైతుల సౌకర్యార్థం ఒక యాప్‌ను తీసుకొస్తే ఊరూరా తిరిగి దాని మీదా లేని పోని అపోహలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సిద్దిపేట, గజ్వేల్‌లో 25 శాతం మందికి లక్ష రుపాయల రుణమాఫీ చేయ్యని విషయాన్ని దాచిపెట్టి , బ్యాంకులు సమర్పించిన డేటా ప్రకారం రెండు లక్షల రూపాయలలోపు వారందరికీ రుణమాఫీని చేసిన ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదమని మంత్రి తుమ్మల అన్నారు.

# సిబిఐ దర్యాప్తు కోరిన ఇడి

(మొదటి పేజీ తరువాయి)

అంచనాలు, పరిశోధన్ ఇన్‌పుట్‌లు, ఓటర్ల జాబితాకు సంబంధించిన అత్యంత సున్నితమైన సమాచారాన్ని ఈడీ స్వాధీనం చేసుకుందని టీఎంసీ ఆరోపించింది. 'ఇది ఏకపక్షంగా, దురుద్దేశపూర్వకంగా, అధికార దుర్వినియోగం చేయడమే'నని పేర్కొంది. ఈ పత్రాలకు, మనీలాండరింగ్ కేసుతో ఎలాంటి ప్రత్యక్ష, పరోక్ష సంబంధం లేదని టిఎంసి తన పిటిషన్‌లో తెలిపింది. ఇడి దర్యాప్తు ముసుగులో తమ పార్టీకి చెందిన రహస్యాలను చట్టవిరుద్ధంగా చూడడానికి ప్రయత్నిస్తున్నారని, ఇది స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికల ప్రక్రియను దెబ్బతీయడమేనని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది.

# ఇడి దుర్వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పులు ధరించి, బెనర్జీ ఊరేగింపు ముందుభాగాన నడిచారు. పార్టీ మద్దతుదారులకు అభివాదం చేశారు. పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఆందోళనల శ్రేణిలో ఈ మార్చ్ మొదటిదని టిఎంసి నాయకులు అన్నారు.

**అమిత్ షా కార్యాలయం ఎదుట టిఎంసి నిరసన**

కోల్‌కతాలోని ఐప్యాక్ కార్యాలయంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులను నిరసిస్తూ ఢిల్లీలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపిలు ఆందోళన చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ ఢిల్లీలోని కేంద్రహోం మంత్రి అమిత్ షా కార్యాలయం వద్ద ఎంపిలు నిరసనలు చేశారు. డెరెక్ ఓబ్రియెన్, మహువా మొయిత్రాతో సహా మరికొంత మంది ఎంపిలు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు పట్టుకొని అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బెంగాల్ అసంబ్లీ ఎన్నికల్లో గెలవడం కోసమే దర్యాప్తు సంస్థలను కేంద్రం పంపుతోందని ఎంపిలు ఆరోపించారు. తప్పుడు పద్ధతిలో ఇడి దాడులు చేస్తోందని ఆక్షేపించారు. అప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికల్లో గెలవడానికి బిజెపి చేస్తోన్న ప్రయత్నమని మండిపడ్డారు. ఈ విధంగా బిజెపి ఎన్నికలలో గెలవలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నిరసన చేస్తున్న ఎంపీలను అదుపులోకి తీసుకున్నారు. వారిని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 'అమిత్ షా ఇదెక్కడ అహంకార వైఖరి? ప్రజాస్వామ్యాన్ని అణిచివేయడానికి ఢిల్లీ పోలీసులను ఉపయోగించి ఎన్నికైన ప్రజా ప్రతినిధులపై దాడి చేస్తున్నారా? దేశంలోని అసమ్మతిని ఇలాగే అణచివేస్తారా? మీరు ఆందోళన చెందుతున్నారని ఒప్పుకోండి? ముందు ఇడిని సిగ్గులేకుండా దుర్వినియోగం చేశారు. ఇప్పుడు ఎనిమిది మంది ఎంపిల శాంతియుత చేస్తున్న ధర్నాపై దాడి చేశారు. ఈ నిరాశ మీ భయాన్ని బయటపెడుతుంది. ప్రజాస్వామ్యాన్ని ఉక్కిరిబిక్కిరి చేయడానికి ప్రయత్నించవచ్చు, కానీ బంగాల్ భయపడదు' అని తృణముల్ కాంగ్రెస్ ఒక ప్రకటనలో పేర్కొంది.

# 'సి–మిత్ర' అండ

(మొదటి పేజీ తరువాయి)

ఇంటి నుంచే పూర్తవుతుంది.

**సి–మిత్ర ఎలా ఉపయోగపడుతుంది?**

చాలామంది బాధితులకు ఫిర్యాదులో ఏం రాయా లి? ఏ సెక్షన్లు వర్తిస్తాయి? అనే సందేహాలు ఉంటాయి. అటువంటి వారికి 'సి మిత్ర' బృందమే స్వయంగా ఫోన్‌చేసి, వివరాలు సేకరించి, ఎఐ సాంకేతికతతో పక్కాగా ఫిర్యాదు డ్రాఫ్ట్‌ను సిద్ధం చేసి బాధితులకు పంపిస్తుంది. బాధితులు దాన్ని ప్రింట్ తీసుకుని, సంతకం చేసి సైబర్ మిత్ర హెల్ప్ డెస్క్, స్టేషన్ హౌజ్ ఆఫీసర్, క్రైమ్ పోలీస్ స్టేషన్, కమిషనర్ ఆఫీస్, బషీర్‌బాగ్, హైదరాబాద్ 500029 అనే అడ్రస్‌కు పోస్ట్ లేదా కొరియర్ ద్వారా పంపించాలి. అంతేకాదు, సైబర్ క్రైం పిఎస్ వద్ద డ్రాప్ బాక్స్ కూడా అందుబాటులో ఉంటుంది. సంతకం చేసిన ఫిర్యాదు కాపీలను అందులో వెయొచ్చు. ఆ ఫిర్యాదుల ఆధారంగా ఎఫ్ఐఆర్‌ను సైబర్ క్రైం పోలీసులు నమోదు చేస్తారు.

హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నివసిస్తున్న సైబర్ నేర బాధితులు మాత్రమే సిమిత్ర సేవలను పొందేందుకు అర్హులు.

**వర్చువల్ పద్ధతిలో ఫిర్యాదు.. ఎఐ పరిజ్ఞానంతో బాధితులకు సేవలు..** సి మిత్ర సేవలను పొందాలంటే బాధితులు 1930కి కాల్ గానీ, జాతీయ సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే సరిపోతుంది. ఆ వెంటనే సి మిత్ర బృందంలోని వర్చువల్ పోలీస్ ఆఫీసర్లు బాధితులకు కాల్ చేసి, వర్చువల్ పద్ధతిలో ఫిర్యాదు చేసే విధానాన్ని వివరిస్తారు. డ్రాఫ్ట్‌ను సిద్ధం చేసి బాధితులకు పంపిస్తారు. బాధితులు దానిని ప్రింట్ తీసుకుని, సంతకం చేసి పోస్ట్, కొరియర్, డ్రాప్ బాక్స్ ద్వారా పంపించాల్సి ఉంటుంది. భవిష్యత్తులో డిజిటల్ సంతకం ఆప్షన్ కూడా పరిశీలనలో ఉంది. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఆ వివరాలను సందేశరూపంలో బాధితులకు పంపిస్తారు. ఈ వర్చువల్ హెల్ప్‌డెస్క్ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. 24 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక బృందం, ఎఐ పరిజ్ఞానంతో బాధితులకు సేవలు అందిస్తుంది. సి మిత్ర అధికారిక ల్యాండ్‌లైన్ నంబర్: 040 41893111 నుంచి మాత్రమే కాల్స్ వస్తాయి. వాట్సాప్ ద్వారా సమాచారం కేవలం 87126 సిరీస్ నంబర్ల నుంచే వస్తుంది. సి మిత్ర పేరుతో వచ్చే నకిలీ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. సిమిత్ర సిబ్బంది ఎప్పుడూ ఓటిపి గానీ, డబ్బులు గానీ అడగరు. సి మిత్ర కేసును దర్యాప్తు చేయదు. పోయిన డబ్బును వెన క్కి ఇప్పిస్తామని హామీ ఇవ్వదు. చట్టపరమైన సలహాలు కూడా ఇవ్వదు.

కేసు స్టేటస్ తెలుసుకోవాలంటే సంబంధిత పోలీస్ స్టేషన్‌నే సంప్రదించాలి.

ఈ సందర్భంగా అడిషనల్ సిపి ఎం. శ్రీనివాసులు, సైబర్ క్రైమ్ డిసిపి ఎ. అరవింద్ బాబు, ఎసిపి శివమారుతితో పాటు వారి బృందంతో పాటు ఇందుకు సహకరించిన కారె కిరణ్ ప్రభాకర్, కె. అపూర్వ రావు, గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, సిహెచ్.రూపేశ్, బి. వెంకేశ్వర్లు, ఇతర డిసిపిలను, అధికారులను, సిబ్బందిని హైదరాబాద్ సిపి వి.సి.సజ్జనార్ అభినందించారు.

# వివాదాలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఒక్క అడుగు ముందుకు వేస్తే తెలంగాణ 10 అడుగులు ముందుకు వేస్తుంది అని రేవంత్ హామీ ఇచ్చారు.

**పెట్టుబడులకు లాభం వచ్చేలా ప్రణాళికలు**

పారిశ్రామికవేత్తలు పెట్టిన పెట్టుబడులకు లాభం వచ్చేలా ప్రభుత్వ ప్రణాళికలు సిద్ధం చేసిందని సిఎం అన్నారు. 1995 నుంచి 2025 వరకు 30 ఏళ్ల నిరంతర శ్రమ వల్లే హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీ పడగలుగుతోందన్నారు. జర్మన్ టెక్నాలజీతో దక్షిణ భారత దేశంలోనే ఐవి ఫ్లూయిడ్స్ తయారీలో గొప్ప సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా సుజెన్ మెడికేర్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని, గ్లోబల్ సమ్మిట్ ద్వారా తెలంగాణ పాలసీ డాక్యుమెంట్‌ను విడుదల చేశామని గుర్తుచేశారు. 'క్యూర్, ఫ్యూర్,రేర్' అనే మూడు భాగాలుగా తెలంగాణ అభివృద్ధి ఉంటుందని, 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమిగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ ఎకానమిగా తెలంగాణను తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ క్యూర్, ఫ్యూర్‌పై ఆధారపడి ఉంటుందని, ప్రపంచంలోని గొప్ప నగరాలతో హైదరాబాద్, తెలంగాణ పోటీ పడుతోందని, జర్మనీ, జపాన్, సౌత్ కొరియా, న్యూయార్క్‌లతో తెలంగాణ పోటీ పడుతోందన్నారు.



అందులో భాగంగా యువ పారిశ్రామిక వేత్తలు ప్రారంభించే పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. దేశంలో ఉత్పత్తి చేసే బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం తెలంగాణ నుంచి ఉత్పత్తి అవుతున్నాయని, ప్రపంచమే మనవైపు చూసేలా ఫార్మా రంగంలో రాణిస్తున్నామని, మన వద్ద చదువుకుని వెళ్లిన వారు గ్లోబల్ కంపెనీలకు సిఇఒలుగా ఉన్నారన్నారు. ఇది మనకు ఎంతో గర్వకారణం సిఎం గుర్తు చేశారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటే ప్రైవేట్ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. చేశారు. అంతకుముందు మంత్రి శ్రీధర్ బాబు మాట్లా డుతూ పరిశ్రమలకు అనుగుణంగా పాలసీలు ఉండాలని భావించి, ఆ కార్యాచరణతో ముందుకు వెళ్తున్నమన్నారు. మెడికేర్,ఫార్మా, లైఫ్‌సైన్స్‌కు సంబంధించిన ఇకో సిస్టంలో నాలుగు ప్రధాన నగరాలలో హైదరాబాద్ ప్రధానంగా ఉంటుందన్నారు. 2022తో పోలిస్తే 2025లో జిసిసిలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అన్ని రంగాలకు సంబంధించిన జి సి సి ల్లో 2.4 మిలియన్ స్క్వేర్ మిలియన్ ఫీట్లను కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాం. ఎఫ్‌డిఎ అనుమతులు పొందిన 200పైగా లైఫ్‌సైన్సెస్ కంపెనీలు హైదరాబాద్‌లోనే ఉన్నాయని చెప్పారు. విదేశీపెట్టుబడుల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని నిర్ణయించాం. పెట్టుబడులు పెట్టి ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వచ్చే కంపెనీలకు ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుంది.ప్రభుత్వ పాలసీలపై ఆధారపడే ఇప్పటి వరకు రూ.5.60 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ప్రభుత్వంతో ఎంఒయూ చేసుకున్న 60 శాతం కంపెనీలను ఇప్పటికే గ్రౌండింగ్ చేపట్టాం.త్వరలో దావోస్ కేంద్రంగా నిర్వహించే సదస్సులోనూ ఎంఎస్ఎంఈ, ఆర్టిఫిషియల్ టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ పాలసీలను వివరించబోతున్నాం.పేదవాడికి అందుబాటులో ఉండే విధంగా సుజెన్ ఉత్పత్తులు ఉండాలని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, టిజిఐఐసి చైర్మన్ టి.నిర్మల జగ్గారెడ్డి, చేవెళ్ల ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్‌లు పట్నం సునీత మహేందర్‌రెడ్డి, తీగల అనిత రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, కలెక్టర్ నారాయణ రెడ్డి, టిజిఐఐసి వైస్ ఎండి శశాంక, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ షహనావాజ్ ఖాసీం, టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నా రు.

# 1నే కేంద్ర బడ్జెట్!

(మొదటి పేజీ తరువాయి)

సమావేశం మొదటి రోజున రాష్ట్రపతి సంప్రదాయ ప్రసంగం ఉంటుంది. బీటింగ్ రిట్రీట్ వేడుక కారణంగా జనవరి 29న ఉభయ సభలు సమావేశం కావు. జనవరి 30న పార్లమెంట్ సమావేశమవుతుంది. ఆ రోజున ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. జనవరి 31న లోక్‌సభ, రాజ్యసభ సమావేశం కావు. కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1, ఆదివారం నాడు ప్రవేశపెట్టనున్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానం, కేంద్ర బడ్జెట్‌పై చర్చల తర్వాత, పార్లమెంట్ ఫిబ్రవరి 13న దాదాపు నెల రోజులపాటు విరామం కోసం వాయిదా పడుతుంది. పార్లమెంట్ మార్చి 9న తిరిగి సమావేశమవుతుంది. సమావేశాలు ఏప్రిల్ 2, గురువారం నాడు ముగుస్తాయి. సాధారణంగా పార్లమెంట్ శుక్రవారం నాడు వాయిదా పడుతుంది, కానీ ఏప్రిల్ 3న గుడ్‌ఫ్రైడే, ఆ తర్వాత వారాంతాన్ని దృష్టిలో ఉంచుకుని, సమావేశాలు ఏప్రిల్ 2న ముగిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. బడ్జెట్ సమావేశాల మధ్య ఇచ్చే ఈ విరామం, వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల గ్రాంట్ల డిమాండ్లను పరిశీలించడానికి విభాగానికి సంబంధించిన స్థాయీ సంఘాలకు సహాయ పడుతుంది.

# నిరుద్యోగులపై బిఆర్‌ఎస్‌ది కపట ప్రేమ

## మంత్రి శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్: నిరుద్యోగుల గురించి బిఆర్ ఎస్ నేతలు మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించి నట్లుగా ఉంది అని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. పదేళ్ల పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేసి, నిరుద్యోగుల జీవితాలను అంధకారం లోకి నెట్టిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తుంటే తెలంగాణ సమాజం నవ్వుకుంటోందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఎద్దేవా చేశారు. అశోక్‌నగర్ సెంట్రల్ లైబ్రరీ సాక్షిగా పదేళ్లపాటు నిరు ద్యోగులను వంచించిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని గుర్తు చేశారు. నోటిఫికేషన్ల పేరుతో ఊరించి, పరీక్షల పేరుతో వేధించి, లక్షలాది మంది యువత యవ్వనాన్ని రోడ్ల పాలు చేసింది మీరు కాదా? అని ప్రశ్నించారు. అధికా రంలో ఉన్నప్పుడు నిరుద్యోగులు గుర్తుకు రాకుండా, అధికారం కోల్పోయిన తర్వాతే వారికి ప్రేమ పుట్టిందా? అని నిలదీశారు.టిజిపిఎస్‌సి ప్రశ్నపత్రాల లీకేజీలపై కూడా మంత్రి తీవ్రంగా స్పందించారు. క్వశ్చన్ పేపర్లు బజార్లో పప్పుబెల్లాల్లా అమ్ముడుపోతుంటే కళ్లుమూసుకు న్నది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని విమర్శించారు. లీకేజీల కారణంగా లక్షలాది మంది నిరుద్యోగులు మానసిక వేదనకు గురైన పాపం మీది కాదా? అని ప్రశ్నించారు. గ్రూప్1 ప్రిలిమ్స్‌ను కూడా సక్రమంగా నిర్వహించలేక రెండు సార్లు రద్దు చేయడం వల్ల నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ భర్తీని ఎప్పుడూ తేలికగా తీసుకోలేదని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ఉద్యోగాల భర్తీని ఒక పవిత్ర కార్యంగా భావించి, ఎలాంటి లీకేజీలకు తావులేకుండా, అత్యంత పారదర్శ కంగా పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఇప్పటికే 70 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని, అందులో ఎక్కువ మంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారేనని పేర్కొన్నారు. గ్రూప్1, గ్రూప్2, గ్రూప్ 4 అపాయింట్‌మెంట్ ఆర్డర్లు జారీ చేశామని, త్వరలోనే గ్రూప్3 ఆర్డర్లను కూడా అందించేందుకు చర్యలు తీసు కుంటున్నామని వెల్లడించారు. శాసనమండలిలో తాను చేసిన వ్యాఖ్యలను కొందరు కావాలనే వక్రీకరిస్తున్నా రని, రాజకీయ లబ్ధి కోసం నిరుద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. నిరు ద్యోగులను తక్కువ చేయాలనే ఉద్దేశంతో తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, తెలంగాణ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది నిరుద్యోగులున్నారని, ప్రభుత్వ ఉద్యో గాల భర్తీతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగు ణంగా స్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్‌పై దృష్టి సారిం చి ప్రైవేట్ రంగంలోనూ ఉపాధి అవకాశాలు కల్పించేం దుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. జాబ్ క్యాలెండర్ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ఉందని, శాస్త్రీయబద్ధంగా ముందుకు వెళ్తామని చెప్పారు. చివరగా నిరుద్యోగ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ.. మా ప్రభుత్వ చేతల్లో నిబద్ధత ఉంది. మీ పట్ల మాకు బాధ్యత ఉంది. రాజకీయ నిరుద్యోగుల మాటలు నమ్మి మోసపోకండి. మీ భవిష్యత్తుకు కాంగ్రెస్ ప్రభుత్వం భరోసాగా ఉంటుంది అని శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు.

## గ్రేహౌండ్స్ డైరీని ఆవిష్కరించిన డిజిపి




ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివ ధర్ రెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో గ్రేహౌండ్స్ అధికారిక క్యాలెండర్‌తో పాటు 2026 డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డా.అనిల్ కుమార్, సిఐ సెల్ డిఐజి ఆర్.భాస్కరన్, శిక్షణ సలహాదారు కల్నల్ సోమేశ్వర్ సింగ్ సిన్సిన్వార్ (ఎస్.ఎం.), ఆపరేషన్స్ గ్రూప్ కమాండర్ జె. రాఘవేందర్ రెడ్డి, ట్రైనింగ్ గ్రూప్ కమాండర్ ఎన్.వి. సత్య శ్రీనివాస్ రావు, హెడ్‌క్వార్టర్స్ గ్రూప్ కమాండర్ ఎ. వెంకటేశ్వర్లు, ఆపరేషన్స్ ఒఎస్డి జి.దయానంద్, స్క్వాడ్రన్ కమాండర్ పి.వి. నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధంగా ఉండండి

### బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

ప్రజాపక్షం/హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికలకు సర్వ సన్నద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కెటి.రామారావు పిలుపు నిచ్చారు. బిఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు పార్టీ శ్రేణులంతా తమ శక్తి వంచన లేకుండా సరిహద్దులల్లో పనిచేసే సైనికుల్లాగా పనిచేయాల న్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వరంగల్, కరీంనగర్ జిల్లాకు సంబంధించిన జిల్లా అధ్యక్షులు, ప్రజాప్రతినిధులతో ముఖ్యనేతలతో కెటిఆర్ శుక్రవారం సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ తరపున అనుసరించాల్సిన వ్యూహం ,తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో కుప్పకూలిన పరిపాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజానీకం కాంగ్రెస్ పార్టీ పైన తీవ్ర ఆగ్రహంతో ఉన్నదన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి పంచాయతీ ఎన్నికల కంటే పెద్ద ఎదురు దెబ్బ తప్పదన్నారు. కేవలం రెండు సంవత్సరా ల్లోనే అధికార పక్షంపైన ఇంత తీవ్రమైన వ్యతిరేకత రావడం ఎప్పుడూ చూడలేదన్నారు. అసెంబ్లీ ఫలితాలు అనంతరం బిఆర్ఎస్ అనేక సవాళ్లను ఎదుర్కొని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమిని దాటుకుని, కాంగ్రెస్ ప్రభుత్వం పైన నిరంతర పోరాటం చేస్తూ మరోసారి ప్రజల మనసును చురగొన్నదని కెటిఆర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా గత 24 నెల లుగా పట్టణాల్లో ఉన్న సమస్యలను నిత్యం ప్రజల ముందు పెట్టాలని సూచించారు.

# రూ.51 లక్షల పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్: విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రభుత్వ నిధులు, సహజ వనరుల దుర్విని యోగంపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో నిజామాబాద్ జిల్లాలో అక్రమ పిడిఎస్ బియ్యం నిల్వ లపై, హైదరాబాద్ పరిసరాల్లో అక్రమ రవాణాపై భారీ దాడులు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్.సి.పురం యూని ట్ అధికారులు గురువారం రాత్రి నిజామాబాద్ జిల్లా ఖానాపూర్ గ్రామంలో మూతపడిన ఒక రైస్ మిల్‌పై ఆక స్మిక తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో టిఎస్16యు8287 నంబర్ గల ఆటోతో పాటు అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యాన్ని గుర్తించారు. ఎటువంటి అనుమ తులు లేకుండా బియ్యాన్ని సార్టెక్స్ చేస్తున్నట్లు నిర్ధారిం చిన అధికారులు పంచనామా నిర్వహించాలని జిల్లా పౌర సరఫరాల అధికారులను కోరారు. ఈ దాడిలో సుమారు 900 క్వింటాళ్ల పిడిస్ బియ్యం స్వాధీనం చేసు కోగా, వాటి విలువ సుమారు రూ.51 లక్షలుగా అంచనా వేశారు. స్వాధీనం చేసిన స్టాక్‌ను పౌర సరఫ



రాల శాఖకు అప్పగించి, నిత్యావసర వస్తువుల చట్టం కింద 6A కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టా లని సూచించారు.

### ఎన్‌హెచ్-44పై అర్ధరాత్రి వాహన తనిఖీలు

వరకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హైదరాబాద్ సిటీ2 యూనిట్ అధికారులు రవాణా, గనుల శాఖలతో కలిసి ఎన్‌హెచ్44పై జడ్చర్ల, రాజాపూర్, రాయకల్ టోల్ ప్లాజాల వద్ద శుక్రవారం తెల్లవారుజామున విస్తృత వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పన్ను చెల్లింపుల లోపాలు, ఓవర్‌లోడింగ్, జిఎస్‌టి, రాయల్టీ ఉల్లంఘనలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. రవా ణా శాఖ రూ.4.60 లక్షలు, వాణిజ్య పన్నుల శాఖ రూ.2.10 లక్షలు, గనుల శాఖ రూ.35 వేల జరిమానా లు విధించగా,మొత్తం రూ.7.05 లక్షల ఆదాయం గుర్తించారు. ఈ సందర్భంగా 9 వాహనాలను సీజ్ చేశారు.

### దుర్వినియోగంపై సమాచారం ఇవ్వండి

ప్రభుత్వ ఆదాయం దుర్వినియోగం కాకుండా చూడ టం, సహజ వనరుల అక్రమ వినియోగాన్ని అరికట్ట డమే విజిలెన్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రధాన లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ నిధులు లేదా వనరుల దుర్వినియోగానికి సంబంధించి సమా చారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 14432కు తెలియజేయా లని ప్రజలను కోరారు.


**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
ఆపరేషన్ : వికారాబాద్ సర్కిల్
టెండర్ నోటిఫికేషన్ నెం. 18/25-26
మెటీరియల్స్ అవసరం కోసం అర్హత కలిగిన బిడ్డర్ల నుండి బిడ్లు ఆహ్వానించడమైనది : 1) 44 N0's 33 KV 800A AB స్విచ్ ఫిక్స్‌డ్ కాంటాక్ట్ & 44 N0's 33 kv 800 AB స్విచ్ మూవింగ్ కాంటాక్ట్ 2) 33/11 KV మదన్‌పల్లి SS 11 పీలారం fdr frm యొక్క E/s fr బైఫర్‌కేషన్ 11 KV fdr 33/KV గిర్‌గెట్‌పల్లి SS యొక్క 3.8 కి.మీ. erec ద్వారా 3.8 కి.మీ. స్ట్రింగింగ్‌తో 11 KV లైన్ & 1 N0. 11 KV VCB యొక్క erec 33/11 KV గిర్‌గెట్‌పల్లి SS వద్ద VKB (T)లో ఉన్న bayలో 3) 11 KV పుట్టపహాడ్ AGL fdr frm యొక్క E/s fr బైఫర్‌కేషన్ 33/11 KV పుట్టపహాడ్ SS erec ద్వారా4.6 కి.మీ.11 KV fdr frm అదే SS తోపాటు KLKCలో పుట్టపహాడ్ 11 KV Bay & VCB వద్ద. మరిన్ని వివరాల కోసం దయచేసి www.tgsouthernpower.com వెబ్‌సైట్‌ను సందర్శించండి. పైన పేర్కొన్న వెబ్‌సైట్‌లో మెటీరియల్ స్పెసిఫికేషన్ వివరాలు ఉంచబడినాయి. ఫోన్ నెంబర్లు : 8712469736 లేదా 8712469716. Email-sevkbtgspdcl@gmail.com
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, ఆపరేషన్, TGSPDCL, వికారాబాద్ సర్కిల్.
DIPR R.O. No. : 13385-PP/CL/ADVT/1/2025-26, Date: 09-01-2026

దేవాదాయ-ధర్మదాయ శాఖ
**శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి)**
కేశవాపురం-జగన్నాథపురం గ్రా., పాల్వంచ మం., భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
Rc. No.SKDD/68/2025 నోటిఫిషన్ సవరణ తేది: 07-01-2026.
శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి), కేశవాపురం - జగన్నాధపురం గ్రామం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో క్యాడ్రంత్ ప్రకారం ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం తేది : 22.11.2025 న జారీ చేసిన నోటిఫికేషన్ నందని పాచక -1 ను అసిస్టెంట్ పాచక-1 గా సవరణ చేయనైనది.
అధ్యక్షులు & ధర్మకర్తల మండలి కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 13444-PP/CL/ADVT/1/2025-26, Date: 09-01-2026

**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
hmda Growing Global
స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500082
పబ్లిక్ నోటీస్
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (HMDA) మాస్టర్ ప్లాన్ యూనిట్ కోసం కాంట్రాక్ట్ ప్రాతిపదికన జూనియర్ అర్బన్ ప్లానర్లు, సీనియర్ అర్బన్ ప్లానర్లు & GIS స్పెషలిస్టుల పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
అవసరమైన విద్యార్హత, వృత్తిపరమైన అనుభవం, వీటికి సంబంధించిన సాధారణ నిబంధనలు, షరతుల వివరాల కోసం దయచేసి HMDA వెబ్‌సైట్ www.hmda.gov.inను సందర్శించండి.
HMDA కార్యదర్శికి దరఖాస్తును సమర్పించడానికి తుది గడువు తేదీ 24.01.2026 లేదా అంతకుముందు సాయంత్రం 5 గంటల వరకు.
సం/- మెట్రోపాలిటన్ కమిషనర్ HMDA.
DIPR R.O. No. : 13402-PP/CL/ADVT/1/2025-26, Date: 09-01-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
GHMC
సర్కిల్-17, జల్‌పల్లి.
టెండర్ నోటీసు
NIT No. 01/EEC-17/JLPY/GHMC/2025-26, తేది: 09.01.2026
**పని పేరు:** 3 పనుల కోసం 'జిహెచ్ఎంసి, జల్పల్లి సర్కిల్-17, వార్డ్ నెం. 64లోని పహాడీషరీఫ్ గ్రామంలో ఉన్న హజ్రత్ సయ్యదా బాబా షరఫుద్దీన్ (ర.అ.) దర్గా వద్ద రంగులు వేయడం, కంకర నింపడం, మరుగుదొడ్ల మరమ్మతులు మరియు లైటింగ్ వంటి అత్యవసర ఏర్పాట్లను చేపట్టడం............ జిహెచ్ఎంసి, జల్పల్లి సర్కిల్-17, డివిజన్ - 65లోని జల్పల్లి గ్రామంలో ఫిబ్రవరి నెలలో జరిగే గరిగూట మరియు పెదమ్మ జాతర కోసం లైట్లు, సౌండ్ సిస్టమ్, జనరేటర్, టెంట్ హౌస్ సామగ్రి మరియు పెయింటింగ్ వంటి అత్యవసర ఏర్పాట్లను చేపట్టడం', **అంచనా విలువ :** రూ.34.00 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 17.01.2026న మ.03.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా :** శ్రీ కె. శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జల్‌పల్లి డివిజన్ నెం.17, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, జల్‌పల్లి, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 13462-PP/CL/ADVT/1/2025-26, Date: 09-01-2026


# వందేళ్ల ఉద్యమాలు, త్యాగాల ఘన చరిత్ర సిపిఐ





## సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయండి

### రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం

ప్రజాపక్షం/హైదరాబాద్: ఖమ్మం నగ రంలో ఈ నెల 18న జరిగే సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయా లని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి, తెలం గాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం రాష్ట్ర వ్యాప్త ఆటో కార్మికులకు పిలుపునిచ్చారు. హైదరాబాద్, హిమాయత్ నగర్, సత్యనా రాయణ రెడ్డి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ తదితరులతో కలసి సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాల గోడ పత్రికను బి.వెంకటేశం ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా అయన మాట్లాడుతూ భారతదే శంలో 1925 ఆవిర్భవించి దేశ స్వతంత్రం కోసం ఎన్నో ఉద్యమాలు, ప్రాణ త్యాగాలు చేసిన సిపిఐ స్వాతంత్రం అనంతరం దేశం లో ఉన్న కార్మికులు, కర్షకుల సమస్యల పరిష్కారానికి వారిని ఏకం చేసి, పెద్ద ఎత్తున ఉద్యమం చేసిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని తెలిపారు. నాటి నుండి నేటి వరకు పేద, మధ్యతరగతి ప్రజల పక్షాన ఉంటూ ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటి కప్పుడు స్పందిస్తూ అనేక పోరాట రూపక ల్పన చేసింది సిపిఐ అని అన్నారు. ప్రభు త్వాల దృష్టికి తీసుకెళ్లి పేద ప్రజల సమస్య లను పరిష్కరించడం ఒక్క సిపిఐకే దక్కు తుందని పేర్కొన్నారు. కార్మికులు, కర్ష కులు, ప్రజల కోసం పని చేసే భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ముగింపు ఉత్స వాలలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఆటో డ్రైవర్లు పాల్గొని విజయవంతం చేయాలని బి.వెంకటేశం కోరారు. ఈ సమావేశంలో ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ నేత లు ఎస్.అశోక్, సిహెచ్. జంగయ్య, ఒమర్ ఖాన్, ఎం.కృష్ణ, ఎం.నరసింహ, శ్రీనివాస్, శ్యామ్ లాల్, మల్లి ఖార్జున్, కొంరెల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూడల్ శక్తులకు సిపిఐ సింహ స్వప్నం



బి.టి.రణదివె చంద్ర రాజేశ్వరరావు అజయ్ ఘోష్

రెండవ ప్రపంచ యుద్ధానం తర కాలం భారతదేశానికి సంఘటనా భరితమైంది. బ్రిటిష్ సామ్రాజ్యవాదం బల హీనపడింది. భారత జాతీ యోద్య మం ఉవ్వెత్తున ఎగిసి పడింది. భారతదేశ స్వాతం త్ర్యందిశగా పరిణామాలు సంభవిస్తున్నాయి. ఈకా లంలో సిపిఐ, ప్రజాసం ఘాలు అనేక చిరస్మరణీయమైన పోరాటాలు నిర్వహించాయి. వాటిలో సాయుధపోరాటాలు కూడా ఉన్నాయి.

### కయ్యూరు అమరులు, 1943

కేరళలోని మలబార్ ప్రాంతంలోని కయ్యూర్‌లో 1943మార్చి 29న నలుగురు యువ కమ్యూనిస్టు కామ్రేడ్స్‌ను ఉరి తీశారు. వారు 'కయ్యూర్ అమరులు'గా చరిత్రలో ప్రసిద్ధులైనారు. వారి పేర్లు: మదతలి అప్పు, కున్హంబు నాయర్, చిరుకుందన్, అబూబ కర్. పాతికేళ్లలోపు వయస్కులైన ఈ యువకులు కాంగ్రెస్ ఆర్గనై జర్లు, వలంటీర్లు. వారు కిసాన్ సభ ఏర్పాటు చేశారు. ఆప్రాం తంలో క్యాంపు ఉన్న మలబార్ స్పెషల్ పోలీస్ ప్రజలను వేధిస్తు న్నారు, స్త్రీల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. అందుకు నిరసనగా ఒక ప్రదర్శన నిర్వహించారు. స్త్రీలను అవమానించిన ఒక కానిస్టే బుల్‌ను జనాలు రాళ్లతో కొట్టి చంపారు. ఈసాకుతో పోలీసులు ఆ నలుగురిని అరెస్టు చేశారు. అంతమంది జనంలో కానిస్టేబుల్ హత్యకు ఆ నలుగురే కారకులని నిర్ధారించలేమని అంటూనే సెషన్స్ జడ్జి వారికి ఉరిశిక్ష విధించారు. అనంతర కాలంలో మల బార్ భగ్గుమంది. కమ్యూస్టులకు బలమైన కోటగా మారింది.

### తెలంగాణ సాయుధ పోరాటం(1946–48)

నిజాంల పాలనలో హైదరాబాద్ సంస్థానం మధ్యయుగాల ఫ్యూడల్ టెర్రర్‌కు, క్రూరమైన అణచివేతకు నిలయంగా ఉండింది. ప్రజలకు ఏ హక్కులూలేవు. భాషా, సంస్కృతులు అణచివేతకు గురైనాయి. వెట్టిచాకిరీ ప్రబలంగా ఉంది. ఈపరిస్థితుల్లో భాషా, సంస్కృతుల పరిరక్షణకు ఏర్పడిన ఆంధ్ర జన సంఘం– ఆంధ్రమ హాసభగా మారి గ్రామాల్లో దొరల ఆగడాలను ఎదిరించే సంఘంగా అభివృద్ధి చెందింది. 1945–46లో తెలంగాణలో రైతు ఉద్యమం వెట్టి, భూస్వాముల అక్రమ వసూళ్లు ధాన్యం లేవీకి వ్యతిరేకంగా ఆరంభ మైంది. మరోవైపున భూస్వా ముల, రజాకార్ల దురాగ తాలు మీదు మిక్కిలి అయి నాయి. ఆంధ్రమహాసభలో కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరిగింది. 1946 అక్టోబర్ నాటికి నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో రైతులు, పోలీసుల మధ్యఘర్షణలు మొదలైనాయి. ఆంధ్రమహాసభ పీడిత ప్రజా ఉద్యమంగా విస్తరించింది. భూస్వాముల భూములు ఆక్రమించి పంపిణీ చేయటం ఆరంభించింది. నిజాం దుష్పరిపాలనకు వ్యతిరే కంగా ఆంధ్రమహాసభ, స్టేట్ కాంగ్రెస్ శాసనోల్లంఘన ఉద్యమం ప్రారంభించాయి. ఇంతలో దేశానికి స్వాతంత్ర్యం లభించింది. అయితే స్వదేశీ సంస్థానాలు భారత్‌లో లేదా పాకిస్థాన్‌లో చేర వచ్చు లేదా స్వతంత్రంగాను ఉండవచ్చునన్న మౌంట్‌బాటన్ ప్రక టనను ఉపయోగించుకుని నిజాంనవాబు స్వతంత్రం ప్రకటించు కున్నాడు. ఆ పరిస్థితుల్లో హైదరాబాద్ సంస్థానం భారత యూని యన్‌లో చేరాలనే నినా దంతో, రజాకార్లను తుద ముట్టించి తెలంగాణను నిజాం ముష్కర పాలన నుంచి విముక్తి చేసేందుకు 1947 సెప్టెంబర్ 11న ఆంధ్రమహాసభ, సిపిఐ నాయకులు కామ్రేడ్ రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహి యుద్దీన్ సాయుధపోరాటానికి పిలుపు ఇచ్చారు. ఈ పోరాటానికి ఆంధ్రప్రాంతం వెనుక దన్నుగా నిలిచింది. దొరలంతా హైదరా బాద్ చేసి నిజాం రక్షణలో ఉన్నారు. విముక్తి దళాలు 10వేల ఎక రాలు భూమి పంపిణీ చేశాయి. ఆలస్యం ఆశాభంగం అని భావిం చిన నెహ్రూప్రభుత్వం కమ్యూనిస్టు ప్రభావం తగ్గించేందుకు 1948 సెప్టెంబరు 13న హైదరాబాద్‌కు తమ సైన్యాలు పంపింది. హోంమంత్రి సర్దార్ పటేల్ నిజాంతో సంధి కుదుర్చుకుని, అతన్ని రాజ్ ప్రముఖ్‌గా నియమించటం, ఆస్తులకు రక్షణ తదితర హామీలు ఇచ్చాక అతను లొంగిపోయాడు. హైదరాబాద్ స్టేట్ (సం స్థానం) భారత యూనియన్‌లో భాగమైంది. అప్పటివరకు ఉద్య మంతో ఉన్న మధ్య, ధనిక రైతులు, మధ్యతరగతులు వెనక్కి తగ్గారు. కమ్యూనిస్టులు ఆయుధాలు విడనాడి లొంగిపోవటానికి నిరాకరించడంతో మిలటరీ కమ్యూనిస్టు దళాల ఏరివేతకు ఉపక్ర మించింది.



రావినారాయణ రెడ్డి బద్దం ఎల్లారెడ్డి మఖ్దూం మొహియుద్దీన్

1948 సెప్టెంబరు వరకు పార్టీ పంథా సక్రమంగా ఉంది. అయితే 1948 ఫిబ్రవరి – మార్చిలో సిపిఐ రెండవ కాంగ్రె స్‌లో పార్టీ జాతీయ నాయకత్వంలో దేశ స్వాతంత్ర్యం, నెహ్రూ ప్రభుత్వంపట్ల పెడధోరణులతో తీసుకున్న కొత్త వైఖరి, పార్టీ ప్రధాన కార్యదర్శిగా పి.సి జోషిని తొలగించి, బిటి రణదివెను ఆ స్థానంలోకి తెచ్చింది. నెహ్రూ ప్రభుత్వాన్ని కూలద్రోసేందుకై తెలం గాణ సాయుధ పోరాటాన్ని కొనసాగించాలని నిర్ణయించింది. ఈ పిడివాద దుస్సాహసికి వైఖరి పార్టీకి తీవ్రమైన హాని చేసింది. ఈద శలోనే తెలంగాణ, ఆంధ్రల్లో 4వేల మందికిపైగా నాయకులు, కార్యకర్తలు హతం చేయబడ్డారు. ఇన్ని కష్టాలు ఎదురైనా పోరా టం విరమణపై పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వాల్లో ఏకాభిప్రా యం కుదరలేదు. చివరకు కేంద్రపార్టీ తరపున నలుగురు సభ్యుల బృందం (ఎస్.ఎ. డాంగే, అజయ్ ఘోష్, మాకినేని బసవ పున్నయ్య, చంద్ర రాజేశ్వరరావు) రహస్యంగా మాస్కో చేరుకుని సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకులతో, చివ రగా ప్రధాని జోసఫ్ స్టాలిన్‌తో సంభాషించిన అనంతరం, 1951 ప్రారంభంలో సాయుధ పోరాటం విరమించారు. 1952 తొలి సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ పాల్గొనాలని నిర్ణయించారు.

అంతకుమునుపు, 1950 జులైలో ప్రధానకార్యదర్శి పదవి నుంచి రణదివెను తొలగించి, తాత్కాలికంగా రాజేశ్వరా వును ఎన్నుకున్నారు. అయన నాయకత్వంలో, 'చైనా పంథా' (గె రిల్లా పోరాటం) కొద్దికాలం కొనసాగింది. ఆరు మాసాలలోపే ఆయన స్థానంలో అజయ్‌ఘోష్‌ను ప్రధాన కార్యదర్శిగా పార్టీ ఎన్నుకుంది. మాస్కోలో చర్చల్లో కూడా రాజేశ్వరావు, బసవ పున్నయ్య సాయుధ పోరాటం కొనసాగింపును సమర్ధించగా, డాంగే, అజయ్‌ఘోష్ వ్యతిరేకించారు. అయితే ఆంధ్ర, తెలంగాణ పార్టీలో ఆ బిన్న వైఖరులు అంతర్లీనంగా పొడచూపుతునే వచ్చా యని చెప్పవచ్చు. 1964లో సిపిఐని చీల్చి వేరుకుంపటి పెట్టుకు న్నవారు సాయుధ పోరాటాన్ని ప్రవచించారు. వారు ఆ పని చేయ టంలేదన్న నిరసనతో వారిని 'నయా రివిజనిస్టులు'గా ఆరోపిస్తూ ఒక విభాగం, సిపిఐ(ఎం) నుంచి వేరుపడి సాయుధపోరాటం చేశారు. తెలుగు గడ్డపై శ్రీకాకుళం పోరాటం'గా అది ప్రసిద్ధి. దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం క్రూరంగా అణచివేసింది. నక్సల్ బరీ ఉద్యమం పీపుల్స్ వార్‌గా అనంతరం అనేక శాఖోపశాఖలుగా చీలి సాయుధపోరాటం కొనసాగించాయి. అనేక గ్రూపులు అంత రించగా, సిపిఐ(ఎం ఎల్) పేరుతో అదే పంథా సాగిస్తున్న మావోయిస్టులనబడే కమ్యూ నిస్టులను హోంమంత్రి అమిత్ షా ప్రస్తుతం భౌతికంగా రూపుమా పుతున్నాడు.

### పున్నప్ర–వాయలార్ పోరాటం, 1946

పున్నప్ర కేరళ అలెప్పీ జిల్లాలో ఒక గ్రామం, వాయలార్ చేర్తాల పట్టణ సమీప గ్రామం. పున్నప్రలో ప్రజలు తాటాకు గుడిసెల్లో తలదాచుకుంటూ దుర్భర జీవితం గడుపుతుండేవారు. వారు ప్రధానంగా మత్స్యకారులు. సిపిఐ మత్స్యకార్మికుల యూనియ న్‌ను, కల్లుగీత కార్మిక సంఘాన్ని ఏర్పా టు చేసింది. 1943లో కరువు కాలంలో వాయలార్‌లో 21వేల మందికి పైగా ప్రజలు ఆక లితో చనిపోయారు. సిపిఐ ఇక్కడ కూడా మత్స్యకారుల సంఘా లు ఏర్పాటు చేసింది. వేతనాల పెంపుదలకు ఆందోళనలు నిర్వహి స్తున్నది. అలెప్పీ చేర్తాల, ముహమ్మల్లో మూడు రోజుల సమ్మె చేప ట్టారు. చౌకధరలకు ఆహారం విక్రయించటానికి యజమానులు అంగీకరించటంతో ఆ సమ్మె ముగిసింది. అయితే ట్రావెన్కూర్ దివాన్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు సమీకృతం కావటాన్ని సహించలేక ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నాలు చేశారు. 1946 సెప్టెంబర్ 3న చేర్తాలలో సైన్యం దిగింది. టి.వి.థామస్ అధ్యక్షతన సమావేశమైన ట్రేడ్ యూనియన్‌లు 1946 అక్టోబర్ 22న సార్వ త్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి. అందుకు ముందే భూస్వాములు, పోలీసు, పాలనాయంత్రాంగం ప్రజలపై దాడులు మొదలుపె ట్టింది. ఒక కార్మికుణ్ణి చంపారు. రోజూ 20–30 మందిని నిర్బం ధిస్తున్నారు. చేర్తాల లాకప్‌లో 300లకు పైగా కార్మికుల్ని బంధిం చారు.

పున్నప్రాలో సైన్యం క్యాంపు పెట్టింది. అక్టోబర్ 24న కార్మికులు చాలా పెద్ద ప్రదర్శన తీశారు. దివాన్ పాలనకు వ్యతిరే కంగా నినాదాలు చేశారు. పోలీసులకు, ప్రజలకు మధ్య ఘర్షణలు జరిగాయి. పెద్దగా కాల్పులు జరిగాయి. అనేక మంది కార్మికులు, కొందరు పోలీసులు చనిపోయారు. చేర్తాలలో కూడా అక్టోబర్ 25 న ఘర్షణల్లో ఒక కామ్రేడ్ చని పోయాడు. 1946అక్టోబర్ 31 న సార్వత్రిక సమ్మె విరమించ బడింది. అక్టోబర్ 27న దా దా పు 400మంది సైనికులు పడవల్లో వాయలార్ క్యాంపు సమీపంలో దిగారు. సాయంత్రం వరకు కాల్పులు జరిగాయి. వాయలార్‌లో కాల్పులతో పున్నపు–చాయలార్ పోరాటం తొలిదశ ముగిసింది.




### తేభాగ ఉద్యమం, 1946

ఇది బెంగాల్‌లో తాము పండించిన పంటలో న్యాయమైన వాటా డిమాండ్ చేస్తూ కౌలు రైతులు (ప్రాలికాపులు లేదా బర్గాదార్‌లు) సాగించిన పోరాటం. 1946 శరదృతువు (సెప్టెంబర్–నవంబ ర్)లో 19 జిల్లాల్లోని పదు ల వేలమంది పాలికాపులు పొలాల నుంచి పంట మొత్తం తీసు కెళ్లారు. మూడింట రెండు వంతులు(దాన్నుంచి వచ్చిందే తేభాగ పేరు) తమకు దక్కాలన్నది వారి డిమాం డ్. జోత్‌దార్ల(భూ స్వాములు) గుండాలను వారు విల్లంబులు, బరి సెలు, కర్రలు, చివరకు తుపాకులతో సైతం ఎది రించారు. కింది స్థాయి నుంచి అయత్నంగా వచ్చిన ఉద్యమాన్ని సిపిఐ, రైతు సంఘం తేభాగ కమిటీలు ఏర్పరచి ఆర్గనైజ్ చేసింది.

పి.సి జోషీ చాలా సమర్ధవంతంగా మార్గదర్శకత్వం వహించారు. అపరిపక్వంగా సాయుధ పోరాటం వంటి తప్పు చర్యలు, ఎత్తుగడల తప్పిదాలను నిరోధించారు.

### ఆర్ఐఎన్ తిరుగుబాటు, 1946

ప్రజా తిరుగుబాటు పోలీసు, సైన్యంలోకి కూడా విస్తరించింది. ఎఐటియుసి, ఎఐఎస్‌ఎఫ్ కీలకపాత్ర వహించాయి. 1946 జనవ రిలో 1500 మంది ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది సమ్మె చేశారు. రాయల్ ఇండియన్ నేవీ సమ్మె పెద్ద సాయుధ తిరుగుబా టుగా అభివృద్ధి చెందింది. 'తల్వార్' అనే ఓడపై ప్రారంభమైన సమ్మె విస్తరించింది. ఫిబ్రవరి 21 నాటికి మొత్తం ఆర్ఐఎన్ సమ్మె లో చేరింది. బొంబాయిలో విద్యార్థులు, కార్మికులు సమ్మె చేశారు. బ్రిటిష్ సైనికులు నగరంలో ప్రవేశించారు. అనేక రోజుల పాటు నగరంలో సాయుధ ఘర్షణలు జరిగాయి. 300 మందికిపైగా చనిపోయారు. సమ్మె చేసిన నావికులు తమ ఓడలపై కాంగ్రెస్, ముస్లింలీగ్ జెండాలతో పాటు సిపిఐ జెండాలు కూడా ఎగురవే శారు. అదీ సిపిఐ పొందిన గుర్తింపు. సమ్మె జబల్‌పూర్, కరాచీ, విశాఖపట్నం, కలకత్తా తదితర ప్రదేశాలకు విస్తరించింది.

సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ ఫౌజ్‌కు చెందిన ఐఎన్ఎ ఖైదీలు జనరల్ గురుబక్ష్ సింగ్ ధిల్లాన్, మేజర్ జనరల్ షా నవాజ్‌ఖాన్, కల్నల్ ప్రేం సెహగల్ విడుదల కోసం సిపిఐ, ప్రజాసంఘాలు ఆందోళన చేశాయి. 1945 నవంబర్ 21 దేశవ్యా ప్తంగా ఐఎన్ఎ దినం పాటించబడింది.

వయోజన ఓటింగ్ ప్రాతిపదికపై రాజ్యాంగ నిర్ణాయక సభ కోసం సిపిఐ 1946లో డిమాండ్ చేసింది.

### క్యాబినెట్ మిషన్, 1946

రాజ్యాంగ అసెంబ్లీకి ఎన్నికలు ప్రకటించబడ్డాయి. 14 శాతం మందికి మాత్రమే ఓటు హక్కు ప్రాతిపదికపై ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర అసెంబ్లీల నుంచి 930 మంది కాంగ్రెస్ సభ్యులు, 497 మంది ముస్లిం లీగ్ సభ్యులు ఎన్నికైనారు. సిపిఐ 7 లక్షల ఓట్లతో 9 సీట్లు గెలుచుకుంది. 11 ప్రావిన్స్‌లో 9 చోట్ల కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పాటు చేసింది. ఈ లెజిస్లేటర్లు రాజ్యాంగ సభ్యు లను ఎన్నుకున్నారు. సిపిఐ నుంచి బెంగాల్‌లోని 3 సీట్లకు ప్రాతి నిధ్యం వహిస్తూ సోమనాథ లాహిరి ఆ సభకు ఎన్నికయ్యారు. 1947 ఆగస్టు 15న స్వాతంత్రం సిద్ధించే వరకు కొనసాగారు. దేశ విభజనతో తూర్పు బెంగాల్ పాకిస్తాన్‌కు వెళ్లడంతో లాహిరి ప్రాతి నిధ్యం వహిస్తున్న మూడు సీట్లలో ఒకటి పాకిస్తాన్‌కు వెళ్ళింది. ఆయన రాజీనామా చేశారు.

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వ ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టారు. రాజ్యాంగ సభ మూడున్నర సంవత్సరాలు–1949 నవంబర్ వరకు పనిచేసింది. 1950 జన వరి 26న భారత రాజ్యాంగం ప్రకటించబడింది.

– ఎమ్మెస్సార్



## క్రీడలతో మానసిక ఉల్లాసం

డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/దేవరకొండ:** క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు, సమాజంలో గౌరవ ప్రతిష్టలు లభిస్తాయని ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండలోని జెడ్పీహైస్కూల్ లో నేనావత్ అఖిలాషనాయక్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్స్ ఎంఎల్ఏ బాలునాయక్ ప్రారంభించారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వాహకులతో క్రీడలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ బాలునాయక్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఉన్న క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీయడానికే టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారుల అభివృద్ధికి ఎప్పుడూ అండగా ఉంటానని ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాలను నిర్మాణాలకి తీసుకొస్తానని అన్నారు. ఈకార్యక్రమానికి స్పాన్సర్ నేనావత్ అఖిలాషనాయక్, ఎంఎల్ఏ బాలునాయక్ సతీమణి జ్యోతి ప్రసన్న, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌విటి, ఆలంపల్లి నర్సింహా, జాన్‌యాదవ్, డిఎస్పి శ్రీనివాస్, వెంకటయ్యగౌడ్, సిరాజ్‌ఖాన్, శ్రీశైలం, వేణుధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మున్సిపాలిటీల్లో గెలుపునకు ప్రణాళిక

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల వారీగా ఎక్కడికక్కడ సమస్యల పరిష్కారం దిశగా ప్రజా పాలన ప్రభుత్వం దూసుకెళుతుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన టూరిజం పార్కు హాల్లో సన్నాహక సమావేశంలో పాల్గొని మున్సిపాలిటీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపు కోసం శక్తి వంచన లేకుండా పనిచేసి చైర్మన్ స్థానాలను కైవసం చేసుకునేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో ఎలాంటి బేషజాలకు పోకుండా కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని మండల, పట్టణ ముఖ్య నాయకులకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం పోచంపల్లి మండలం వంకమామిడి గ్రామంలో 33/11 KV సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశ్వర్లు డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, మండల అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, పట్టణ అధ్యక్షులు భారత లవ కుమార్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మళ్ళీ అధికారంలోకి రాదు

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విమర్శ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** కాంగ్రెస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి రాదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సూర్యాపేట నియోజక వర్గం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి రాదనే తీరుతో అడ్డూఅదుపు లేని పాలన సాగిస్తోందని ఆయన అన్నారు. రాష్ట్ర పరిస్థితి రోజు రోజుకి దిగజారుతోందని వ్యాఖ్యానించారు. కెసిఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, అయితే ఈ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం పూర్తిగా ఆగమైందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలకు అభివృద్ధి చేయడం కంటే దోచుకోవడమే తెలుసని విమర్శించారు. సాగునీరు మాత్రమే కాకుండా తాగునీరు కూడా సక్రమంగా అందించలేని పరిస్థితి నెలకొందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మాట దేవుడెరుగు గాని, కెసిఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అమలు చేయలేకపోతున్నారని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు నిమ్మల శ్రీనివాస్, నెమ్మాది బిక్షం, జీడి బిక్షం పాల్గొన్నారు.

## హైవేపై రోడ్డుభద్రత చర్యలు



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** సంక్రాంతి పండుగ జాతీయ రహదారి 65పై అధిక వాహనాల రద్దీ ఉంటుంది. దీని దృష్ట్యా జాతీయ రహదారి 65 రోడ్డు భద్రతా చర్యలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి నరసింహ శుక్రవారం స్థానిక డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, కోదాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ గోపాల్ రెడ్డిలతో కలిసి జాతీయ రహదారి 65పై కొమరబండ వై జంక్షన్ వద్ద తీసుకున్న రోడ్డుభద్రత చర్యలను, రోడ్డు మరమ్మత్తు పనులను పరిశీలించారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వాహనాలు నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత జాతీయ రహదారుల అధికారులతో కలిసి అవసరమైన చోట భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. వాహనదారులకు తెలిసేలా డైరెక్షన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఎక్కడ కూడా ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు. వాహనదారులు వేగాన్ని నియంత్రించుకోవాలని నియమ నిబంధనలు పాటిస్తూ ముందుకు వెళ్లాలని కోరారు.

## కెజిబివి హాస్టళ్ల అకస్మిక తనిఖీలు



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల కేంద్రంలోని బిసి,ఎస్‌సి కేజీబీవీ వసతి గృహాలను జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం శుక్రవారం ఎంఎస్ ఓపి.దేవరాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్‌సి బాలుర హాస్టల్ వార్డెన్ జయరామ్ ను మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజన అందించాలని సూచించారు. అన్ని రికార్డులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎస్‌సిబాలికల హాస్టల్లో ఉన్న సమస్యలను తక్షణమే సమస్యలను పూర్తి చేయించాలని వార్డెన్ లింగయ్యను ఆదేశించారు.విద్యార్థులకు బాత్రూములు, నీటి వసతి సదుపాయం సరిగా లేవని తనిఖీలో గుర్తించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జునరావు, కేజీబీవీ స్పెషల్ అధికారి అరుణ, హాస్టల్ వార్డెన్ లింగయ్య, జయరాం, ఉన్నారు.

# తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాలో రాజీపడేది లేదు

రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** తెలంగాణ రాష్ట్రానికి దక్కాల్సిన నీటి వాటాలో రాజీపడేది లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కోదాడ పట్టణంలో శుక్రవారం 08 కోట్లతో నిర్మిస్తున్న ఆర్ అండ్‌బి గెస్ట్‌హౌజ్, డివిజన్ కార్యాలయాలు, రూ.04 కోట్లతో నిర్మిస్తున్న కోర్టు బిల్డింగ్‌ను, రూ.5.10 కోట్లతో నిర్మిస్తున్న ఇరిగేషన్ డివిజన్ కార్యాలయం పనుల పురోగతిని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి పరిశీలించి పనులు నాణ్యతతో నిర్మిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి మాట్లాడుతూ కృష్ణానది నీటి పంపకాల్లో గత ప్రభుత్వం తెలంగాణకు 34 శాతం (299 టిఎంసిలు), ఆంధ్రకు 66శాతం (512 టిఎంసీలు) అంగీకారం చేసుకోవడం వల్ల ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలు నష్టపోయాయని, ప్రజాప్రభుత్వం ఏర్పడిన మొదటి నుండి కృష్ణా జలాలో 71 శాతం తెలంగాణకు దక్కేలా పోరాడుతున్నామని అన్నారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలలో 17 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌లో నీటిపారుదల రంగానికి 1.83 లక్షల కోట్లు కేటాయించినప్పటికీ కృష్ణానదిపై తలపెట్టిన పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి బీమా, నెట్టెంపాడు, కొడంగల్, నారాయణపేట, డిండి, ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టులు పూర్తి చేయలేదని మేము అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని, వచ్చే మూడు సంవత్సరాల్లో కృష్ణానదిపై నిర్మాణంలో ఉన్న అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ తెలిపారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాహకం వల్ల నష్టపోయిన కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటాలో ఒక నీటి చుక్కను వదులుకొమని వాటా కోసం సుప్రీంకోర్టుకు, కేంద్ర ప్రభుత్వం, కృష్ణ జల సంఘం, నది ట్రిబ్యూనల్స్ ముందు బలమైన వాదనలు వినిపించి సాధిస్తామని తెలిపారు. కోదాడ నియోజకవర్గంలో నిర్మిస్తున్న రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్, శాంతినగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి చేయాలని, పాలేరు వాగుపై చెక్‌డ్యామ్, పాలవరం లిఫ్ట్ ఇరిగేషన్‌కు, నడిగూడెంలోని చౌదరి చెరువు వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాలని, చిలుకూరు వద్ద ముత్యాల బ్రాంచ్ కెనాల్‌పై డబుల్ బ్రిడ్జి, పాలే అన్నారంలో బ్రిడ్జి పనులు త్వరగా ప్రారంభించి ఎండకాలం చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. మోతె లిఫ్ట్ ఇరిగేషన్‌కు భూ సేకరణ కోసం రైతులకు న్యాయమైన నష్టపరిహారం అందించాలని ఆర్డీవోను అదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్‌నందల్‌లాల్ పవార్, ఇరిగేషన్ సిఈ రమేష్‌బాబు, ఎస్ఇలు నాగభూషణం, శివతేజ, అర్అండ్‌బి ఈఈ సీతరామయ్య, ఆర్డీవోలు సూర్యనారాయణ, వేణు మాదవ్, తహసిల్దార్ వాజీద్‌అలీ పాల్గొన్నారు.

## ఎసిబికి చిక్కిన గానుగబండ గ్రామ కార్యదర్శి బర్పటి కృష్ణ

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం గానుగబండ పంచాయతీ కార్యదర్శి ఓ వ్యక్తి ఇంటి నిర్మాణ పర్మిషన్ కోసం లంచం తీసుకుంటుండగా ఏసిబి అధికారులు దాడిచేసి పట్టుకున్న సంఘటన శుక్రవారం గానుగబండ గ్రామంలో చోటుచేసుకుంది. తుంగతుర్తి మండలం గానుగబండ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంటి పర్మిషన్ కోసం రూ.6వేల లంచం అడుగుతున్నట్లుగా ఫిర్యాదు మేరకు రూ.6వేల లంచం గ్రామ కార్యదర్శి బర్పటి కృష్ణకు ఇస్తుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఉమ్మడి నల్లగొండ ఎసిబి డిఎస్‌పి జగదీష్ చంద్రతోపాటు అధికారులు దాడిలో పాల్గొన్నారు. ప్రస్తుతం కుక్కడం గ్రామంలో కృష్ణ ఇంటి వద్ద, ఆఫీసుల్లో సోదాలు జరిపి కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.



## అంబరాన్నంటేలా చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు

రూ. 100 కోట్ల మాస్టర్ ప్లాన్‌తో చెర్వుగట్టు అభివృద్ధి

జాతర సమీక్ష సమావేశంలో కలెక్టర్, ఎంపి చామల, ఎమ్మెల్యే వేముల సూచనలు



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** భక్తులకు కొంగు బంగారంగా నిలుచే శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించి సంబరాలు అంబరాని అంటేలా అధికారులు సమన్వయతో పని చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేషం పేర్కొన్నారు.చెర్వుగట్టులోని దేవస్థానం ప్రాంగణంలో వార్షిక బ్రాహ్మతవాలను ఈ నెల 23 నుండి 30వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకుదేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంకు ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విచ్చేశారు.ఈ ఆయన మాట్లాడుతూ అంతర్ రాష్ట్రాల నుండి లక్షలాదిగా తరలి వచ్చే భక్తులకు సౌకర్యాలు, ఏలాంటి అసౌకర్యం కల్గకుండాఅధికారులు సమన్వయముతో పనిచేయాలన్నారు. భక్తులు దేవస్థానం చేరుకునే విధంగా ఏపి లింగోటం నుండి,ఉన్న రహదారిని ఎల్లారెడ్డి గూడెం నుండి వచ్చే రహదారులను మంత్రి కోమటిరెడ్డి రెడ్డి వెంకట్ రెడ్డి సహకారం తో విస్తరణ పనులు చేపడుతమన్నారు.100 కోట్లతో మాస్టర్ ప్లాన్ చేసి దేవాలయ అభివృద్ధికి తొడపతనన్నారు.ఈ సన్నాహక సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,ఆర్‌డిఓవై. అశోక్ రెడ్డి, డిఎస్‌పి శివరాం రెడ్డి,దేవాలయ ఈవో మోహన్,తహసిల్దార్ వెంకటేశ్వర రావు,ఆలయ ప్రధానఅర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ లతో పాటు వివిధ శాఖల అధికారులు,చెర్వుగట్టు,ఎల్లారెడ్డి గూడెం సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల గొంతుక 'ప్రజాపక్షం'

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ప్రజా సమస్యలకు గొంతుకగా నిలుస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడే ప్రజాపక్షం పత్రిక ఆధ్వర్యంలో నూతన సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్‌ను తహసిల్దార్ పి.శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాపక్షం క్యాలెండర్ ప్రజల పక్షాన నిలిచే పోరాటాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజా పక్షం పత్రిక కార్మికులు, మహిళలు, రైతులు, దళితులు, పేదల సమస్యలు నిరంతరం వెలుగులోకి తీసుకువస్తూ ప్రజల మనసులో స్థానం సంపాదించుకుందని కొనియాడారు. ప్రజా ఉద్యమాలు, సామాజికన్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణకు అంకితమైన ప్రజాపక్షం క్యాలెండర్ ప్రతి ఇంట్లో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కే.శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, ప్రజాపక్షం రిపోర్టర్ కలకొండ సంజీవ, మండల కార్యవర్గ సభ్యులు పల్లె మల్లారెడ్డి, వీరమల్ల యాదయ్య, సర్పంచ్ ముత్యాల అంజయ్య పాల్గొన్నారు.

## ఆహార ఉత్పత్తుల కేంద్రాలపై విస్తృత తనిఖీలు



నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రజలకు సురక్షితమైన ఆహారాన్ని అందించడంలో భాగంగా ఆహార భద్రత అధికారులు హోటల్లు,దాబాలు,తినుబండారాలు, ఆహార ఉత్పత్తుల కేంద్రాలపై విస్తృత తనిఖీలు,దాడులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.శుక్రవారం తన చాంబర్లో నిర్వహించిన జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆహార భద్రత అధికారులు జిల్లాలోని అన్ని పాఠశాలలు,హాస్టళ్ళు,అంగన్వాడి కేంద్రాలు,ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల నుండి ఆహార శాంపిల్లు సేకరించాలని ఆదేశించారు.ఎవరైనా కల్తీ ఆహారం అమ్ముతున్నట్లయితే కేసులు నమోదు చేయాలని చెప్పారు. ప్రజలు కల్తీ ఆహారం వల్ల అనారోగ్యం పాలు కాకుండా ఆహార భద్రత అధికారులు తనిఖీలు నిర్వహించి విస్తృత ప్రచారం నిర్వహించాలని చెప్పారు. అలాగే రహదారి 65 జాతీయ రహదారిపై ఉన్న హోటల్లు,దాబాలను ఆకస్మిక తనిఖీలు,దాడులు నిర్వహించి ఆహారాన్ని తనిఖీ చేయాలని చెప్పారు. సంక్రాంతిని దృష్టిలో ఉంచుకొని 65వ జాతీయ రహదారిపై హోటల్లు, దాబాలలో నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేసే విధంగా తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.స్తినివాస్,అదనపు ఎస్‌పి రమేష్,అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి, ఫుడ్ సేఫ్టీ అధికారి శివశంకర్ రెడ్డి,జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్,జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి,సంక్షేమ అధికారి కృష్ణవేణి,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్,డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## సార్థకనామం 'ప్రజాపక్షం'

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/వలిగొండ :** ప్రజా సమస్యలను నిర్భయంగా, నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకువస్తూ ప్రజాపక్షం పత్రిక విశ్వసనీయతను చాటుకుంటుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. వలిగొండ మండల కేంద్రంలో ప్రజాపక్షం రిపోర్టర్ బొడిగె సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఎమ్మెల్యే కుంభం మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికల పాత్ర కీలకమని సామాజిక బాధ్యతతో వార్తలను అందించడంతోపాటు ప్రతి అక్షరం ప్రజల కోసం ప్రజాపక్షం ముందుండటం అభినందనీయమని అన్నారు. ప్రజాపక్షం వలిగొండ రిపోర్టర్ బొడిగె సుదర్శన్ గౌడ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో వలిగొండ సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి, మాజీ ఎంపీపీ నూతి రమేష్, డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు గరిసె రవి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పాశం సత్తి రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కంకల కిష్టయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బత్తిని సహదేవ్ పాల్గొన్నారు.

## త్వరగా భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు



**ప్రజాపక్షం/బీబీనగర్ :** భూభారతిలో ఉన్న పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. శుక్రవారం బీబీనగర్‌లోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, భూభారతి పెండింగ్ దరఖాస్తులపై రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. మండలంలోని ఒక్కో గ్రామం వారీగా పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను ఎలా పరిష్కరించాలనే విషయాలపై కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన ఆర్జీలను, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని అన్నారు. ఆర్జీలను తిరస్కరించినట్లైతే అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. చిన్నచిన్న కారణాలతో ఆర్జీలను తిరస్కరించకూడదని, అర్హులైన వారికి యాజమాన్య హక్కులు కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలని హితవు పలికారు. ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా, పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలని, భూభారతి చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా పని చేయాలన్నారు. తదుపరి సమీక్ష నాటికి స్పష్టమైన ప్రగతి కనిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అనంతరం మండలం జైనపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గ్రామంలో మొత్తం ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని, వాటిలో ఎన్ని ఇండ్లు నిర్మాణాలు పూర్తయ్యే దశలో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. వివిధ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేపట్టాలన్నారు. అదే విధంగా పూర్తి చేసిన వెంటనే డబ్బులు మీ ఖాతాలో జమ అవుతాయన్నారు. రెండో విడతలో కూడా ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది కాబట్టి మీ గ్రామంలో ఇప్పటి వరకు మంజూరు అయినంత వరకు ఇండ్ల పనులు త్వరగా పూర్తి చేస్తే కొత్త ఇండ్లు మంజూరు అవుతాయని తెలిపారు.

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



**ప్రజాపక్షం/కోదాడ:** యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారకుండా తమ భవిష్యత్‌పై దృష్టా సారించాలని కోదాడ సీనియర్ సివిల్ జడ్జి కె.సురేష్ అన్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కోదాడ పట్టణంలోని స్థానిక విజన్ కళాశాలలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, మైనర్ డ్రైవింగ్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత స్వామి వివేకనంద ఆదర్శాలను అనుసరించి క్రమశిక్షణతో ముందుకు సాగిత ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. విద్యార్థ దశలోనే చట్టాలపై అవగాహన పెంపోందించుకుంటే సమాజంలో నేర ప్రవృత్తి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు ఉయ్యాల నర్సయ్య, కళాశాల ప్రిన్సిపాల్ జి. సైదయ్య, వైస్ ప్రిన్సిపాల్ అంజద్, డైరెక్టర్ షరిఫ్, అశోక్, సైదిరెడ్డి, సాధిక్, సీతరాం, శ్రీనివాసరావు, న్యాయవాదులు సీతరామరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## నూరుశాతం ఫలితాలే లక్ష్యం

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రాబోయే పదవ తరగతి వార్షిక పరీక్షల్లో జిల్లాలో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించుటకు ప్రతి ఎంఇఓ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని మండల విద్యాధికారులతో విద్యాశాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే 10వ తరగతి వార్షిక పరీక్షలలో ప్రతి పాఠశాల నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలని అలాగే విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతులు, విద్యార్థులకు అభ్యాసనన పుస్తకాలు అందించాలన్నారు. 2 ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించాలని, ప్రతి విద్యార్థికి ఎగ్జామ్‌ప్యాడ్, పెన్, పెన్సిల్, స్కేల్ ఇవ్వాలని సంబంధిత ఏంఇఓలను ఆదేశించారు. అలాగే 9, 10వ తరగతి ఎస్‌సి విద్యార్థులకు ప్రీ మెట్రిక్స్ ఉపకార వేతనాలకు సంబంధించి దరఖాస్తులను సమర్పించాలని అవసరమైతే మండల తహశీల్దార్ సహాయంతో మీసేవ సెంటర్ సిబ్బందిని పాఠశాలలకు పిలిపించి విద్యార్థుల కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలను తీసుకొని దరఖాస్తులను జనవరి 20వ తేదీలోపు సమర్పించాలని ఆదేశించారు. సంక్రాంతి పండుగ సెలవులు తదుపరి పాఠశాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవసరమైతే గ్రామ పంచాయితీ సిబ్బంది ద్వారా పారిశుద్ధ్య పనులు చేయించాలని అన్నారు. మధ్యాహ్న భోజనం బియ్యం స్టాక్ పెట్టుకోవాలని అన్నారు. సర్వశిక్ష అభియాన్ కూడా సమీక్షించారు. డిఇఓ అశోక్, ఎస్‌సి కార్పోరేషన్ సంక్షేమ అధికారి దయానందరాణి, కోఆర్డినేటర్లు రాంబాబు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్‌కు పరిమితిని పెంచాలి

సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/మునుగోడు:** పేద ప్రజలు ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ప్రభుత్వం ఇస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి(సిఎంఆర్‌ఎఫ్) పరిమితిని పెంచాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు.మునుగోడు నియోజకవర్గంలోని నారాయణపురం,మునుగోడు, మర్రిగూడ, చౌటుప్పల్ మండలాలలో వైద్యం చేయించుకున లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను శుక్రవారం సిపిఐ కార్యాలయంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకొని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్య రంగానికి పెద్దపీట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుజ రామచంద్రం,బొల్గూ రి నరసింహ,తీర్పారి వెంకటేశ్వర్లు,జిల్లా సమితి సభ్యులుసురిగి చలపతి,మండల కార్యదర్శి చాపల శ్రీను, కైలాస్ పాల్గొన్నారు.

**ఉపాధి హామీ ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపచేయాలని వినతి**

గ్రామీణ అభివృద్ధి సంస్థలో గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపచేసే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఉపాధి హామీ ఉద్యోగులు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# 'భ్రష్ట' జనతా పార్టీ



బిజెపికి కొత్త అర్థం చెప్పిన రాహుల్‌గాంధీ

వివిధ రాష్ట్రాల్లోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలపై మండిపాటు

అధికార దుర్వినియోగం, అహంకార విషంతో ప్రజల జీవితాలను నాశనం చేశాయని విమర్శ

**న్యూఢిల్లీ :** భారతీయ జనతా పార్టీకి లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ కొత్త అర్థం చెప్పారు. ఆ పార్టీని ఆయన 'భ్రష్ట జనతా పార్టీ'గా అభివర్ణించారు. వివిధ రాష్ట్రాల్లోని డబుల్‌ఇంజిన్ ప్రభుత్వాలు అవినీతి, అధికార దుర్వినియోగం, అహంకార విషంతో ప్రజల జీవితాలను నాశనం చేశాయని ఆరోపించారు. ఉత్తరాఖండ్‌లో అంకితా భండారి హత్య, ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ అత్యాచార కేసు, ఇండోర్‌లో కలుషిత నీరు తాగి మరణించడం వంటి వాటిని రాహుల్‌గాంధీ ఉదహరిస్తూ కాషాయ పార్టీపై నిప్పులు చెరిగారు. 'దేశవ్యాప్తంగా 'భ్రష్ట' జనతా పార్టీ డబుల్‌ఇంజిన్ ప్రభుత్వాలు ప్రజల జీవితాలను నాశనం చేశాయి. అవినీతి, అధికార దుర్వినియోగం, అహంకార విషం బిజెపి రాజకీయాల్లో పైనుండి క్రింది వరకు వ్యాపించాయి' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు హిందీలో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. వారి సృష్టించుకున్న వ్యవస్థలో, పేదలు, నిస్సహాయులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజల జీవితాలు కేవలం గణాంకాలు మాత్రమేనని, అభివృద్ధి పేరుతో దోపిడీ వ్యవస్థ నడుస్తోందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. 'ఉత్తరాఖండ్‌లో అంకితా భండారి దారుణ హత్య యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అధికారంలో ఉన్నవారు ఏ బిజెపి విఐపిని రక్షిస్తున్నారు అనే ప్రశ్న మిగిలే ఉంది. చట్టం అందరికీ ఎప్పుడు సమానంగా వర్తిస్తుందా అని ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ కేసులో అధికార అహంకారం కారణంగా నేరస్థులను ఎలా రక్షించారో, న్యాయం కోసం బాధితురాలు ఎంత మూల్యం చెల్లించుకోవలసి వచ్చిందో యావత్ దేశం చూసిందని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ఇండోర్‌లో కలుషిత నీరు తాగి మరణించినా లేదా గుజరాత్, హర్యానా, ఢిల్లీ నుండి కలుషిత నీరు, కలుషిత సరఫరాపై ఫిర్యాదులు వచ్చినా వ్యాధి భయం సర్వత్రా ఉందని పేర్కొన్నారు. 'రాజస్థాన్‌లోని ఆరావళీ పర్వత శ్రేణి నుండి ఇతర సహజ వనరుల వరకు బిలియనీర్ల అత్యాశ, స్వార్థం ఎక్కడెక్కడకు చేరిందో, అక్కడ నిబంధనలు కాలరాశారలని, పర్వతాలను పెకిలిస్తూ అడవులను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతిఫలంగా ప్రజలకు దుమ్ము, కాలుష్యం, విపత్తులు మిగులుతున్నాయని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దగ్గు సిరప్ వల్ల పిల్లల మరణాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో ఎలుకలు నవజాత శిశువులను చంపడం, ప్రభుత్వ పాఠశాలల పైకప్పులు కూలిపోవడం ఇవన్నీ నిర్లక్ష్యానికి పరాకాష్ట కాదా అని ప్రశ్నిస్తూ అవినీతికి ప్రత్యక్ష పర్యవసానం అని ఆయన ఆరోపించారు. 'వంతెనలు కూలిపోతాయి, రోడ్లు కుంగిపోతాయి, రైలు ప్రమాదాల్లో కుటుంబాలు తుడిచిపెట్టుకుపోతాయి, అయినా ప్రతిసారీ బిజెపి ప్రభుత్వం ఒకే పని చేస్తుంది: ఫోటోలకు పోజులివ్వడం, ట్వీట్లు చేయడం, పరిహారం ఇచ్చే తంతు పూర్తి చేయడం' అని రాహుల్ ఎద్దేవా చేశారు. 'మోదీ జీ డబుల్ ఇంజిన్ నడుస్తోంది, కానీ అది కేవలం బిలియనీర్ల కోసమే. సామాన్య భారతీయుడికి, అవినీతితో కూడిన ఈ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అభివృద్ధి వేగం కాదు. విధ్వంస వేగం ప్రతిరోజూ ఎవరో ఒకరి జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తోంది' అని మాజీ కాంగ్రెస్ అధినేత 'భ్రష్ట జనతా పార్టీ' అనే హ్యాష్‌ట్యాగ్‌ను ఉపయోగిస్తూ ఆరోపించారు.

## వైద్య కళాశాలలో నిర్లక్ష్యంపై

# న్యాయమైన దర్యాప్తు జరపాలి

వయనాడ్ ఎంపి ప్రియాంకాగాంధీ వాద్రా డిమాండ్



**వయనాడ్ :** కేరళ వయనాడ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జరిగిన వైద్యపరమైన లోపానికి సంబంధించి న్యాయమైన దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా డిమాండ్ చేశారు. ప్రసవం తర్వాత ఒక మహిళ కడుపులో వస్త్రం ముక్కను వదిలి వేసినట్లు తెలుస్తోంది. దీంతో తల్లి వైద్యపరమైన లోపానికి తీవ్ర నొప్పిని ఎదుర్కొందని, ఇది ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని ప్రియాంకా కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జ్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఆ మహిళ ఫిర్యాదుకు ప్రతిస్పందనగా జిల్లా వైద్య అధికారి ఆదేశించిన దర్యాప్తు నిష్పాక్షికంగా, న్యాయబద్ధంగా చేపడుతారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కేరళ ప్రజారోగ్య వ్యవస్థ మెజారిటీ ప్రజలకు వైద్య చికిత్సను అందుబాటులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించినప్పటికీ, తన వయనాడ్ పార్లమెంటరీ నియోజకవర్గంలో ప్రజలకు కీలకమైన జీవనాడి అయిన మనంతవాడి వైద్య కళాశాల తీవ్రమైన వనరుల పరిమితులతో ఇబ్బంది పడుతోందని వాద్రా పేర్కొన్నారు. సిబ్బంది, కీలకమైన వైద్య పరికరాలు లేకపోవడం కీలక సమస్యలుగా ఆమె పేర్కొన్నారు. ఈ ఆందోళనలను గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో లేవనెత్తారని కూడా ఆమె పేర్కొన్నారు. మనంతవాడి మెడికల్ కాలేజీలో అనేక స్పెషాలిటీలు లేకపోవడం వల్ల రోగులు కోజికోడ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలకు 80 కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సి వస్తుందని కాంగ్రెస్ ఎంపి ఎత్తి చూపారు. దురదృష్టవశాత్తు, ఆసుపత్రి సామర్థ్యం పెరగడం వల్ల అందించబడే సంరక్షణ నాణ్యత ప్రభావితం అవుతుందని, గతంలో ప్రాణాంతకంగా నిరూపించబడిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సమర్థవంతమైన జవాబుదారీతనం, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలను నిర్ధారించాలని వాద్రా ప్రభుత్వాన్ని కోరారు. ఆరోపించిన లోపంపై నిష్పాక్షిక దర్యాప్తుకు పిలుపునిచ్చారు. సమర్థవంతంగా పనిచేయడానికి, నాణ్యమైన సంరక్షణను అందించడానికి ఆసుపత్రికి తగినంత వనరుల కేటాయింపును కూడా ఆమె అభ్యర్థించారు. 'ఈ ప్రాంతంలో నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను పొందడంలో ఇప్పటికీ ఇబ్బంది పడుతున్న వయనాడ్ ప్రజలకు ఇది అత్యవసర అవసరం అని ఆమె పేర్కొన్నారు.

## కొత్త ప్రత్యేక కార్యదర్శి ఆనంద్ స్వరూప్

నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం



**న్యూఢిల్లీ :** ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిగా(అంతర్గత భద్రత) సీనియర్ ఐపిఎస్ అధికారి ఆనంద్ స్వరూప్ నియామకానికి కేంద్రం ఆమోద తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ నియామకాల కమిటీ (ఎసిసి), ప్రస్తుత అధికారి ప్రవీణ్ వశిష్ట స్థానంలో కొత్త ప్రత్యేక కార్యదర్శిని నియమించడానికి ఆమోదం తెలిపినట్లు ఒక ప్రభుత్వ ఉత్తర్వు తెలిపింది. ఉత్తరప్రదేశ్ క్యాడర్‌కు చెందిన 1992 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన స్వరూప్, ప్రస్తుతం జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి)లో డిజి(ఐ)గా పనిచేస్తున్నారు. అతని పదవీకాలం బాధ్యతలు స్వీకరించిన తేదీ నుండి ఆగస్టు 31, 2029 వరకు, అంటే అతని పదవీ విరమణ తేదీ వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ మూడింటిలో ఏది ముందు అయితే అది వర్తిస్తుందని ఆ ఉత్తర్వు పేర్కొంది. సశస్త్ర సీమా బల్‌లో ప్రత్యేక డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న 1994 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అనుపమ నిలేకర్ చంద్రను, స్వరూప్ స్థానంలో ఎన్‌హెచ్‌ఆర్‌సిలో డైరెక్టర్ జనరల్ (విచారణ)గా నియమించడానికి కూడా ఎఐసిసి ఆమోదం తెలిపింది.

## చాలా రాజకీయ పార్టీలు

# సిద్ధాంతాలను వదిలిపెడుతున్నాయ్

తమ బలాన్ని పెంచుకునేందుకు ఎత్తుగడలు వేస్తున్నాయ్

ఎన్‌సిపి చీఫ్ అజిత్ పవార్


పుణె, పింప్రి--చించ్వాడ్‌లోని స్థానిక బిజెపి నాయకత్వంపై విమర్శలు



**పుణె :** రాజకీయాల్లో సైద్ధాంతిక నిబద్ధత క్రమంగా క్షీణిస్తోందని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. చాలా రాజకీయ పార్టీలు సిద్ధాంతాలను వదిలిపెట్టి, తమ బలాన్ని పెంచుకోవడానికి ఎత్తుగడలు వేస్తున్నాయని ఆరోపించారు. పిటిఐకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అజిత్ పవార్ మాట్లాడుతూ నాయకులను ప్రలోభాలకు గురిచేసి లేదా బెదిరించి పార్టీలు మార్చేలా చేస్తున్నారని, దీంతో పార్టీ ఫిరాయింపులు విపరీతంగా పెరిగిపోయాయని అన్నారు. పుణె, పింప్రి–చించ్వాడ్‌లోని స్థానిక బిజెపి నాయకత్వంపై విమర్శలు చేశారు. ఈ మధ్య కాలంలో రాజకీయ పార్టీలు తమ తమ సిద్ధాంతాలకు మంగళం పాడాయని, నాయకులు ఎక్కడికి పడితే అక్కడికి వెళ్తున్నాని, వారికి నచ్చినట్లుగా చేస్తున్నాని పవార్ పేర్కొన్నారు. కొంతమంది నాయకులను ప్రలోభాలతో తమ పార్టీలోకి లాక్కుంటున్నారని, మరికొందరిపై ఉన్న పెండింగ్ విచారణలను ప్రస్తావించి, పార్టీ మారితే దర్యాప్తు సంస్థలను మేనేజ్ చేస్తామని హామీ ఇచ్చి ఒత్తిడి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాజకీయ రంగంలో డబ్బు, కండబలాన్ని బహిరంగంగా వాడుతున్నారని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) అధిపతిగా ఉన్న పవార్ అన్నారు. డబ్బు, కండబలం ఉన్నవారు వాటిని వాడుకుంటున్నారని, కుల సమస్యలను రెచ్చగొట్టి ఓట్లు పొందవచ్చని భావించేవారు ఆ ఎత్తుగడను అనుసరిస్తున్నారని పార్టీ నాయకులు, కార్యకర్తల తరచు ఫిరాయింపులపై అడిగిన ప్రశ్నకు పవార్ సమాధానమిచ్చారు. ఒక అభ్యర్థిని నాయకుడిగా అతను ఏమి చేశాడనే దానిపై కాకుండా, ఎన్నికల్లో గెలిచే అవకాశాల ఆధారంగా అంచనా వేస్తున్నారని పవార్ ఆవేదన వ్యక్తం చేశారు. అభ్యర్థుల ప్రజాదరణను అంచనా వేయడానికి సర్వేలను ఉపయోగించే కొత్త ధోరణి వచ్చిందని ఆయన చెప్పారు. ఒక నిర్దిష్ట ప్రాంతంలో అత్యంత ప్రజాదరణ పొందిన అభ్యర్థి ఎవరో తెలుసుకోవడానికి సర్వేలను ఉపయోగిస్తున్నారని, ఒకవేళ ఆ వ్యక్తి ప్రతిపక్ష పార్టీకి చెందినవాడైతే, అతడిని లేదా ఆమెను తమ పార్టీలోకి లాక్కోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల ముందు అజిత్ పవార్ బిజెపిపై విమర్శలు చేయడం గమనార్హం. మహారాష్ట్ర తొలి ముఖ్యమంత్రి యశ్వంతరావు చవాన్ రాజకీయాలను ప్రశంసిస్తూ... ఆయన ప్రతిపక్ష పార్టీ నాయకులకు కూడా సమాన గౌరవం ఇచ్చేవారని పవార్ పేర్కొన్నారు. ఆ వ్యక్తి ప్రతిపక్షానికి చెందినవాడా కాదా అని ఆలోచించకుండా నిధులను పంపిణీ చేసేవారన్నారు. అయితే, సంవత్సరాలు గడిచేకొద్దీ, ఒక రకమైన కక్ష సాధింపు రాజకీయాలు ప్రవేశించాయని, ఇది జరగకూడదన్నారు. పుణె, పింప్రి–చించ్వాడ్‌లోని బిజెపి స్థానిక నాయకత్వంపై తన విమర్శలను కొనసాగిస్తూ, గత ఎనిమిది, తొమ్మిది సంవత్సరాలుగా భారీగా ఖర్చు చేసినప్పటికీ, వారి దూరదృష్టి లేకపోవడం ఈ రెండు మున్సిపల్ సంస్థలను సంక్షోభంలోకి నెట్టిందని పవార్ ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న మహాకూటమిలో భాగస్వాములైనప్పటికీ, బిజెపి, ఎన్‌సిపి ఈ రెండు నగరాల్లో మున్సిపల్ ఎన్నికలలో స్వతంత్రంగా పోటీ చేస్తున్నాయి. ప్రచార సమయంలో మిత్రపక్షాలను లక్ష్యంగా చేసుకోకుండా ఉండాలని బిజెపి పవార్‌ను కోరుతోంది. 1992 నుండి 2017 వరకు ఎన్‌సిపి అధికారంలో ఉన్నప్పుడు పింప్రి –చించ్వాడ మున్సిపల్ కార్పొరేషన్ (పిసిఎంసి)లో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి జరిగిందని, అయితే 2017 నుండి 2022 వరకు బిజెపి హయాంలో అవినీతి, ఆర్థిక దుర్వినియోగం చోటుచేసుకున్నాయని పవార్ ఆరోపించారు. 1992 నుండి 2017 వరకు, పింప్రి–చించ్వాడ సూక్ష్మ ప్రణాళికతో అభివృద్ధి చేయబడింది. పటిష్టమైన ఆర్థిక నిర్వహణష సమర్థవంతమైన నాయకత్వం కారణంగా ఈ కార్పొరేషన్ ఆసియాలోనే అత్యంత ధనిక పౌర సంస్థగా అవతరించింది. మా హయాంలో రుణాలు తీసుకోవాల్సిన అవసరం గానీ, బాండ్లు జారీ చేయాల్సిన అవసరం గానీ రాలేదు, అని పవార్ పేర్కొన్నారు. గత బిజెపి నేతృత్వంలోని హయాంలో బాండ్లు సేకరించారని ఆయన ఆరోపించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో, అలాగే పరిశుభ్రత కార్యక్రమాలు, వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన పనులలో అవకతవకలు జరిగాయని పేర్కొన్నారు. గత ఎనిమిది నుండి తొమ్మిది సంవత్సరాలలో సుమారు రూ. 60,000 కోట్లు ఖర్చు చేశారు. కానీ ఆ పని క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు, అని పవార్ అన్నారు. కేంద్రంలో, మహారాష్ట్రలో బిజెపితో అధికారాన్ని పంచుకుంటున్నప్పటికీ, తాను ఆ పార్టీపైనే విమర్శలు చేస్తున్నారనే విమర్శలకు స్పందిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికలు పౌర సమస్యల ఆధారంగా జరుగుతాయని పవార్ అన్నారు. జాతీయ, రాష్ట్ర ఎన్నికలు వేర్వేరు అని అన్నారు. దేశాన్ని, రాష్ట్రాన్ని ఎవరికి అప్పగించాలో ఓటర్లకు తెలుసు అని, పౌర ఎన్నికలు స్థానిక సమస్యలకు సంబంధించినవని పేరొకన్నారు. తాము పుణె, పిసిఎంసిలలో పౌరులు ఎదుర్కొంటున్న సమస్యలను లేవనెత్తుతున్నామన్నారు. పుణె, పింప్రి–చించ్వాడ్‌లో ఎన్‌సిపిఎన్‌సిపి(ఎస్‌పి) పొత్తుపై పవార్ మాట్లాడుతూ అది ముందుగా ప్రణాళిక వేసుకుని చేసింది కాదని అన్నారు. కలిసి పోటీ చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని స్థానిక పార్టీ కార్యకర్తలు భావించారు. ఆ విధంగానే ఈ పొత్తు ఏర్పడింది, అని ఆయన చెప్పారు.

## బంగారు తాపడాల వివాదం

# శబరిమల ఆలయ ప్రధాన పూజారి అరెస్ట్




**తిరువనంతపురం:** శబరిమల బంగారం తాపడాల కేసులో భాగంగా ఆలయ ప్రధాన పూజారి (తంత్రి) కందరారు రాజీవరును సిట్ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయం 4.30 గంటల సమయంలో సిట్ అధికారుల బృందం ఆయన్ను అదుపులోకి తీసుకొని విచారించి, అనంతరం అరెస్టు చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉన్నికృష్ణన్ పొట్టితో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు సిట్ అధికారులు గుర్తించారు. తరువాత బంగారు తాపడాల చోరీ కేసులో ఆయన పాత్ర కూడా ఉన్నట్లు విచారణలో తేలడంతో అరెస్టు చేసినట్లు సమాచారం. బంగారు తాపడాల దొంగతనం గురించి తంత్రికి ముందే తెలుసని వారు వెల్లడించారు. మరోవైపు, ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉన్నికృష్ణన్ పొట్టిని శబరిమలకి సహాయకుడిగా తీసుకువచ్చింది తంత్రియేనని సమాచారం. అయితే అక్కడికి చేరుకున్న తర్వాత పొట్టి, ఉన్నత స్థాయి పరిచయాలను ఏర్పరచుకున్నారని, తద్వారా బంగారు పూతను రాగి పూతగా నమోదు చేసి బంగారాన్ని దొంగిలించారని తెలుస్తోంది. అయితే పొట్టి ఇలా చేయడానికి అవకాశం కల్పించింది మాత్రం తంత్రి అని ఇతర నిందితులు తమ వాగ్మూలంలో పేర్కొన్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు, బంగారం కుంభకోణం గురించి తంత్రికి తెలుసునని నిందితులు విచారణలో చెప్పినట్లుగా అధికారులు తెలిపారు. ఈ క్రమంలో బంగారు పూతను అక్రమంగా రవాణా చేయడానికి ఇద్దరూ కుట్ర పన్నారని సిట్ పేర్కొంది. వాస్తవానికి ఆలయంలో అన్ని విషయాలకు తంత్రి అనుమతి తప్పనిసరి. అయితే ఆలయం నుంచి వస్తువులను బయటకు తీసుకెళ్లడానికి మాత్రం తాను అనుమతి ఇవ్వలేదని పూజారి వాదించారు.

## ఉద్యోగం కోసం భూమి' స్కాంలో...

# లాలూ సహా కుటుంబసభ్యులపై అభియోగాలు

ఢిల్లీ కోర్టు ఆదేశం

సొంతానికి భూమిని రాయించుకునేందుకు ఒక నేరపూరిత వ్యవస్థగా పనిచేశారని ప్రత్యేక జడ్జి వెల్లడి



**న్యూఢిల్లీ :** 'ఉద్యోగం కోసం భూమి' కుంభకోణం ఉదంతం ఆర్‌జెడి చీఫ్, మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ సహా ఆయన కుటుంబానికి అవినీతి ఉచ్చు బిగుస్తోంది. శుక్రవారం ఢిల్లీ కోర్టు లాలూ ప్రసాద్ యాదవ్ సహా ఆయన కుటుంబ సభ్యులు, ఇతరులపై అభియోగాలు నమోదు చేయాలని ఆదేశించింది. ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే మాట్లాడుతూ రైల్వే మంత్రిత్వ శాఖను లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే అధికారులు, సన్నిహితుల సహకారంతో తన సొంత సామ్రాజ్యంగా భావించి, దుర్మార్గపు విధానాలు ప్రవేశపెట్టారని ఆయనపై ఆరోపణలు గుప్పించారు. 'ఉద్యోగం కోసం భూమి' విధానాన్ని అమలు చేసి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని వివరించారు. ఈ భూమిని లాలూ తన పేరిట లేదా తమ కుటుంబ సభ్యుల పేరిట ఆస్తులను రాయించుకున్నారని న్యాయమూర్తి అన్నారు. ఆర్డర్‌లోని ముఖ్యమైన భాగాన్ని మౌఖింగా ప్రకటించిన న్యాయమూర్తి విశాల్ గోగ్నే మాట్లాడుతూ సిబిఐ తుది నివేదిక తీవ్రమైన అనుమానం అనే గీటురాయిపై విస్తృతమైన ప్రతికూలతలను వెల్లడించిందని పేర్కొన్నారు. మాజీ రైల్వే మంత్రి, ఇతరులు భూమిని ఆక్రమించుకోవడానికి నేరపూరిత వ్యవస్థగా పనిచేయడం జరిగిందన్నారు. రైల్వే అధికారుల నిర్ణయం దుర్వినియోగం జరిగిందని న్యాయమూర్తి వారి ధోరణిని ఎత్తిచూపారు. వివరించిన విధంగా నేరారోపణలో అభియోగపత్రం వివరణ చాలా ముఖ్యమైనదన్నారు. ఈ కేసులో కోర్టు 41మందిపై అభియోగాలు మోపింది. వీరిలో 52మందిని విడుదల చేశారు. అందులో రైల్వే అధికారులు సహా భూమికి సంబంధించని వ్యక్తులు కూడా ఉన్నారు. అయితే అందులో ఐదుగురు మరణించారు. అంతకుముందు ఈ కేసులో నిందితుల స్థితిపై సిబిఐ ధృవీకరణ నివేదికను సమర్పించింది. అభియోగపత్రంలోని 103 మంది నిందితుల్లో ఐదుగురు మరణించారని తెలిపింది. ఈ అభియోగాలపై కోర్టు ఈ విషయాన్ని అధికారికంగా విచారించడానికి జనవరి 23కు విచారణను వాయిదా వేసింది. అయితే దీనికి సంబంధించి వివరణాత్మక ఆర్డర్ కోసం వేచిచూడాల్సి ఉంది. ఆరోపించబడిన ఉద్యోగం కోసం భూమి కుంభకోణంలో బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్, ఆయన సతీమణి, బిహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవి, వారి కుమారుడు తేజస్వీ యాదవ్, ఇతరులు ఉన్నారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో పశ్చిమ సెంట్రల్ జోన్ పరిధిలోని భారతీయ రైల్వేల గ్రూప్‌డి కేటగిరీలో ఉద్యోగం కోసం భూమి' పేరిట నియమాకాల కుంభకోణం జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. 2004 నుండి 2009 వరకు రైల్వే మంత్రిగా ఉన్న లాలూ ప్రసాద్ యాదవ్ హయాంలో లాలూ, ఆయన కుటుంబ సభ్యులు ఈ కుంభకోణంలో భాగస్వాములయ్యారు. నిబంధనలకు విరుద్ధగా నియామకాలు జరిగాయని, లావాదేవీలలో బినామీ ప్రాపర్టీలు ఉన్నాయని, ఇది నేరపూరిత దుష్ప్రవర్తన కుట్ర అని కూడా సిబిఐ ఆరోపించింది. ఈ కేసు రాజకీయంగా ప్రేరేపించబడిందని పేర్కొన్న నిందితులు ఆరోపణలను ఖండించారు.

# 'హగ్ హగ్ నా రహా' ప్రధాని మోదీని కాంగ్రెస్ ఎద్దేవా

ట్రంప్‌కు మోదీ ఫోన్ చేయనందువల్లే వాణిజ్య ఒప్పందం కుదరలేదన్న లుట్నిక్ వ్యాఖ్యలపై జైరామ్ రమేష్



**న్యూఢిల్లీ :** అమెరికా విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనుసరిస్తున్న విదేశీ విధానాన్ని కాంగ్రెస్ మరోసారి తూర్పారబట్టింది. ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఫోన్ చేయకపోవడం వల్లే భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదరలేదని యుఎస్ వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ పేర్కొన్న తర్వాత శుక్రవారం కాంగ్రెస్ ప్రధానమంత్రి నరేంద్రమోదీపై బాలీవుడ్ సినిమాల మార్క్ డైలాగ్‌లతో విమర్శలు గుప్పించింది. లుట్నిక్ వ్యాఖ్యల వీడియోను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరామ్ రమేష్ పోస్ట్ చేస్తూ 'హగ్ హగ్ నా రహా, పోస్ట్ పోస్ట్ నా రహా' అని వ్యంగాస్త్రాలు సంధించారు. అంతేకాకుండా జైరామ్ రమేష్ ఒక అడుగు ముందుకేసి 'క్యా సే క్యా హో గయా, బేవఫా తేరీ దోస్తీ మే' అని ఎద్దేవా చేశారు. ఇదిదేవ్ ఆనంద్ నటించిన 'గైడ్' (1965) చిత్రం హిట్ పాట, 1964లో రాజ్‌కపూర్ నటించిన 'సంగం' చిత్రంలోని 'దోస్త్ దోస్త్ నా రహా' పాటను పరిగణనలోనికి తీసుకున్నది. గురువారం ఆల్‌ఇన్ పోడ్‌కాస్ట్ కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో లుట్నిక్ భారతయుఎస్ వాణిజ్య ఒప్పందానికి సంబంధించి ఇప్పటి వరకు ఏమి జరిగిందనే విషయమై వివరణాత్మకంగా తెలిపారు. 'నేను మీకు భారతదేశం గురించి ఒక కథ చెబుతాను. మేం మొదటి ఒప్పందాన్ని యుకెతో చేసుకున్నాం. దానిని ఇప్పటి నుండి రెండు శుక్రవారాలలో పూర్తి చేయాలని మేం చెప్పాం. ఆ రైలు స్టేషన్ నుండి రెండు శుక్రవారాలలోపు బయల్దేరుతుందని, ఈ విషయంలో చాలా దేశాలు కూడా పనిచేస్తున్నాయి. మీకు తెలుసు ఎవరైతే ముందు వస్తారో వారే మొదట ఉంటారు. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దానిని ఒక మెట్లదారి(స్టెయిర్ కేస్) మాదిరిగా ఒప్పందాలు చేసుకుంటారు. మొదటి మెట్టుకే ఉత్తమ ఒప్పందం కుదురుతుంది. ఎందుకంటే మొదటి వ్యక్తి తర్వాత మీరు బెస్ట్ డీల్‌ను పొందలేరు' అని లుట్నిక్ చెప్పారు. ట్రంప్ ఆ విధంగా పనులు చేస్తారని, అందుకే మీరు చర్చల రావడానికి ప్రేరేపిస్తుందని లుట్నిక్ చెప్పారు. యుకె ఒప్పందం తర్వాత ట్రంప్ దేశం తదుపరి ఎవరు అని అందరూ అడిగారని, అమెరికాఅధ్యక్షుడు వివిధ దేశాల గురించి మాట్లాడినప్పటికీ భారతదేశం గురించి రెండుసార్లు ప్రస్తావించారని లుట్నిక్ గుర్తుచేశారు. అంతేకాదు మేం భారతదేశంతో మాట్లాడుతున్నాం. మీకు మూడు శుక్రవారాలు ఉన్నాయని మేం భారతదేశానికి చెప్పిఉన్నాం. మంచిదే వారు దానిని పూర్తి చేయాల్సి ఉంటుంది అని యుఎస్ వాణిజ్య కార్యదర్శి లుట్నిక్ చెప్పారు. 'ట్రంప్‌తో మోదీ డీల్ చేసుకోవాలి. ఆయన సన్నిహితుడిగా ఉన్నారు. ఆయన ఒప్పందం చేసుకోవాలి. ఇది అంతా సరిచేసుకునేందుకు మోదీ యుఎస్ అధ్యక్షుడు ట్రంప్‌కు ఫోన్‌కాల్ చేయాలి. కానీ ఈ విషయంలో వారికి (భారతదేశానికి) అసౌకర్యంగా ఉన్నట్లు ఉంది. అందువల్లే మోదీ ట్రంప్‌కు ఫోన్ కాల్ చేయలేదు' అని లుట్నిక్ వివరించారు. శుక్రవారం తర్వాత యుఎస్ ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, వియత్నాంతో వాణిజ్య ఒప్పందం ప్రకటించిందన్నారు. వాషింగ్టన్ ఇతర దేశాలతో చర్చలు జరుపుతోందని, దానికి ముందు భారతదేశం పని పూర్తి చేస్తుందని భావిస్తున్నారని లుట్నిక్ తెలిపారు. భారతదేశం రష్యా చమురు కొనుగోళ్లపై తాను అసంతృప్తితో ఉన్నానని, వాషింగ్టన్ న్యూఢిల్లీపై సుంకాలను అతి త్వరలోనే పెంచనున్నదని చెప్పిన కొద్ది రోజుల తర్వాత లుట్నిక్ వ్యాఖ్యలు వెలువడ్డాయి. రెండు దేశాలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుపుతున్న తరుణంలో అమెరికా అధ్యక్షడి బెదిరింపు వచ్చింది. ఇప్పటివరకూ ఒప్పందం కోసం ఆరు రౌండ్ల చర్చలు జరిగాయి. అమెరికాలోకి ప్రవేశించే భారతీయ వస్తువులపై 50శాతం సుంకాలను పరిష్కరించడానికి ఒక ఫ్రేమ్ వర్క్ ఒప్పందాన్ని చేర్చబడింది.

# తుర్క్‌మన్ గేట్ వద్ద రాళ్ల దాడి కేసులో మరో నిందితుడి అరెస్టు





**న్యూఢిల్లీ :** తుర్క్‌మ్యాన్ గేట్ వద్ద రాళ్ల దాడి ఘటనలో ఢిల్లీ పోలీసులు శుక్రవారం మరో నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసులో మొత్తం అరెస్టుల సంఖ్య 12కి చేరుకుంది. శుక్రవారం ప్రార్థనల దృష్ట్యా ఆ ప్రాంతంలో, చుట్టుపక్కల భద్రతా ఏర్పాట్లు హై అలర్ట్‌లో ఉంచినట్లు అధికారులు తెలిపారు. 'మొహమ్మద్ ఇమ్రాన్ (36)ను అరెస్టు చేశాం. తదుపరి దర్యాప్తు జరుగుతోంది. ఈ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశాం' అని అదనపు పోలీసు కమిషనర్ (సెంట్రల్) నిధిన్ వల్సన్ పిటిఐకి తెలిపారు. శాంతిభద్రతలను కాపాడటానికి స్థానికంగా సున్నితమైన ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పోలీసులు, పారామిలిటరీ సిబ్బందిని మోహరించారు. సీనియర్ అధికారులు మైదానంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం, మసీదులు, పక్కనే ఉన్న దారుల దగ్గర అదనపు బలగాలను మోహరించారు. కదలికలను నియంత్రించడానికి, అవాంఛనీయ ఘటనలను నివారించడానికి వ్యూహాత్మక ప్రదేశాలలో పికెట్లను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించడానికి పోలీసులు డ్రోన్ నిఘా, విస్తృతమైన సిసిటివి పర్యవేక్షణను కూడా ఉపయోగిస్తున్నారని, పరిస్థితి ప్రశాంతంగా, నియంత్రణలో ఉందని అధికారులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా, ఈ ఘటనకు సంబంధించి తప్పుదారి పట్టించే లేదా ధృవీకరించని సమాచారాన్ని వ్యాప్తి చేసినందుకు 10 మంది సోషల్ మీడియా ప్రభావశీలులను కూడా పోలీసులు గుర్తించారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ అయిన ఐమెన్ రిజ్వీకి సమన్లు పంపినప్పటికీ, ఆయన ఇప్పటివరకు దర్యాప్తులో చేరలేదని అధికారులు తెలిపారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో కొన్ని సందేశాల సర్క్యులేషన్‌కు సంబంధించి సల్మాన్ అనే మరో ఇన్‌ఫ్లూయెన్సర్ పాత్రను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఒక సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ పాత్రపై విచారణ జరుగుతోందని పోలీసులు తెలిపారు. శాంతిని కాపాడాలని, సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ధృవీకరించని సందేశాలను పట్టించుకోవద్దని పోలీసులు ప్రజలకు తమ విజ్ఞప్తిని పునరుద్ఘాటించారు. ప్రజలు కేవలం అధికారిక సమాచారంపైనే ఆధారపడాలని, అధికారులకు సహకరించాలని కోరడమైనదని ఆ అధికారి అన్నారు. రాళ్ల దాడి ఘటనపై దర్యాప్తు బహుళ కోణాల్లో జరుగుతోందని, ఇందులో డిజిటల్ సాక్ష్యాల పరిశీలన, తప్పుడు సమాచారం వ్యాప్తి చేసిన వారిని గుర్తించడం, హింసకు సంబంధించిన అనుమానితులను ప్రశ్నించడం వంటివి ఉన్నాయని పోలీసులు తెలిపారు.

## కారు ప్రమాదంలో

### నలుగురు యాత్రికులు మృతి

**తుమకూరు:** తుమకూరు శివార్లలోని బెల్లావి సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘటనలో నలుగురు యాత్రికులు మృతి చెందగా, మరో ఏడుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నిలిచి ఉన్న ట్రక్కును కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. కేరళలోని అయ్యప్ప స్వామి ఆలయానికి తీర్థయాత్రకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చొటు చేసుకుంది. ప్రమాదంలో కారులో 11 మంది ప్ర యాణికులు ఉన్నారు. అందులో మృతులలో ము గ్గరిని కొప్పళ జిల్లాలోని కుకనూరుకు చెందిన వెంకటేష్(30),మారుతప్ప(44),సాక్షి(7)గా గుర్తించారు. నాల్గవ బాధితుడి గుర్తింపు ఇంకా తెలియలేదు. గాయ పడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు, మృతదేహాలను పోస్ట్‌మార్టం పరీక్షల మార్చురీకి పంపారు.

## వీధికుక్కల సమస్యల

### పరిష్కారానికి మార్గదర్శకాలివ్వాలి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** వీధి కుక్కల సమస్యలపై నిపుణుల కమిటీచే మార్గదర్శకాలు రూపొందించాలని శ్రీనివాస్ మూర్తి రిఫార్మ్స్ ఫౌండేషన్ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాసమూర్తి, హనుమంతరావు, గౌరీ మాట్లాడారు. వీధికుక్కల సంచారాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ఆయా ప్రాంతాల్లో సంచరిస్తున్న శునకాలను షెల్టర్‌జోన్లలో తరలిస్తూ తగిన ఏర్పాటు చేయకపోవడంతో మృత్యువాతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిపై అన్ని జీవరాశులకు జీవించే హక్కు ఉన్నదని, మూగజీవాలను హింసించి మరణించేలా చేయకుండా వాటిని కాపాడాలని కోరారు. ఈ విషయమై ఇప్పటికే ప్రధాని మోదీకి లేఖ రాశామన్నారు.

# ట్రంప్ సామ్రాజ్యవాద దాహం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సామ్రాజ్యవాద దాహం తీరడం లేదు. 2026 కొత్త ఏడాదిలో అడుగిడిని వెంటనే వెనిజులా దేశాధ్యక్షుడు మదురోను, ఆయన భార్య సహా అపహరించి అమెరికాకు తరలించుకుపోయారు. ఇది అత్యంత దిగ్భ్రాంతికర దృశ్యం. ఆధునిక యుగంలో ప్రత్యక్ష సామ్రాజ్యవాద కాంక్షను బట్టబయలు చేసింది ఈ ఘటన. ప్రపంచీకరణ తరువాత ఉదార ఆర్థికవిధానాలతో వివిధ దేశాలో పరోక్షంగా ఇతర దేశాలపై ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నారు. 'అమెరికా ఫస్ట్', 'మేక్ అమెరికా గ్రేట్ అగెయిన్ (మాగా)' నినాదాలతో రెండవసారి గద్దెనెక్కిన తరువాత సామ్రాజ్యవాద దాహాన్ని ఏమాత్రం దాచుకోలేదు. ఎన్నికల సమయంలోనే కెనడా దేశాన్ని అమెరికాలో కలిపేసుకుంటామని, గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటానని, గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరు గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చి, ఇరు దేశాల సరిహద్దుల్లో గోడ కడతానని తెగ బలిసిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి లక్షణాలను సంతరించుకున్న ట్రంప్ హూంకరించాడు. అలాగే 'డ్రిల్ బేబీ డ్రిల్ ..' అంటూ తన కార్పొరేట్ ఆయిల్ కంపెనీ మిత్రులను ఎన్నికల ప్రచారంలో ఉత్సహపరిచిన ఆయన అధికారం చేపట్టగానే ఆ దిశగానే వేగంగా అడుగులు వేస్తున్నాడు.

వెనిజులాపై దాడిచేసి, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నుకోబడిన మదురోను, ఆయన సతీమణిని రాత్రికి రాత్రి అమెరికాకు ఎత్తుకెళ్ళడం ఘోరాతి ఘోరం. ఈ వ్యవహారంపై వివిధ దేశాల స్పందన చప్పగానే సాగిందని చెప్పవచ్చు. రష్యా, చైనాలు గట్టిగానే ఖండించినప్పటికీ, తదుపరి మౌనాన్నే ఆశ్రయించాయి. ఇక ఐక్యరాజ్య సమితి అలంకారప్రాయంగా మారింది. వెనిజులా ఘటనపై 15 సభ్య దేశాల ఐరాస భద్రతా మండలి అత్యవసర సమావేశం జరిగినప్పటికీ ఎలాంటి కార్యాచరణ లేదు. కేవలం అమెరికా దుస్సాహసాన్ని దూషించేందుకు ఒక అంతర్జాతీయ వేదికను అందించేందుకే అది పరిమితమైందనే పెదవి విరుపులు వినిపిస్తున్నాయి. పులి మీద పుట్రలా ఐరాసను మరింత బలహీనపరుస్తూ ట్రంప్ ప్రభుత్వం సమితికి చెందిన 66 ప్రత్యక్ష, పరోక్ష సంస్థలకు ఆర్థిక సహాయాన్ని ఉపసంహరణకు సిద్ధమైంది.

సర్వసత్తాక వెనిజులా దేశాధ్యక్షుడిని బంధించిన తరువాత, ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టిన రోడ్రిగ్జ్‌ను సైతం బెదిరించి లొంగదీసుకునే ప్రయ త్నం చేస్తున్నాడు ట్రంప్. అక్కడ ప్రభుత్వాన్ని కీలుబొమ్మగా మార్చుకొని ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలను దోచుకునేందుకు సిద్ధమయ్యాడు. కమ్యూనిస్టులంటే కంటగించుకునే ట్రంప్ తదుపరి లక్ష్యంగా క్యూబా, కొలంబియా, బ్రెజిల్‌లోని వామపక్ష ప్రభుత్వాలను కూలదోసే పనిలో నిమగ్నమయ్యాడు.

బేహారి చేతికే దేశం పగ్గాలు చిక్కితే ఎలాగుంటుందనేది ట్రంప్ కళ్ళకు గట్టినట్లు చూపిస్తున్నాడు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం శత్రువు, మిత్రువు అనే తేడా లేకుండా వ్యవహరిస్తున్నాడు. అమెరికా మిత్రదేశం, నాటో సభ్యురాలైన గ్రీన్ ల్యాండ్‌ను కబళించేందుకు వెనుకంజ వేయడం లేదు. అందుకు సామ, దాన, బేధ, దండోపాయాలను ఉపయోగిస్తున్నాడు. డెన్మార్క్ దేశంలో స్వయంపత్రిపత్తితో కొనసాగుతున్న గ్రీన్ ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ ప్రకటించారు. ఆ దేశం నుంచి తీవ్ర వ్యతిరేక ఎదురవుతున్నా లెక్కచేయక, నయానోభయానో దక్కించుకునేందుకు, గ్రీన్‌ల్యాండ్‌ను కొనుగోలు చేసేందుకు కూడా సిద్ధమేని వైట్‌హౌస్‌లోని వంధిమాగధులు బేరసారాలకు దిగారు. అది ఆధిపత్య, అధికార మదాన్ని సూచిస్తున్నది. కేవలం 56వేల మంది జనాభా కలిగిన గ్రీన్‌ల్యాండ్ అమెరికాకు పొరుగునే నెలవై ఉంది. అక్కడ అపారమైన చమురుతో పాటు, అరుదైన ఖనిజాలు ఉన్నాయి. అంతే కాకుండా రష్యాకు, చైనాకు సమీప మార్గాన్ని కూడా ఆ ద్వీపం అందిస్తుంది. ఇవన్నీ లెక్కలు వేసుకొని వీధి రౌడీ తరహాలో బెదిరింపులకు దిగుతూ దానిని దక్కించుకునేందుకు అగ్రదేశం సిద్ధమవుతుండడం దారుణం. అయినప్పటికీ, అంతర్జాతీయ సమాజం ప్రకటనలకే పరిమితమవుతున్నాయే తప్ప నిస్సహాయ, బేల దేశాలకు మేమున్నామని ధైర్యాన్నిచ్చే పరిస్థితి కనపడడం లేదు.

ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో తన స్థావరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా అమెరికా పరోక్ష పద్ధతిలో సామ్రాజ్యవాదాన్ని కొనసాగిస్తూ వస్తోంది. ఇప్పుడు ప్రత్యక్షంగానే నదురుబెదురు లేకుండా దేశాలపై ఆధిపత్యాన్ని విస్తరిస్తూ నయావలస విధానాన్ని అమలు చేయడం ద్వారా అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని చెప్పుకునే అమెరికా ప్రజాస్వామ్య పద్ధతినే అపహాస్యం పాలు చేస్తుంది. గ్లోబలైజేషన్‌లో చౌక వనరులున్న చోట సరుకులు తయారుచేసుకొని, ధర ఎక్కువ ఉన్న చోట ఉత్పత్తులను అమ్ముకుంటున్నారు. పాతికేళ్ళ ప్రయోగంలో ఈ విధానం గుప్పెడు కార్పొరేట్‌ల చేతుల్లో సంపదను కేంద్రీకృతం చేసింది. అసమానతలు పెరిగి, మాంద్యానికి దారి తీసింది. ఆర్థిక భారాలను దేశాలు ఒకదానిపై ఒకటి తోసుకునే పనిలో పడ్డాయి. ఇది అభివృద్ధి చెందిన దేశాలకు కూడా తప్పడం లేదు.

గ్లోబలైజేషన్‌కు ఆద్యురాలైన అమెరికానే ఆర్థికంగా పతనం అంచుకు చేరి, ఇప్పుడు ప్రొటెక్షనిజం మంత్రాన్ని జపిస్తోంది. స్వీయరక్షణకు ఎంతకైనా తెగించి ముసుగు తొలగించి ప్రత్యక్ష సామ్రాజ్యవాదానికి, నయా వలసవాదీకరణకు దిగింది. అందులో భాగమే వెనిజులా, గ్రీన్‌ల్యాండ్ పరిణామాలు. ఇది అంతటితో ఆగదు. ఇలాగే మిన్నకుంటే, ఒక దేశం తరువాత మరో దేశాన్ని తొక్కిపట్టి 75 ఏళ్ల క్రితం అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యం తరహాలో అమెరికా సామ్రాజ్య ఏర్పాటుకు అడుగులు పడతాయి. ప్రజాస్వామ్యం పుస్తకాలకే పరిమితమై, తిరోగమన పథంలోకి వెళ్లడం తథ్యం. అందువల్ల ప్రపంచ దేశాలు ఇప్పటికైనా మేల్కొని, మానవసంబంధాలే ఆలంబనగా అమెరికాకు అడ్డుకట్టవేయాలి. బ్రిక్స్ తరహా బహుళపాక్షిక వ్యవస్థలను బేషజాలు లేకుండా రష్యా, చైనా, భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా దేశాలు బలోపేతం చేసుకుంటేనే , ఆలస్యమైనా అమెరికాకు చెక్ పెట్టవచ్చు!



## 'నరేగా', 'విబి-జి రామ్ జి' పై చర్చకు రావాలి

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన 'విబి– జి రామ్ జి' గ్రామీణ ఉపాధి పథకం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) ప్రయోజనాలపై బహిరంగ చర్చకు రావాలి. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎను రద్దు చేయాలన్న కేంద్రం నిర్ణయంపై విస్తృతంగా చర్చించడానికి అసెంబ్లీలో రెండు రోజుల సమావేశం నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. 'వారు ఏమి చేశారో ప్రజలకు చెప్పనివ్వండి, ఈ కార్యక్రమం (ఎంజి నరేగా) ఏమి చేసిందో మేము వివరిస్తాము. మా గ్రామీణ ఉపాధి హామీ పథకానికి, వారి పథకానికి మధ్య ఉన్న తేడాలపై మాతో చర్చకు బిజెపి రావాలి'. వారి పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకుడు లేదా కేంద్ర మంత్రి ఎవరైనా ఒక టెలివిజన్ ఛానెల్‌లో చర్చకు రావాలి.

- కర్నాటక డిప్యూటీ సిఎం
డికె శివకుమార్




## జాతీయ సమైక్యత సాధనలో హిందీ భాష తోడ్పాటు

మొదటి 'ప్రపంచ హిందీ సమావేశం' నాగ్‌పూర్‌లో 10 జనవరి 1975న జరిగింది. ఈ ముఖ్యమైన సంఘటనను గుర్తుచేసుకునేందుకు, భారత ప్రభుత్వం 2006 నుండి ప్రతి సంవత్సరం జనవరి 10న 'ప్రపంచ హిందీ దినోత్సవం'ను నిర్వహించాలని నిర్ణయించింది, ఇది ప్రపంచ వేదికలలో హిందీ భాషను ప్రోత్సహించడానికి, గౌరవించడానికి ఉద్దేశించబడింది. ఈ రోజు హిందీ యొక్క సాంస్కృతిక, భాషా ప్రాముఖ్యతను కూడా నొక్కి చెబుతుంది. ఇది ఇంగ్లీష్, మాండరిన్ చైనీస్ తర్వాత ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషలలో 3వది. గొప్ప సాంస్కృతిక వారసత్వం గురించి అవగాహన కల్పించడానికి, విద్య, పాలన మరియు మీడియాతో సహా వివిధ రంగాలలో దాని వాడకాన్ని ప్రోత్సహించడానికి ఈ వేదికను ఉపయోగించవచ్చు. ఈ వేడుకలు ప్రపంచవ్యాప్తంగా హిందీ మాట్లాడే సమాజాల మధ్య ఐక్యతను పెంపొందించగలవు. ప్రపంచ హిందీ దివస్–2026 యొక్క ఇతివృత్తంగా 'హిందీ: సాంప్రదాయ విజ్ఞానం నుంచి కృత్రిమ మేధ వరకు' అనబ డే థీమ్ ఈ డిజిటల్ యుగంలో హిందీ యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుంది. సాంకేతిక ప్రపంచ ప్రేక్షకులకు దాని పరిధిని ఎలా విస్తరించిందో చూపిస్తుంది.

**అత్యధికంగా మాట్లాడే 3వ ప్రపంచ భాష – హిందీ:**

ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషలు ఇంగ్లీష్ (1,456 మిలియన్లు), మాండరిన్ చైనీస్ (1,138 మిలియన్లు), హిందీ (610 మిలియన్లు) స్పానిష్ (559 మిలియన్లు), ఫ్రెంచ్ (309 మిలియన్లు, అరబిక్ (274 మిలియన్లు), బెంగాలీ (273 మిలియన్లు) మరియు రష్యన్ (255 మిలియన్లు). ఇండో యూరోపియన్ భాషా కుటుంబంలో ఇండోఆర్యన్ సమూహంలో సభ్యుడైనా హిందీ భాష. దక్షిణాఫ్రికా, మారిషస్, యెమెన్, ఫిజి, అమెరికా, ఉగాండాలో కూడా హిందీ మాట్లాడే ముఖ్యమైన సంఘాలు కనిపిస్తాయి. హిందీ భాష దేవనాగరి లిపిలో వ్రాయబడింది, సంస్కృతం ద్వారా బలంగా ప్రభావితమైంది. హిందీ భాష భారతదేశంలో అత్యధికంగా మాట్లాడే భాషగా విస్తృతంగా గుర్తించబడింది. ముఖ్యంగా ఉత్తర భారతదేశం యొక్క ప్రధాన భాషగా పరిగణించబడుతుంది. ప్రపంచంలోని దాదాపు 4.46 శాతం మంది ప్రజలు హిందీ మాట్లాడతారు. హిందీలో దాదాపు 16 మాండలికాలు, భారత దేశంలో దాదాపు 528 మిలియన్ల మంది స్థానికంగా మాట్లాడే ప్రజలు ఉన్నారు, ఇది భారతదేశ మొత్తం జనాభాలో 43 శాతం అని గమనించాలి.

ప్రపంచ హిందీ దినోత్సవాన్ని నిర్వహించడంలో ప్రధాన ఉద్దేశ్యాలు ప్రపంచవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు, సాంస్కృతిక పరిరక్షణ, విద్యా ప్రోత్సాహం, అంతర్జాతీయ ఐక్యత అని తెలుసుకోవాలి. 1949లో భారతదేశ అధికారిక భాషలలో ఒకటిగా హిందీని స్వీకరించిన జ్ఞాపకార్థం ఏటా సెప్టెంబర్ 14ని 'జాతీయ హిందీ దినోత్సవం'గా కూడా జరుపుకుంటామని తెలుసుకోవాలి.

**(జనవరి 10న 'ప్రపంచ హిందీ దినోత్సవం లేదా విశ్వ హిందీ దివస్' సందర్భంగా)**

# హర్యానాలో రూ.1500కోట్ల కుంభకోణం బయటపెట్టిన బిజెపి మంత్రి : ఇరకాటంలో సిఎం

**జగ్‌మోహన్ థాకెన్**

తన సొంత శాఖలోనే రూ. 1,500 కోట్ల 'వర్క్ స్లిప్ కుంభకోణాన్ని' బయటపెట్టి, ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని ముఖ్యమంత్రికి సిఫార్సు చేశాడు హర్యానా కార్మిక శాఖ మంత్రి అనిల్ విజ్. తద్వారా 'అవినీతి రహిత హర్యానా' అంటూ నిత్యం గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీని ఆయన ఇరకాటంలో పడేశారు.

హర్యానా కార్మిక శాఖ మంత్రి అనిల్ విజ్ డిసెంబర్ 29న విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటన ద్వారా కార్మిక శాఖ పరిధిలో పనిచేస్తున్న హర్యానా భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో చాలా కాలంగా జరుగుతున్న వర్క్ స్లిప్‌లకు (పని రసీదులకు) సంబంధించిన తీవ్రమైన అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. ప్రాథమిక విచారణల ప్రకారం, ఈ కుంభకోణం సుమారు రూ.1,500 కోట్లకు చేరవచ్చని తెలుస్తోంది. ఈ విషయం తీవ్రతను పరిగణనలోకి తీసుకుని, ఒక ప్రతిష్టాత్మక సంస్థ ద్వారా సమగ్ర విచారణ జరపాలని సిఫార్సు చేస్తూ ముఖ్యమంత్రికి మంత్రి విజ్ లేఖ రాశారు. ఇటీవల తాను బోర్డు సమావేశానికి అధ్యక్షత వహించానని, ఆ సమావేశంలో బోర్డు సభ్యుల నియామకంలోనే కాకుండా, నిర్మాణ కార్మికుల కోసం ఉద్దేశించిన సంక్షేమ పథకాల కింద ప్రయోజనాల పంపిణీలో కూడా అవకతవకలు కనుగొన్నట్లు కార్మిక శాఖ మంత్రి వెల్లడించారు. అనంతరం ఆయన తక్షణ విచారణకు ఆదేశించారు.

హిసార్, కైతల్, జింద్, సిర్సా, ఫరీదాబాద్, భివానీ జిల్లాల్లో ప్రాథమిక విచారణలు జరిగాయని, అక్కడ పెద్ద ఎత్తున అవకతవకలు గుర్తించినట్లు మంత్రి విజ్ పేర్కొన్నారు. తదనంతరం, ఒక కార్మిక శాఖ అధికారి, మరో ముగ్గురు అధికారులతో కూడిన జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని అన్ని జిల్లాల డిప్యూటీ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీలు 2023 ఆగస్టు, 2025 మార్చి మధ్య జారీ చేయబడిన ఆన్‌లైన్ వర్క్ స్లిప్‌లను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నాయి. ఈ పరిశీలనా ప్రక్రి య సుమారు నాలుగు నెలల క్రితం ప్రారంభమవగా, నేటి వరకు 13 జిల్లాల్లో 100 శాతం పరిశీలన పూర్తయింది. కర్నాల్, రేవారి, నూహ్ (మేవాత్), మహేంద్రగఢ్, గురుగ్రామ్, ఝుజ్జర్, పల్వాల్, పానిపట్, రోహతక్, సోనిపట్, పంచకుల, సిర్సా, కైతల్ అనే 13 జిల్లాల్లో మొత్తం 5,99, 758 వర్క్ స్లిప్‌లు జారీ అయినట్లు కార్మిక శాఖ మంత్రి తెలిపారు. వీటిలో కేవలం 53,249 మాత్రమే చెల్లుబాటు అయ్యేవిగా గుర్తించగా, 5,46,509 చెల్లనివిగా ప్రకటించారు. అదేవిధంగా, 2,21,517 కార్మిక రిజిస్ట్రేషన్లలో పరిశీలన తర్వాత కేవలం 14,240 మంది కార్మికులు మాత్రమే అర్హులుగా తేలారు. 1,93,756 రిజిస్ట్రేషన్‌లు చెల్లనివిగా గుర్తించారు.

అర్హత లేని వ్యక్తులు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందేందుకు, అనేకచోట్ల మొత్తం గ్రామాలను మోసపూరితంగా నమోదు చేసి వర్క్ స్లిప్‌లను జారీ చేశారని స్పష్టమైందని విజ్ అన్నారు. సగటున, ఒక కార్మికుడు వివిధ పథకాల కింద సుమారు రూ. 2.5 లక్షల విలువైన ప్రయోజనాలను పొందుతున్నారని, దీని కారణంగా ప్రభుత్వానికి భారీ ఆర్థిక నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆయన అన్నారు. "అర్హత లేని వారు ప్రయోజనాలను పొందుతున్నారు. ఇది పచ్చి దోపిడీ, దీని మూలానా ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయల ఆర్థిక నష్టం వాటిల్లుతోంది." అని తెలిపారు.

పని ప్రదేశాల ప్రామాణికత, నిర్మాణ కార్యకలాపాలలో వాస్తవ భాగస్వామ్యం, యజమాని వివరాలు, స్థానిక విచారణలు, క్షేత్రస్థాయి తనిఖీల ద్వారా ఈ పరిశీలన జరిగింది. పరిశీలన సమయంలో ఆర్‌టిఎస్ కాలపరిమితులను నిలిపివేశారు. కొత్త దరఖాస్తులను స్వీకరించవద్దని సరళ్ కేంద్రాలకు సూచించారు. సిఎం విండో, జన సంవాద్, సిపిగ్రామ్స్, హెచ్‌హెచ్‌ఆర్‌సి, హెచ్‌ఆర్‌టిఎస్‌సి మొదలైన అన్ని ఫిర్యాదుల పరిష్కార వేదికలకు అవసరమైన సమాచారాన్ని జారీ చేశారు. ఇప్పటికే ఆమోదించిన పెన్షన్ పథకాలను నిలిపివేయలేదని, అయితే మరణం, ప్రమాదం, అంత్యక్రియల సహా




య పథకాల కింద ప్రయోజనాలను ప్రాధాన్యత ప్రాతిపదికన విడుదల చేస్తున్నట్లు విజ్ స్పష్టం చేశారు.

నిజమైన కార్మికులకు సాధికారత కల్పించే లక్ష్యంతో, హర్యానా ప్రభుత్వం నిర్మాణ కార్మికుల కోసం ప్రసూతి, పితృత్వ ప్రయోజనాలు, విద్యా సహాయం, ఉపకారవేతనాలు, సాంకేతిక విద్యకు రీయింబర్స్‌మెంట్, పెన్షన్లు, వివాహ సహాయం, వైద్య సహాయం, గృహ రుణాలు, ప్రమాద పరిహారంతో సహా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని మంత్రి విజ్ తెలిపారు. కనీసం 90 రోజుల పనిని పరిశీలించిన తర్వాత సక్రమంగా నమోదు చేసుకున్న కార్మికులకు మాత్రమే ఈ ప్రయోజనాలు అందాలి. ఏ స్థాయిలోనైనా అవినీతి విషయంలో రాజీ పడబోమని, దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ మంత్రి పునరుద్ఘాటించారు.

హర్యానాలో నమోదిత నిర్మాణ కార్మికులకు అందించే వివిధ ప్రయోజనాలను మంత్రి విజ్ వివరించారు. వాటిలో రూ.36,000 ప్రసూతి ప్రయోజనం, రూ. 21,000 పితృత్వ ప్రయోజనం, కార్మికుల పిల్లలకు ఏటా రూ. 8,000 నుండి రూ.20,000 వరకు విద్యా ఆర్థిక సహాయం (ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య వరకు), 10వ/12వ తరగతి పరీక్షలలో 60% నుండి 90% మార్కులు సాధించిన పిల్లలకు రూ.21,000 నుండి రూ. 51,000 మధ్య మెరిట్ ఆధారిత స్కాలర్‌షిప్‌లు, వృత్తిపరమైన లేదా సాంకేతిక కోర్సులు అభ్యసించే పిల్లలకు వాస్తవ ప్రభు త్వ ఖర్చుల ప్రకారం పూర్తి విద్యా ఖర్చుల రీయింబర్స్మెంట్, వృత్తి విద్యా సంస్థలలోని కార్మికుల పిల్లలకు రూ.1.2 లక్షల వరకు హాస్టల్ సౌకర్య సహాయం, వృత్తి విద్యా కోర్సులకు రూ. 20,000 నుండి రూ.1లక్ష వరకు కోచింగ్ సహాయం, నమోదిత కార్మికుల కుమార్తెలకు ఎలక్ట్రిక్ స్కూటర్ కొనుగోలుకు రూ.50,000 ప్రోత్సాహకం, సిఎం శ్రమ యోగి ప్రతిభా యోజన కింద రూ.49,000ల్యాప్టాప్ గ్రాంట్ ఉన్నాయి.



అదనంగా, కార్మికులకు అందించే ఇతర ప్రయోజనాలలో సైకిల్ కొనుగోలుకు రూ. 5,000, పనిముట్ల గ్రాంటుగా రూ.8,000, కుట్టు మిషన్ కోసం రూ.4,500 ఉన్నాయి. ముఖ్యమంత్రి మహిళా నిర్మాణ కార్మికుల సమ్మాన్ పథకం కింద రూ.5,100, కన్యా దాన్ యోజన కింద నమోదిత కార్మికుల ముగ్గురు కుమార్తెల వరకు ఒక్కో వివాహానికి రూ. 1,01,000, మహిళా కార్మికురాలి స్వయం వివాహానికి రూ.50,000, తీర్థయాత్రలు లేదా చారిత్రక ప్రదేశాల సందర్శన కోసం వాస్తవ సెకండ్ క్లాస్ రైలు లేదా సాధారణ బస్సు ఛార్జీల పూర్తి రీయింబర్స్‌మెంట్, తమ పూర్వీకుల ఇంటిని సందర్శించడానికి ప్రయాణ ఖర్చుల రీయింబర్స్‌మెంట్, కనీస వేతనం ఆధారంగా వేతన పరిహారంతో సహా వైద్య సహాయం, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్స కోసం రూ.1 లక్ష వరకు ఆర్థిక సహాయం, రూ.1.5 లక్షల నుండి రూ.3 లక్షల వరకు వైకల్య సహాయం, నెలకు రూ. 3,000 వైకల్య పెన్షన్, దివ్యాంగులైన పిల్లలకు నెలకు రూ.3,000, వృద్ధాప్య పెన్షన్ (60 ఏళ్ల తర్వాత) నెలకు రూ. 3,500, కుటుంబ పెన్షన్ నెలకు రూ.1,750, వితంతు పెన్షన్ నెలకు రూ.3,000, ముఖ్యమంత్రి శ్రామిక్ సామాజిక సురక్షా యోజన కింద కార్యాలయంలో ప్రమాదవశాత్తు మరణానికి రూ.5,15, 000 పరిహారం, నమోదుకాని కార్మికులకు కార్యాలయంలో వైకల్యం ఏర్పడితేరూ.1.5నుండి 3 లక్షలు, కార్యాలయంలో నమోదుకాని కార్మికుడు మరణిస్తే రూ.4 లక్షలు వంటి ప్రయోజనాలు ఉన్నాయి. ఇంటి కొనుగోలు/నిర్మాణం కోసం రూ. 2లక్షల వరకు వడ్డీలేని రుణం, ముఖ్యమంత్రి పంజీకరన్ ప్రోత్సాహన్ యోజన కింద రూ.1,100 ప్రోత్సాహకం కూడా అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ ప్రయోజనాలను పొందడానికి, కార్మికులు కార్మిక బోర్డులో నమోదు చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. కార్మికుడు 90 రోజులకు పైగా పనిచేస్తున్నట్లు ధృవీకరించిన తర్వాత మాత్రమే రిజిస్ట్రేషన్ మంజూరు చేయబడుతుంది. మంత్రి సిఫార్సును ముఖ్యమంత్రి పరిగణనలోకి తీసుకుని, ఒక ప్రతిష్టాత్మక సంస్థ ద్వారా సమగ్ర విచారణకు ఆదేశిస్తారా? ఈ విషయం ప్రభుత్వాన్ని కుదిపేస్తుందా లేక ఇసుకలో ధూళిలాగా సద్దుమణిగిపోతుందా? *(ఐపిఎ సర్వీస్)*

# వెనిజులా పరిణామాలతో ఉచితాలపై విషం కక్కుతున్న మరుగుజ్జులు



**వి.యస్.బోస్**
సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు
9391356527

ప్రస్తుతం వెనిజులా అనే చిన్న దేశంలో చోటుచేసుకున్న పరిణామాలు ప్రపంచ ప్రజలకు దిగ్భ్రాంతికి కలుగచేశాయి. వెనిజులాలో ట్రంప్ టెర్రరిస్టు దాడిని ప్రపంచ దేశాలు ఖండించాయి. రాజకీయాలకు, వర్గాలకు అతీతంగా అనేక దేశాల ప్రజలు వెనిజులా ప్రభుత్వానికి అండగా నిలబడ్డా రు. అమెరికా ప్రభుత్వం చేసిన ఏకపక్ష దౌర్జన్యాన్ని, సైనిక దాడిని ప్రపంచ దేశాలతో పాటు అమెరికా ప్రజల్లో కొందరు కూడా ఖండించటం మనం చూస్తున్నాం. ట్రంప్ చేస్తున్న ద్రోహపూరిత దౌర్జన్యాలను ఎండగడుతున్నారు. అక్కడ జరిగిన దౌర్జన్యఖాండ ఐక్యరాజ్య సమితి నియమాలకు వ్యతిరేకంగా ట్రంప్ చేసిన మూర్ఖపు చర్యను ఖండించకుండా కొంతమంది అమ్ముడుపోయిన మేధావులు వెనిజులాలో అక్కడి ప్రభుత్వం ప్రజలకు అందజేసిన ఉచితాల మూలంగానే ఈ పరిణామాలు జరిగినవని చెప్పటం అవాస్తవం. మరో ప్రక్క ఆ దేశంలోని చమురు సంస్థలను జాతీయం చేయటం మూలంగా ఆ దేశం నుండి అమెరికన్ పెట్టుబడిదారులు తరలిపోయారని, అందుకే ఆ దేశంలో ఉపాధి లేకపోవటంతో ప్రజలు ఇతర దేశాలకు వలసలు పోయారని ఎడతెరపులేని ప్రచారం చేస్తున్నారు. అదే నిజమైతే కెనడాపైన, డెన్‌మార్క్ పైన, గ్రీన్‌ల్యాండ్‌పైన, క్యూబాలాంటి దేశాలపైన ట్రంప్ ఎందుకు బెరింపులకు పాల్పడుతున్నాడు. దీనిమూలంగా వెనుజులలోని చమురు బావులపై ట్రంప్ కన్నువేశాడని, జాతీయ చేసిన ఆ బావులను తాను స్వాధీనం చేసుకోవాలనే కుట్రలో భాగమే వెనిజులపై దాడి అనేది యదార్థం. అమెరికా మెరుపుదాడితో వెనిజులా అధ్యక్షుడితోపాటు అతని భార్యని నిర్బంధించి అమెరికాకు తరలించుకపోవటం ఒక దేశ సార్వభౌమత్వ సూత్రాలకు, అంతర్జాతీయ నియమాలకు విరుద్ధమని గమనించాలి.

వెనిజులా అధ్యక్షుడిగా హ్యూగో చావెజ్ ఉన్న కాలంలో ఆ దేశంలో ఉన్నటువంటి చమురు బావులను, సంస్థలను అన్నింటిని సమాజ న్యాయం కోసం జాతీయం చేయటం జరిగింది. చమురు వ్యాపారంలో ఉన్న అమెరికా దోపిడీదారులు వెనిజులాను వదిలి తిరిగి అమెరికాకు పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ రోజు నుంచి అమెరికా వెనిజులాపై కక్ష పెంచుకుని ఎలాగైనా ఆ దేశాన్ని తిరిగి తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలని శతవిధాల ప్రయత్నించింది. హ్యూగో చావెజ్ నాయకత్వానికి వ్యతిరేకంగా అనేక కుట్రలు పన్నింది. పదవీచ్యుతుడను చేయాలని అనేక ప్రయత్నాలు చేసింది. ఎన్నికల్లో హ్యూగో చావెజ్‌ను ఓడించటానికి ఆ దేశ ప్రతిపక్ష పార్టీలను రెచ్చగొట్టి అనేక రకాలుగా అక్రమ సహాయం చేసింది. క్యూబా నాయకుడు ఫెడరల్ క్యాస్ట్రో నాయకత్వంతో స్ఫూర్తి పొందిన చావెజ్ అన్ని కుట్రలను భగ్నం చేసి వెనుజులాను ప్రజా ప్రభుత్వంగా తీర్చిదిద్దాడు.

హ్యూగో చావెజ్ ఆరోగ్య కారణాలతో వైదొలిగిన తర్వాత అతని స్థానంలో అధ్యక్షుడిగా ఎన్నికైన నికోలస్ మదురో చావెజ్ స్ఫూర్తితో ఆయన బాటలో పయనించటంతో అమెరికాకు మింగుడు పడని పరిస్థితి ఏర్పడింది. అమెరికా అండతో వెనిజులాలోని ప్రతిపక్షం మదురోకు వ్యతిరేకంగా తిరుగుబాటుకు ప్రయత్నిస్తే దాన్ని మదురో సమర్థవంతంగా తిప్పికొట్టటం జరిగింది. ఆ పరిస్థితుల్లో తిరుగుబాటులో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారందరు ఆ దేశాన్ని వదిలి ఇతర దేశాలకు పారిపోయి అమెరికా అండదండలతో తమ జీవనం కొనసాగిస్తున్నారు. వాస్తవం ఇలా ఉంటే కొంతమంది వెనిజులాపై తప్పుడు ప్రచారం చేస్తూ ట్రంప్ చేసిన దుర్మార్గపు దాడిని సమర్థించటం సహించరాని విషయం. ఇలాంటివారు దోపిడీదారులకు అనుకూలంగా ప్రచారం చేస్తున్నారనేది స్పష్టమవుతుంది.

రాత్రికి రాత్రి మదురో దంపతులను బేడీలు వేసి అమెరికాకు తరలించటం గొప్ప చర్య కాదు, అద్భుతం అంతకన్నా కాదు. ఇలాంటి చర్య పిరికిపందలు, కుట్రదారులు చేసే చర్యగా భావించాలి. ట్రంప్ ఏకపక్ష దాడులను ఐక్యరాజ్య సమితి తీవ్రంగా పరిగణించింది. ప్రపంచ దేశాలు ఖండించాయి. అమెరికాలో ఏనాడు లేని విధంగా అక్కడి ప్రజలు కూడా ట్రంప్ చర్యలను వ్యతిరేకిస్తున్నారు. నేడు ట్రంప్ అహంకారపూరిత చర్యలతో ప్రపంచముందు ఏకాకిగా దోషిగా నిలబడ్డారు. భారత ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవటం విచిత్రంగా వుంది. అమెరికా ఇప్పటి వరకు జరిగిన 2 ప్రపంచ యుద్ధాలలో పాల్గొనలేదు. చిన్న దేశాలను లొంగదీసుకోవటం, ప్రభుత్వాలను మార్చటం, కుట్రలతో ఆ దేశాల అధినేతలను హత్యలు చేయటం అమెరికా అనుసరిస్తున్న రాజకీయాల్లో ఒక భాగం. నాడు చిలిలోని అధ్యక్షుడు సాల్వడార్ గిల్లెర్మో అల్లెండే గోసెన్స్‌ను, తర్వాత బంగ్లాదేశ్ అధ్యక్షుడు ముజిబుర్ రెహ్మాన్‌ను తర్వాత కాలంలో రసాయన బాంబులు ఉన్నాయని ఆరోపణతో సద్దాం హుస్సేన్‌ను ఆ తర్వాత లిబియా అధినేత గడాఫిను హత్యచేయటంలో ఇదే పద్ధతిని అమెరికా అనుసరించింది. అంతర్జాతీయ సూత్రాలను తుంగలో తొక్కి తాను పెంచి పోషించిన బిన్‌లాడెన్‌ను పాకిస్తాన్ గడ్డపై హత్య చేయటం అమెరికా అనుసరించిన స్వార్థ నీతి. అమెరికా చూపే ప్రతాపం అంతా చిన్న దేశాలపైనేనని గుర్తించాలి. వెనిజులా దేశ జనాభా సుమారుగా 2 కోట్లు. ప్రపంచంలో అత్యంత అధునాతనమైన సమాచార వ్యవస్థ, సైనిక వ్యవస్థ ఆయుధాలు కల్గిన అమెరికా తన దేశంలోని ట్విన్ టవర్స్‌ను బిన్‌లాడెన్ కూల్చివేసినప్పుడు ఎందుకు కాపాడలేకపోయిందో ఆలోచించాలి.

ప్రస్తుతం ట్రంప్ రాజకీయ పరిస్థితులు ఏమాత్రం బాగోలేదు ప్రపంచ శాంతి కోసం కృషి చేస్తున్నాను, అనేక యుద్ధాలు ఆపుతున్నాను, కావున నాకు నోబుల్ బహుమతి ఇవ్వాలని మంతనాలు జరిపారు. వెనిజులాపై జరిపిన దుర్మార్గపు దాడి ఆయనలో ఉన్న నిజస్వరూపాన్ని ప్రపంచానికి బట్టబయలు చేసింది. ఒకవేళ వెనుజులాలో ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై ప్రజలకు అసంతృప్తి ఉంటే ఆ దేశ ప్రజలే పరిష్కారం చేసుకోవాలి కానీ బయట నుంచి ఆ దేశ రాజకీయాల్లో కలుగజేసుకోవటానికి అమెరికాకు ఉన్న అర్హత ఏమిటి. ట్రంప్ అధికారం మీద మమకారం పెరిగి నియంతలా మారుతున్నాడనే విషయాన్ని ప్రపంచ ప్రజలు గమనిస్తున్నారు. వెనిజులా తర్వాత ఆయిల్ సంపదలు కల్గిన డెన్‌మార్క్ దేశంపైన అందులో భాగమైన గ్రీన్‌లాండ్‌పైన ఎందుకు బెదిరింపులు, దౌర్జన్యాలు ప్రదర్శిస్తున్నారో అర్థం చేసుకోవాలి. క్యూబాను బెదిరించటంలో అర్థం ఏమిటో ఆలోచించాలి. మొత్తంగా కరేబియన్ దేశాలను కబళించటానికి ట్రంప్ వ్యూహం పన్నుతున్నాడనేది స్పష్టంగా అర్థమవుతుంది. ట్రంప్ రెండవసారి అధ్యక్షుడు అయిన తర్వాత కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా ఉండాలని ప్రతిపాదించాడు. కానీ వెంటనే ఆ దేశ అధ్యక్షుడు "కెనడా నాట్ ఫర్ సేల్" అని స్పందించటం, అలాగే కొలంబియా దేశం కూడా స్పందించటం చూస్తే ట్రంప్ రాజకీయ వ్యతిరేక పరిస్థితులు ఎదుర్కొంటున్నాడనేది స్పష్టం. ట్రంప్ పనికిరాని ప్రయోగాలు చేస్తూ ప్రపంచంలో అలజడి సృష్టిస్తూ తన అస్థిమిత మానసిక పరిస్థితిని పదర్శిస్తున్నాడు. కావున ప్రపంచ పరిస్థితులు అర్థం చేసుకోలేని వారు జాతీయాకరణ, ప్రజలు పొందుతున్న ఉచితాలపై తమ వ్యతిరేకతను ప్రదర్శించటానికి వెనిజులా పరిస్థితులు వాడుకోవటం సరైంది కాదు. చలికాలంలో గొడుగు వేసుకున్నట్లు, వేసవికాలంలో చలి బనియన్ వేసుకున్నట్లు ఇలాంటి వారి ప్రవర్తన అసహ్యంగా ఉంది.

## దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని గర్జించిన పార్టీ సిపిఐ



**ప్రజాపక్షం/శంకరపట్నం:** భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తొలుత గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ అని ఆ పార్టీ శంకరపట్నం మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య పేర్కొన్నారు. సిపిఐ ఆవిర్భవించి వందేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా కేశవపట్నం గ్రామంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ రాజీలేని పోరాటాలు చేస్తున్నద్నారు. 18న ఖమ్మం సభకు 40 దేశాల నుంచి ప్రముఖులు రాబోతున్నారని, అనుసందానంగా కేశవపట్నం మండలం నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ కార్యదర్శి రేగుల కుమార్, బాదుల్ల, గోదారి లక్ష్మణ్, మోతె రాజయ్య, వెంకటయ్య తదితరులున్నారు.

## కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఆకస్మిక సందర్శన



**ప్రజాపక్షం/కరీంనగర్:** రామడుగు మండలం వెధిర గ్రామ పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆకస్మికంగా సందర్శించారు. విద్యాలయంలోని వంటగది, స్టోర్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. స్టోర్స్ నిల్వలకు సంబంధించిన పలు రిజిస్టర్ లను తనిఖీ చేశారు. విద్యార్థులకు సిద్ధం చేసిన మెనూ అడిగి తెలుసుకున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో విద్యాలయం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫిర్యాదుల పెట్టెను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. మహిళా కానిస్టేబుల్ ఆధ్వర్యంలో ఫిర్యాదుల పరిశీలన ఉంటుందని, ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులు బోర్డు పరీక్షలకు సంసిద్ధంగా కావాలని సూచించారు. కలెక్టర్ వెంట ప్రత్యేక అధికారి అనిల్ ప్రకాష్, జిల్లా బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి ఉన్నారు.

## ఇవిఎం గోదాంలో ఆర్‌డిఒ తనిఖీ



**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లా కేంద్రం కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఇవిఎం గోదాంను శుక్రవారం ఆర్‌డిఒ కే.మహేశ్వర్ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ కే. మహేశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఇవిఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఇవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవియం గదుల వి వి ప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి కే, రాంరెడ్డి, బిజెపి పార్టీ ప్రతినిధి దేవి శెట్టి నవీన్ కుమార్, ఎంఐఎం పార్టీ ప్రతినిధి బర్కత్ ఆలీ, సిపిఎం పార్టీ ప్రతినిధి డి.నరేష్ పటేల్ ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరినాట్లు వేసిన డిప్యూటీ కలెక్టర్



**ప్రజాపక్షం/ధర్మపురి :** టిఎస్‌పిఎస్‌సి గ్రూప్ వన్ లో డిప్యూటీ కలెక్టర్ గా ఎంపికై జగిత్యాల జిల్లాకు కేటాయించిన శిక్షణ ఆదనపు కలెక్టర్ కన్నం హరిణి శుక్రవారం మహిళా రైతులతో కలిసి వరినాట్లు వేశారు.శిక్షణలో భాగంగా ధర్మపురి మండలం లోని బూరుగుపల్లె, తిమ్మాపూర్ గ్రామాల క్షేత్రస్థాయి సందర్శన జరిపిన ట్రైనీ కలెక్టర్ అక్కడ పొలాలలో మహిళలు వరినాట్లు వేయడాన్ని గమనించి స్వయంగా రంగంలోకి దిగి గంటపాటు పొలాల్లో నాట్లు వేసి వారి జీవనస్థితి గతులను తెలుసుకున్నారు.

## రైతులకు లాభసాటిగా ఎఫ్‌పిఒ స్కీం

**ప్రజాపక్షం/ మల్లాపూర్ :** మల్లాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ స్కీంపై గుండంపల్లి గ్రామంలో అవగాహన సదస్సు శుక్రవారం చేపట్టారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులతో కలిసి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంలో గ్రామం అర్హత సాధించేందుకు ప్రత్యేక షేర్ కాపిటల్ కలెక్షన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ స్కీమ్ రైతులకు లాభసాటిగా ఉందని సూచించారు. కార్యక్రమానంతరం నూతనంగా ఆయన ఎన్నికైన సర్పంచ్ డప్పుల పద్మ నరసయ్యను పిఎసిఎస్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ డప్పుల పద్మ నరసయ్య, ఏఎంసీ చైర్మన్ పుష్పలత నరసయ్య, పిఎసిఎస్ సిఇఒపాదం భూమేష్,రైతులు పాల్గొన్నారు.

## ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/వేములవాడ :** ప్రజాపక్షం పత్రిక ప్రజలకు ప్రభుత్వానికి మధ్యలో వారధిగా సమన్వయంతో నిష్పక్షపాతంగా వార్తలు అందిస్తూ పలు సూచనలతో ప్రజల పక్షాన నిలుస్తుందని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ శ్రీనివాస్, వేములవాడ ఆర్సీ గొంగళ్ళ రవికుమార్, టౌన్ రిపోర్టర్ ఫహద్ పాష, చందుర్తి రిపోర్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం హమాలీ సంక్షేమ బోర్డు ప్రకటించాలి

### సంక్షేమ బోర్డు సాధన కోసం కార్మికులంతా కలిసి రావాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధుల సమావేశం కరీంనగర్ పట్టణంలోని ఫిలిం భవన్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ హమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గుంటి సామ్రాజ్యం, ఏ వెంకట్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హమాలీల భద్రత, భరోసా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హమాలీ సంక్షేమ బోర్డును ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఐస్సా రేట్ల పెంపుదల చాలా రోజులుగా పెండింగ్ లోనే ఉందని, జనవరి నెల చివర ఆఖరి వరకు ఐస్సా రేట్లు పెంచి ఇవ్వాలని, రేట్ల పెంపదలపై రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో యూనియన్ ప్రతినిధులు మెమోరాండం అందజేశారు.అనంతరం రాష్ట్ర కమిటీ సభ్యులు డిప్యూట్ లేబర్ కమిషనర్ కోల ప్రసాద్ గారిని కలిసి హమాలీ కార్మికుల సమస్యలపై క్షుణ్ణంగా వివరించారు. చట్టాలు పాటించని ఆయా గోదాముల కాంట్రాక్టర్లపై తగు చర్యలు తీసుకునేలా చూడాలని లేబర్ కమిషనర్ గారిని కోరారు.సంక్షేమ బోర్డుకై హమాలీలు సంఘటితం కావాలి :ఫిబ్రవరి 22న వరంగల్ లో టి హెచ్ డబ్ల్యు యూ రాష్ట్ర మహాసభలు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలా ది మంది హమాలీ కార్మికులు పని భద్రత లేకుండా చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారని కార్మికుల సంక్షేమ బోర్డు కోసం హమాలీ కార్మికులందరూ సంఘటితం కావాలని హమాలీల సంక్షేమ బోర్డు సాధనే లక్ష్యంగా ఫిబ్రవరి 22న వరంగల్ పట్టణంలో వేలాది మంది హమాలి కార్మికులతో నిర్వహిస్తున్న తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయ వంతం చేయాలని తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర బాధ్యులు గుంటి సామ్రాజ్యం, ఏ వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలోని ఆయా గోడౌన్ల హెచ్ ఎంటి కాంట్రాక్టర్లు యజమానులు హమాలీలను భయభ్రాంతులకు గురిచేస్తూ పనుల నుండి తొలగిస్తూ బీహార్, ఒరిస్సా, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల వలస కార్మికులకు అరకుర వేతనాలు చెల్లిస్తూ పనులను చక్కబెట్టుకుంటున్నారని, వలస కార్మికుల రాకతో స్థానిక హమాలీలు ఉపాధిని కోల్పోతున్నారని, ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన హమాలీల బ్రతుకులు మాత్రం మారడం లేదని హమాలిల సంక్షేమ బోర్డు సాధనే లక్ష్యంగా ఉమ్మడి జిల్లాలోని హమాలీ కార్మికులందరూ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు హమాలీ కార్మికులను సంఘటితం చేస్తూ ప్రతి జిల్లా నుండి పదివేలమంది హమాలీ కార్మికులు స్వచ్ఛందంగా తరలివచ్చి రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా మహాసభలను విజయవంతం చేయాలని ఈ మహాసభల నిర్వహణకు ప్రతి ఒక్క హమాలీ కార్మికుడు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ హమాలి వర్కర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లాల బాధ్యులు జంగా సంపత్ యాదవ్, మోహన్, కొమ్ము మధు, చిలువేరు శంకర్, కొంతం రాజేందర్, సురేందర్, మహేందర్, అంబటి శంకర్, కరీంనగర్, పె ద్దపల్లి, జమ్మికుంట, హుజురాబాద్, సిరిసిల్ల, జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి హమాలీ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం

### పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణ రావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా నెరవేర్చుతుందని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శుక్రవారం రోజున పెద్దపల్లి పట్టణంలోని 13,14,32,33 వార్డుల్లో అర్హులైన లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్ల నూతన నిర్మాణాలకు స్థానిక నాయకులతో కలిసిశంకుస్థాపన చేసి వారికి ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదల సొంతింటి కల నెరవేరుతుందని అలాగే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వం అని నిరుపేదలకు కాంగ్రెస్ సర్కార్ అండగా ఉంటుందని తెలిపారు. పెద్దపల్లి పట్టణంలో శరవేగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని పెద్దపల్లి పట్టణం సుందరంగా మారుతుందని అన్నారు. గత ప్రభుత్వం పెద్దపల్లి పట్టణాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతన బస్సు డిపో, బైపాస్ రోడ్డు, 50 పడకల నుండి 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఆధునీకరణ, నూతన కోర్టు భవనం లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో చేయడం జరుగుతుందని అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రానికి వచ్చే అన్ని రహదారులను అభివృద్ధి పరుస్తూ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, ఎ.ఈ., మున్సిపల్ అధికారులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పలు వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

## సిఎం కప్-2025 టార్చ్ ర్యాలీ ప్రారంభం



**ప్రజాపక్షం/కరీంనగర్:** క్రీడా రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని రాణించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. చీఫ్ మినిస్టర్ కప్ 2025 టార్చ్ ర్యాలీ కరీంనగర్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియం నుండి ప్రారంభమైంది. ఈ ర్యాలీని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో కలిసి చొప్పదండి శాసనసభ్యుడు మేడిపల్లి సత్యం ప్రారంభించారు. తెలంగాణ చౌక్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ర్యాలీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నదని, క్రీడాకారులకు అవకాశాలు ప్రోత్సాహకాలు కల్పిస్తున్నదని తెలిపారు. రాష్ట్రం నుండి అనేక మంది క్రీడాకారులు ఒలంపిక్స్ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని క్రీడల్లో రాణించాలని సూచించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. క్రీడా రంగానికి నిధులు వెచ్చిస్తూ క్రీడా సదుపాయాలు కల్పిస్తుందని అన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో రాణించాలని అన్నారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కరీంనగర్ క్రీడాకారులు ఎన్నో మెడల్స్ సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ మహేశ్వర్, డివైఎస్ఒ శ్రీనివాస్ గౌడ్, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ ప్రకాష్, జిల్లా యువజన అధికారి రాంబాబు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్, పడాల రాహుల్, సిద్ధారెడ్డి, యోగాసన సభ్యుడు వీర్ల హనుమంత రావు, దండే ప్రియాంక, వేణుగోపాల్, ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ వేణుగోపాల్, శంకరయ్య, అలువల విష్ణు, సత్తినేని శ్రీనివాస్, పిడి, పిఇటి లు, అసోసియేషన్ సభ్యులు, ప్రైవేట్ పిడి అసోసియేషన్ సభ్యులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, కోచ్ లు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు

## మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ అభివృద్ధి



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబం అభివృద్ధి చెందుతుందని, అందువల్ల ఆరోగ్య మహిళ ఉచిత వైద్యపరీక్షలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ సభకు హాజరైన కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే వారి అభివృద్ధి . తద్వారా కుటుంబ, గ్రామ అభివృద్ధి , ఆర్థిక స్థిరత్వం సాధ్యమని అన్నారు. మహిళల సంక్షేమానికి ఆరోగ్య మహిళ కార్యక్రమం ప్రవేశపెట్టి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శుక్రవారం సభలోనూ మహిళలు ఉచిత వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందవచ్చని సూచించారు. బిపి, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అవసరమైన వారికి వైద్య సిబ్బంది ఇంటికి సైతం మాత్రలు తెచ్చి ఇస్తారని తెలిపారు.అనంతరం బొమ్మకల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఫిర్యాదుల పెట్టెను కలెక్టర్ పరిశీలించారు. మహిళా పోలీసు ఆధ్వర్యంలో నిర్వహణ ఉంటుందని తెలిపారు. వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు. బొమ్మకల్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ జకినపల్లి హారికను కలెక్టర్ పమేలా సత్పతి సన్మానించారు. జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఇంచార్జి డిడబ్ల్యూవో సుగుణ, సిడిపివో సబిత, తహసీల్దార్ రాజేష్, వైద్యశాఖ ప్రో గ్రాం ఆఫీసర్ సనా, ఐఆర్‌పి శ్రీలత తదితరులున్నారు.

## అస్థిత్వం కాపాడుకునేందుకు మరో ఉద్యమానికైన సిద్ధం

### మాజీమంత్రి హరీష్‌రావు

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట చదువుల తల్లిగా మారిందని..మెడికల్ కళాశాల,పాలిటెక్నిక్, నర్సింగ్, మహిళ డిగ్రీ కళాశాలతో విద్యాక్షేత్రంగా వెలుగొందుతుందని..వైద్యంలోను అగ్రగామిగా నిలిచిందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. దేవాలయాల జిల్లాగా సిద్దిపేట కీర్తి గడించిందని. కోమటిచెరువు పర్యాటక కేంద్రంగా మారి ఇతర జిల్లా వారిని ఆకర్శిస్తుందన్నారు. గురువారం బిజెపి సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్‌యాదవ్, సీనియర్ నాయకులు హనుమంత్‌రావు తన అనుచరులతో కలసి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి హరీష్ రావు గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేయాలని, చైర్మన్లు, కౌన్సిలర్లు మనవారు ఉంటేనే అభివృద్ధి ముందుకుపోతుందన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు సంపత్‌రెడ్డి, వరాల సురేష్, ఎల్లు రవీందర్‌రెడ్డి, రాధ కిషన్‌శర్మ, రాజనర్సు, పాల సాయిరాం, సత్తయ్య, పత్రి శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## సింగరేణిని భ్రష్టు పట్టిస్తున్న ప్రభుత్వం

### కొరిమి రాజ్ కుమార్




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి సంస్థను తమ జేబు సంస్థగా వాడుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం బ్రష్టు పట్టిస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఆరోపించారు. శుక్రవారం సింగరేణి ఆర్‌జి వన్ ఏరియా లోని జిడికె వన్ ఇంకెన్ లో జరిగిన గేట్ మీటింగ్ లో ఆయన పాల్గొని మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పని చేస్తున్న కార్మికులు అహర్నిశలు శ్రమించి కోట్ల రూపాయలు లాభాలు తీసుకువస్తే సంస్థ అభివృద్ధి కోసం, కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం సంస్థ నిధులను ఇష్టానుసారంగా వాడుకుంటూ సంస్థ దివాలా తీసే విధంగా తీరని అన్యాయం చేస్తుందని ఆయన ఆరోపించారు. రాయల్టీ ల పేరుతో, డి.ఎం.ఎఫ్.టి, సి.ఎస్.ఆర్ పేరుతో కోట్ల రూపాయలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం సంస్థ కు రావాల్సిన 47 వేల కోట్ల రూపాయల బకాయిలు ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. సింగరేణి లో పెండింగ్ సమస్యల ను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కి వి నతి పత్రం ఇచ్చి నెలలు గడిచినా ఇంత వరకు పరిష్కా రం చూపకుండా రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేస్తుందని ఆయన ఆరోపించారు. ముఖ్య ంగా కొత్త గనులు రావడం కోసం టెండర్ ప్రక్రియ లో ప్రైవేట్ సంస్థలను పాల్గొనకుండా సింగరేణికి దక్కే విధ ంగా అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగిందని ఆయన అన్నారు. అదేవిధంగా సొంత ఇంటి పథకం అమలు చేయాలని, మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెటులకు ప్రత్యేక కేసుగా పరిగణించి ఉద్యోగాలు ఇవ్వాలని, పెర్క్స్ పై ఇన్ కం టాక్స్ యాజమాన్యం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతి పత్రం ద్వారా కోరడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా నాలుగు లేబర్ కోడ్ ల వల్ల సింగరేణికి కూడా ప్రమాదం ఉందని, ఇవి అమ లు కాకుండా అడ్డు కోవాల్సిన బాధ్యత కార్మిక వర్గం పై ఉందని అందుకు ఎఐటియుసి అవసరమైతే అన్ని కార్మి క సంఘాల ను కలుపుకొని సమ్మె నోటీసు ఇచ్చి సమ్మెకు పిలుపు నిస్తామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ స మావేశంలో ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, నాయకులు రంగు శ్రీను, సంకె అశోక్, ఎస్ వెంకట్ రెడ్డి, సయ్యద్ సోహేల్, సిర్ర మల్లికార్జున్, పెర్క మహేందర్, ఎం ఎ గౌస్, కలవేణి రాజేష్, పర్లపెల్లి రామస్వామి, పొన్నాల వెంకటయ్య, విజయ లక్ష్మి , దాసరి అనిల్ పాల్గొన్నారు.

## మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు సిఎం కప్ పోటీలు

### రాష్ట్ర బిసి,రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/ సిద్దిపేట:** విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు పట్ల ఆసక్తి ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం ఉన్న క్రీడకారులు నైపుణ్యాలను వెలికితీసి వారికి శిక్షణ ఇచ్చి వారిని ఉన్నత స్థాయికి తీసుకోవాలని ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని తీసుకుందని రాష్ట్ర బిసిసంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సిఎం కప్ టార్చ్ ర్యాలీని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వం సంకల్పం తీసుకుంటే సరిపోదని, క్రీడల ఆసక్తి నైపుణ్యం ఉన్న ఆటలకు అనుగుణంగా మీరు శిక్షణ తీసుకోవాలన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ మాత్రమే కాకుండ జిల్లాలో క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. గ్రామీణ, మండల, జిల్లా రాష్ట్ర స్థాయిలో జరిగే సిఎం కప్ టోర్నిలో విద్యార్థులు రాణించాలన్నారు. ఆటలో పాల్గొనే మీ అందరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మట్టిలో మా ణిక్యలైన గ్రామస్థాయి.మండల స్థాయి,జిల్లా స్థాయివరకు ప్రతిభావంతులైన వారికి వెలికి తీసేందుకు గ్రామ,మండల,నియోజకవర్గం స్థాయిలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో సిఎం కప్ పోటీలు నిర్వహించి క్రీడల్లో ప్రోత్సహిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇష్టమైన క్రీడరంగాలను ప్రతిభ చూపించి ఎదగాలని కలెక్టర్ సూచించారు. జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ లింగమూర్తి, జిల్లా యువన క్రీడల అభివృద్ధి అధికారి వెంకటనర్సయ్య, కాంగ్రెస్ నియోజక వర్గం ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, నాయకులు మార్క సతీష్, తదిరులు పాల్గొన్నారు.

## విద్యతో సర్వతోముఖాభివృద్ధి

### ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** విద్య అంటే కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానం మాత్రమే కాదని, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, విలువలు,సృజనాత్మకతను పెంపొందించడమే నిజమైన విద్య అని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. నగరంలోని సీతారాంపూర్‌లో గల ఐవివై విద్యాసంస్థల్లో గురువారం ఘనంగా నిర్వహించిన 'ఐవివై ఫియెస్టా 2026' వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రాథమికస్థాయి నుంచే విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులపై ఉందన్నారు. దేశభక్తి నృత్యాలు దేశ ఐక్యతను చాటి చెప్పాయి. ఇటీవల ప్రవేశపెట్టిన షార్క్ ట్యాంక్ ఆర్థిక అక్షరాస్యత, టిఇడి ఇడి వేదిక ద్వార విద్యార్థులు తమ ఆలోచనలను సృజనాత్మకంగా పంచుకోవడం అభినందనీయమని గంగుల కమలాకర్ ప్రశంసించారు. వివిధ రంగాల్లో ప్రతభ చూపిన విద్యార్థులను, ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందించి సన్మానించారు. సంస్థ వ్యవస్థాపకులు పసుల మహేష్, కో చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి, డైరెక్టర్ పసుల జయశ్రీ, ప్రిన్సిపల్ కోల మాలతి, మాజీ డిప్యూటీ మేయర్ హరిశంకర్, మాజీ గ్రంథాలయ చైర్మన్ రవీందర్‌రెడ్డి, కర్ర రాజశేఖర్, మిడిదొడ్డి నవీన్ తదితరులున్నారు.

## ట్రాఫిక్ రూల్స్, వాహనాలు, డ్రైవింగ్ శిక్షణలపై అవగాహన

### ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రత్యక్ష అనుభవం విద్యార్థులకు భవిష్యత్ జీవితానికి ఎంతో మేలు చేస్తుందని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. పీఎంశ్రీ కింద తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గ్రామంలో ఉన్న తెలంగాణ ఇన్స్టిట్యూట్ అఫ్ డ్రైవింగ్ స్కిల్స్ (టైడ్స్) కు ఎక్స్ పోజర్ విజిట్ కార్యక్రమాన్ని శుక్రవారం సిరిసిల్ల గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 6వ తరగతి విద్యార్థులకు నిర్వహించగా, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడారు. ప్రత్యక్ష అనుభవం విద్యార్థులకు జీవితాంతం గుర్తు ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా టైడ్స్ లో వివిధ రకాల వాహనాలు, రెండు, నాలుగు వరుసల రహదారులు, సిమ్యులేటర్ వాహనాలపై లైట్ మోటార్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్, వాహనాల, విడిభాగాల పనితీరు, ట్రాఫిక్ నిబంధనలు, తమకు వచ్చిన సందేహాలను టైడ్స్ నిర్వాహకులతో అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, కో ఆర్డినేటర్లు శైలజ, పద్మజ, వెంకన్న, పాఠశాల హెచ్ఎం శారద, టైడ్స్ బాధ్యులు దురై మురుగన్ తదితరులు ఉన్నారు.

## చైనా మాంజా విక్రయిస్తే చర్యలు



**ప్రజాపక్షం /కాసిపేట/మందమర్రి/బెల్లంపల్లి:** సంక్రాంతి పండుగ వేళ నిషేధిత చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మందమర్రి ఎసిపి రాజశేఖర్, బెల్లంపల్లి టూటౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్, దేవాపూర్ ఎస్ఐ గంగారాం హెచ్చరించారు. శుక్రవారం మందమర్రి, బెల్లంపల్లి, దేవాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వేర్వేరుగా దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. గాలిపటాలు ఎగరవేసే ఉత్సాహంలో యువత తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో పడేయవద్దని సూచించారు. నైలాన్, సింథటిక్ దారంతో తయారు చేసిన చైనా మాంజా గొంతుకు తగిలితే కోసుకుపోయే ప్రమాదం ఉందని, గతంలో ఇలాంటి విషాద ఘటనలు జరిగాయని గుర్తు చేశారు. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 కింద ఇప్పటికే చైనా మాంజా తయారీ, విక్రయం, రవాణా, వినియోగంపై నిషేధం ఉందని స్పష్టం చేశారు. పట్టణంలోని ఫ్యాన్సీ, జనరల్ స్టోర్లలో నిషేధిత మాంజా విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పిల్లలు గాలిపటాలు ఎగురవేసేటప్పుడు వారు ఏ రకమైన దారం వాడుతున్నారో గమనించాలని, కేవలం కాటన్ దారం మాత్రమే వాడేలా చూడాలని కోరారు. నిషేధిత మాంజా విక్రయం, నిల్వ గురించి సమాచారం ఉంటే 100 డయల్ చేసి తెలియజేయాలని సూచించారు. ఎఎస్ఐ మిలన్, బ్లూ కోల్ట్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.వంద ఇస్తేనే నల్లా కనెక్షన్

**ప్రజాపక్షం / చెన్నూరు :** ప్రజలకు తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన అమృత్ 2.0 పనుల్లో కాంట్రాక్ట్ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. చెన్నూరు మున్సిపల్ పరిధిలో ఈ పథకం కింద నల్లా కనెక్షన్లు పూర్తిగా ఉచితంగా ఏర్పాటు చేయాల్సి ఉండగా ఒక్కో కనెక్షన్ కోసం సిబ్బంది వంద రూపాయలు వసూలు చేస్తున్నారని పట్టణంలోని నల్లగొండ పోచమ్మ వాడకు చెందిన కొడిపెల్లి సతీష్ ఆరోపించారు. వార్డులోని ప్రతి ఇంటి నుంచి వంద రూపాయలు వసూలు చేసి నల్లా కనెక్షన్ ఏర్పాటు చేసిన సిబ్బంది, తాను డబ్బులు ఇవ్వలేదని నెపంతో కనెక్షన్ ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమృత్ 2.0 కాంట్రాక్ట్ సిబ్బంది తీరుపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నల్లా కనెక్షన్ల పేరుతో సిబ్బంది చేస్తున్న వసూళ్లను అరికట్టి, ఉచితంగా కనెక్షన్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్



**ప్రజాపక్షం / రెబ్బెన :** విధి నిర్వహణలో మరణించిన గ్రామపంచాయతీ కార్మికుడు చిర్ర బానయ్య కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. కుమురం భీం జిల్లా రెబ్బెన మండలంలోని గోలేటి గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న బానయ్య గురువారం విధి నిర్వహణలో ఉండి అకస్మాత్తుగా మరణించడంతో యూనియన్ నాయకులు నివాళులర్పించారు. బానయ్య ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వారి కుటుంబానికి గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ పక్షాన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బానయ్య కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, రెండు ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.సిపిఐ మండల కార్యదర్శి రాయిల్ల నర్సయ్య, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు రాచకొండ రమేష్, కార్యదర్శి రత్నం దేవాజి, జిల్లా నాయకులు సుధాకర్, బాబాజి, సిబ్బంది భీమయ్య, లక్ష్మి, ఎల్లమ్మ, పద్మ పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ



**ప్రజాపక్షం/బాల్కొండ:** మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సహకారంతో మండల కేంద్రానికి చెందిన తోట లక్ష్మికి సిఎం సహాయనిధి నుంచి రూ.36 వేలు ఆస్పత్రి బిల్లు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బద్దం ప్రవీణ్‌రెడ్డి చేతుల మీదుగా చెక్కును అందజేశామన్నారు. పట్టణ అధ్యక్షులు సాగర్ యాదవ్, వేముల్ల భాస్కర్‌రాజేశ్వర్, ప్రసాద్‌గౌడ్, నరేష్ పాల్గొన్నారు.

## చట్టాలపై విద్యార్థులకు అవగాహన

మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్

**ప్రజాపక్షం / నస్పూర్ :** మహిళలు, విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్ సూచించారు. పోక్సో చట్టం ద్వారా 18 సంవత్సరాల లోపు పిల్లలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ లభిస్తుందని, నేరాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు ఉంటాయని, ఈవ్ టీజింగ్‌కు గురైనప్పుడు భయపడకుండా డయల్ 100 లేదా షీ టీమ్‌ను సంప్రదించాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరాలకు సంబంధించి 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలని పేర్కొన్నారు. అవసరమైతే అనుచిత ప్రవర్తనను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని, మహిళల భద్రత కోసం టిసేఫ్ యాప్ వినియోగించుకోవాలని తెలిపారు. రామగుండం షీటీమ్ వాట్సాప్ నంబర్ 630 3923700, మంచిర్యాల షీటీమ్ నంబర్ 87126 59385లను సంప్రదించాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సభిహా సుల్తానా, షీ టీమ్ సిబ్బంది మహిళా కానిస్టేబుల్ శ్రీలత, కానిస్టేబుల్ సతీష్, పాల్గొన్నారు.

## వశిష్ఠ హైస్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని ఆదర్శ్ నగర్‌లో గల స్థానిక వశిష్ఠ హై స్కూల్‌లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు.విద్యార్థినీలకు ముగ్గుల పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతులు అందజేశారు.విద్యార్థులు పతంగులు ఎగురవేస్తూ పండుగ వాతావరణాన్ని సృష్టించారు.పాఠశాల చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ,తరతరాలుగా వస్తున్న సంస్కృతి,సంప్రదాయాలను కాపాడుతూ భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.పాఠశాల ప్రిన్సిపాల్ గొల్లపల్లి మాధవి,ఉపాధ్యాయులు,ఉపాధ్యాయినులు,పాల్గొన్నారు.

### గ్రామీణ యువత

# క్రీడల్లో రాణించాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లాలోని గ్రామీణ యువత పల్లె స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ జిల్లా కేంద్రం లోని ప్రధాన పోస్ట్ ఆఫీస్ సర్కిల్ నుండి ధ్యాన్చంద్ చౌరస్తా వరకు ముఖ్యమంత్రి కప్ (సిఎం కప్) టార్చ్ ర్యాలీని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, డీఎస్పీ ప్రసన్నకుమార్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తో కలిసి మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ టార్చ్‌ని వెలిగించి జెండా ఊపి ప్రారంభించారు. సిఎం కప్ టార్చ్ ర్యాలీ ప్రధాన లక్ష్యం గ్రామీణ ప్రాంతాల యువతను క్రీడల వైపు ఆకర్షించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను చాటేలా ప్రోత్సహించడమేనని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తెలంగాణకు సంబంధించి స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభించే దిశగా ముందుకు పోతుందని గుర్తు చేశారు. పల్లెలోని యువత, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంపొందించుకోవాలని, దీనివల్ల శారీరక దృఢత్వంతో పాటు వ్యక్తిత్వ వి కాసం కూడా లభిస్తుందన్నారు. అలాగే తాము ఎంచుకున్న క్రీడల్లో కష్టపడి రాణిస్తే పల్లె స్థాయి నుండి ప్రపంచ స్థాయి ఛాంపియన్లుగా ఎదుగొచ్చని అన్నారు. సి.యం కప్ ద్వారా ప్రభు త్వం యువతకు, విద్యార్థులకు క్రీడా ప్రతిభను ప్రదర్శించుకునే గొప్ప వేదికను కల్పించిందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, పాల్గొన్నారు.



## శారీరక ఆరోగ్యానికి ప్రాధాన్యత

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం / మంచిర్యాల :** ప్రతి ఒక్కరూ శారీరక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా అన్ని రంగాలలో ఆత్మస్థైర్యంతో రాణించవచ్చని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సిఎం కప్ క్రీడలు 2025లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో అధికారులతో కలిసి టార్చ్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. తెలంగాణ క్రీడల సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన సిఎం కప్ 2025 రెండవ ఎడిషన్ పోటీలను జిల్లాలో విజయవంతం చేయాలని కోరారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కలగడంతో పాటు చేసే పనిలో ఏకాగ్రత పెరుగుతుందని, రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీ ఏర్పాటు చేశామని, విద్యా సంస్థలు క్రీడలకు సమయం కేటాయించాలని సూచించారు. గ్రామపంచాయతీ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయికి పంపిస్తామని వివరించారు. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాణించాలని ఆకాంక్షించారు. డిసిపి ఎ భాస్కర్, ఎసిపి ప్రకాష్, జిల్లా యువజన క్రీడా సేవల శాఖ అధికారి హనుమంత రెడ్డి, అధికారులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

బస్తీ దవాఖానను ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్



**ప్రజాపక్షం/మోర్తాడ్:** ప్రజల ఆరోగ్యాల పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి ఎనలేని ప్రాధాన్యత ఇస్తుందని బస్తీ దవాఖానలో ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని వసతి సదుపాయాలు, నిష్ణాతులైన వైద్యులను అందుబాటులోకి తెచ్చిందని గుర్తు చేశారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని 32వ వార్డు పరిధిలో పాత చావిడి భవనంను అన్ని విధాలుగా ఆధునీకరించి నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ప్రారంభోత్సవం చేశారు. బస్తీ దవాఖానలోని వివిధ విభాగాలను పరిశీలించి, అందుబాటులోకి వచ్చిన వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు స్థానికంగా ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని ఉద్దేశ్యంతో బస్తీ దవాఖానాను అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఈ కేంద్రంలో అన్ని రకాల వైద్య పరీక్షలు, ఆరోగ్య సేవలు నిర్వహిస్తూ ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. ప్రజలు ముఖ్యంగా మహిళలు తమ ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, ఉచిత ఆరోగ్య సేవలను వినియోగించుకోవాలన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమీషన్ ఛైర్మన్ గడుగు గంగాధర్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ, ఉప వైద్యాధికారి డాక్టర్ సమత, మున్సిపల్ కమీషనర్ జాదవ్ కృష్ణ, బోధన్ తహసీల్దార్ విఠల్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ నగేష్ రెడ్డి, స్థానిక నాయకులు శరత్ రెడ్డి లుఉన్నారు.

## ఇవిఎం గోదాంలో : కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తనికీ చేశారు.అన్ని రిజిస్టర్లను,సీసీ కెమెరాల పనితీరు పరిశీ లించారు.పోలీసు సిబ్బంది నిరంతరం మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు.ఎల్లప్పుడు అగ్ని మాపక పరికరా లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అధికా రులు సర్ఫరాజ్,రాజశ్రీ,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రాయింగ్,టైలరింగ్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో శనివారం నుంచి నిర్మల్ జిల్లాలో నిర్వహించనున్న డ్రా యింగ్ ,టైలరింగ్ పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా విద్యా శాఖ అధికారి దర్శనం భోజన్న తెలిపారు.డ్రాయింగ్ లోయర్ పరీక్షకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల జుమ్మెరత్‌పేట్(నిర్మల్),డ్రాయింగ్ హయ్యార్ పరీక్షకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల కస్బా(నిర్మల్)లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ పరీక్షలు ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## నూతన సర్పంచ్‌లకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/మామడ :** నిర్మల్ జిల్లా మామడ మండలంలోని కోరిటికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిధిలోని కొరటికల్,బోరిగం,బోరిగం తాం డ,వడ్డేపల్లి గ్రామాల్లో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్ ఉ సర్పంచ్ వార్డు మెంబర్లను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ప్రధాన ఉపాధ్యాయులు వెంకట్ రమణారెడ్డి ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మోహన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుంటే అత్యున్నత స్థాయికి ఎదుకుతామని ఎంతోమంది ప్రముఖులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకొని ఉన్నత శిఖరాలను ఎదిగారని అన్నారు.విద్యా కమిటీ చైర్మన్ రమణ వైస్ చైర్మన్ రాజసాగర్,విడిసి చైర్మన్ చిన్న లింగారెడ్డి ఉపాధ్యాయులు,గ్రామస్తులు పాల్గొన్నారు.




## ఉపాధిహామీ పథకాన్ని పునరుద్ధరించాలి

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాటిపల్లి నగేష్‌రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ స ందర్భంగా మాట్లాడుతూ 2004లో సోనియాగాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానమంత్రిగా మన్మోహన్‌సింగ్, యుపిఎ చైర్‌పర్సన్‌గా సోనియా గాంధీ అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ ప్రాంతం మెదక్ జిల్లాలో ఆంధ్ర ప్రాంతంలో పర్యటించినప్పుడు వలసలు చూసి జాతీయ ఉపాధిహామీ పథకాన్ని తీసుకరావటం జరిగిందని దానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకమని పేరు పెట్టడం జరిగిందన్నారు. మహాత్మాగాంధీ పేరును తీసివేసి జి రామ్ జి అని పేరు పెట్టి పథకాన్ని నీరుగార్చేలా బీజేపీ చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, గంగారెడ్డి, సురేష్‌బా బా, యాదగిరి, రాజా నరేందర్‌గౌడ్, సంతోష్, ఎజాస్, ఈసా, సాయిరెడ్డి, నరేందర్‌గౌడ్, గణేష్, జనార్ధన్, అష్రఫ్ పాల్గొన్నారు.

## ‘తారా’విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంగారెడ్డికి చెందిన విద్యార్థులు నాలుగు రోజుల పాటు నిర్వహించిన తంజావూర్ పెయింటింగ్ సర్టిపికెట్ కోర్సులో కనబరిచిన ప్రతిభ అభినందనీయమని జిలా కలెక్టర్ పి .ప్రావీణ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ను తారా కళాశాల ప్రిన్సిఫల్ విద్యార్థులు కలిశారు.ఇలాంటి కళా నైపుణ్య శిక్షణా కోర్సులు విద్యార్థుల్లో మానసిక స్తిరత్వం సృజనాత్మకతను పెంపొందిచడంతో పాటు భవిష్యత్తులో ఆర్థిక స్వాలంబనకు దోహదపడతాయని తెలిపారు. అరుదైన కళారూపాలను కాపాడుతూ ఉపాది అవకాశాలు కల్పించే విదంగా ఈ కోర్సును నిర్వహించడం అభినందనీయమన్నారు. తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఆర్థశాస్త్ర విభాగం ఆద్వర్యంలో సోలాపూర్ కు చెందిన స్వచ్ఛంద సంస్థ జ్ఞాన ప్రబోదిని ,మల్లికార్జున హైస్కూల్ రాంకబాయి హత్తురే జూనియర్ కళశాల సోలాపూర్ వారి సంయుక్త సహకారంతో 25 గంటల తంజాపూరు పెయింటింగ్ సర్టిపికెట్ కోర్సు నిర్వహించామని కళాశాలప్రిన్సిపల్ డాక్టర్ప్రవీణ్య తెలిపారు. ఈ కో ర్సున బోదించేందుకు సోలాపూర్‌కు చెందిన రిసోర్స్ పర్సన్ ప్రొఫెసర్ మల్లికార్జున్ బిరాజ్ దార్ కళాశాలకు వచ్చి ఇక్కడి బస చేసి ప్రతి రోజు ఆరుగంటల చోప్పున శిక్షణ ఇచ్చి విద్యార్థులకు తంజావూరు, పెయింటింగ్‌కు సంబందించిన కనీస నైపుణ్యాలను నేర్పించారని తెలిపారు. పెయింటింగ్ అన్నది మానసిక సౌందర్యానికి ,సృజనాత్మకతనకు ప్రతీక అని ఈ కోర్సులో విద్యార్థులు ఎంతో ఉత్సహంగా పాల్గొన్ని నైపుణ్యాలు సాదించడాన్ని కలెక్టర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రత్యేకంగా అభినందించారు. కోర్సును సమర్థవంతంగా బోదించిన మల్లిఖార్న బిరాజ్ దార్ కళాశాల ప్రిన్సిపల్ అద్యాపక బృందం ,ఆర్థశాస్త్ర విభాగదిపతి డాక్టర్ జగదీశ్వర్, అద్యాపకురాలు డాక్టర్ అనురాధ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి ఉపాది కల్పించే వృత్తి విద్యను ప్రొత్సహించే దిశగా తారా కళాశాల నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. పెయింటింగ్ సర్టిపికెట్ వర్క్‌షాప్, విజయవంతంగా ముగిసిందని ఇలాంటి ఉపాది కల్పించే వృత్తి నైపుణ్య కోర్సుల ద్వారా విద్యార్థులు తమ కాళ్లపై తాము నిలబడే అవకాశం లబిస్తుందని ఇతరులపై ఆదారపడే అవసరం తగ్గుతుందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నిర్మల, జగదీశ్వర్, ఆర్థశాస్త్ర విభాగ అధ్యాపకులు ,జ్ఞానప్రబోదిని సంస్థకు చెందిన మురళి రిసోర్స్ పర్సన్ మల్లికార్జున్ బి రాజ్‌దార్ విద్యార్థులు పాల్గొన్నారు.



## మత్స్యకారుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు.శుక్రవారం కడెం ప్రాజెక్టులో చేప పిల్లలను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకార సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని మత్స కారుల ఆర్థిక అభివృద్ధికి ప్రాజెక్టులు,చెరువుల్లో 100 శాతం రాయితీతో చేప పిల్లలు పంపిణీ చేయడం,ఫిష్ మార్కెట్లు,చేపల ఉత్పత్తులను అమ్మడానికి మొబై ల్ క్యాంటీన్లు తదితర వాటిని సబ్సిడీపై వారికి అందజేస్తున్నట్లు సూచించా రు.ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఏఎంసి చైర్మన్ పడిగేలా భూషణ్,జిల్లా మత స్య శాఖ అధికారి రాజా నర్సయ్య,ఇరిగేషన్ అధికారి నితిన్ ఆయా గ్రామాల సర్పంచులు,కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.



## యువకులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలి

సిఐ రవీందర్ నాయక్

**ప్రజాపక్షం/ముధోల్ :** యువకులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని సిఐ రవీందర్ నాయక్, సర్పంచ్ షబానా ఎజాజ్ ఉద్దీన్ సూచించారు. ముధోల్ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ను సర్పంచ్ షబానా ఎజాజ్ ఉద్దీన్ టాస్ ఎగురవేసి ప్రారంభించారు.క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గెలుపోటములు సహజమని,గెలిచిన వారు ఓడిన వాళ్ల పోరాట పటిమను మెచ్చుకోవాలని సూచించారు. ఆటలు ఆడేటప్పుడు చైతన్యం, ఉత్తేజం ఉంటుందని అన్నారు.ప్రారంభ మ్యాచ్ లోరబింద్ర స్కూల్(ముధోల్) వర్సెస్ ఎఫ్ టి(బైంసా) జట్లు పోటిపడగా బైంసా జటు బోణి కొట్టింది.రెండవ మ్యాచ్‌లో సర్కిల్ స్ట్రైకర్స్ ముధోల్ టీమ్ వర్సెస్ బట్టి గల్లీ ముధోల్ జట్టు పోటీపడగా సర్కిల్ స్ట్రైకర్స్ ముధోల్ జట్టు విజయం సాధించింది.మ్యాచ్ ప్రారంభోత్సవ శ్రీనివాస్,ఎస్.ఐ పెర్సిస్ సాయినాథ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామ్ నాథ్,మాజీ ఎంపీపీ అఫ్రోజ్ ఖాన్,వార్డ్ సభ్యులు విశ్వంబర్, ముజీబ్, సాయినాథ్,విష్ణు, మాక్దూ మ్, దేవోజీ భూమేష్,బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న,యినాథ్, జీవన్, మదన్ ఇమ్రాన్, షకీల్, షామిమ్, అభిద్, అ ఫ్రోజ్, ప్రింట్అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాల్గొన్నారు.



## ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రాజకమలాకర్‌రెడ్డి

**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** కేంద్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, జాతీయ పెన్షన్ పథకం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రాజకమలాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ అఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఎఐజెఎసిటిఒ) పిలుపు మేరకు టిఎస్‌యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని చేడ్వాయి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సర్వీస్‌లో ఉన్న టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలని, జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం జనవరి 10న ప్రధాని, రాష్ట్రపతులకు మెయిల్ ద్వారా మెమోరండలు పంపించాలని సూచించారు. ఫిబ్రవరి 5న చలో పార్లమెంట్ నిరసన ప్రదర్శనను జయప్రదం చేయడానికి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు అశోక్‌చందర్, సంతోష్‌కుమార్, శ్రీనివాస్, శిల్ప, ద్రుపదబాయి, శ్రీకాంత్, వెంకటేష్, శ్రీధర్, సునీత, అశ్విని పాల్గొన్నారు.



## మలేషియా ఓపెన్ సెమీఫైనల్లోకి పివి సింధు




ఒలింపిక్ పతక విజేత పివి సింధు.. మలేషియా ఓపెన్ సూపర్ బ్యాడ్మింటన్ టోర్నీలో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ప్రత్యర్థి జపాన్ క్రీడాకారిణి అకనే యమగుచి గాయం వల్ల రిటైర్ అయ్యింది. దీంతో పివి సింధు ఎటువంటి ప్రతిఘటన లేకుండానే సెమీస్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. మూడు సార్లు వరల్డ్ చాంపియన్ అయిన యమగుచిపై తొలి గేమ్‌లో 21–11 తేడాతో పీవీ సింధు విక్టరీ కొట్టింది. అయితే మోకాలి బెల్ట్ పెట్టుకుని గేమ్ ఆడిన జపాన్ ప్లేయర్ తొలి గేమ్ ఓడిన తర్వాత మ్యాచ్ నుంచి తప్పుకున్నది. ప్రస్తుతం వరల్డ్ నెంబర్ 18వ స్థానంలోఉన్న సింధు.. గాయం నుంచి కోలుకున్న తర్వాత తొలిసారి టోర్నమెంట్ ఆడుతున్నది.

## ఫైనల్ బెర్త్‌కు ఆస్ట్రేలియా..

### ఆరో ర్యాంక్‌లో టీమిండియా !



ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ర్యాంకింగ్స్‌లో సమీకరణాలు మారుతున్నాయి. స్వదేశంలో ముగిసిన యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్‌ను 4–1తో చిత్తు చేసిన ఆస్ట్రేలియా అగ్రస్థానం నిలబెట్టుకుంది. తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన ఆసీస్ 87.50 విజయాల శాతంతో ఫైనల్ బెర్తుకు మరింత చేరువైంది. సొంతగడ్డపై దక్షిణాఫ్రికా చేతిలో వైట్‌వాష్‌కు గురైన భారత జట్టు ఆరో ర్యాంక్‌లోనే కొనసాగుతోంది. యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా జోరుతో డబ్ల్యూటీసీలో నంబర్ 1 ర్యాంక్ కాపాడుకుంది. ఇటీవల వెస్టిండీస్‌ను వైట్‌వాష్ చేసిన న్యూజిలాండ్ 77.78 విజయావకాశాలతో రెండో ర్యాంక్ కైవసం చేసుకుంది. గత సీజన్ విజేత దక్షిణాఫ్రికా మూడో స్థానంలో నిలవగా.. శ్రీలంక 66.67 శాతం విజయాలతో నాలుగో ర్యాంక్ సాధించింది. పాకిస్థాన్ ఐదో ర్యాంక్‌లో ఉండగా.. టీమిండియా ఆరో ర్యాంక్‌లోనే ఉండిపోయింది. డబ్ల్యుటిసిలో వరుసగా రెండుసార్లు ఫైనల్ ఆడిన భారత్ హ్యాట్రిక్ ఆశలు ఆవిరవుతున్నాయి. ఈసారి ఎలాగైనా టెస్టు గదను పట్టయాలనుకున్న టీమిండియా సొంతగడ్డపై దక్షిణాఫ్రికా చేతిలో క్లీన్‌స్వీప్ గురవ్వడంతో మూడు నుంచి ఐదో స్థానంలో నిలిచింది. అయితే.. రెండో టెస్టులో శుక్రవారం వెస్టిండీస్‌ను 9 వికెట్లతో చిత్తు చేసిన న్యూజిలాండ్ మూడో ర్యాంక్‌కు ఎగబాకగా.. గిల్ సేన ర్యాంకు ఆరుకు దిగజారింది. కొత్త ఏడాదిలో టీమిండయా ఐదు టెస్టులు మాత్రమే ఆడనుంది. జూన్‌లో అఫ్గనిస్థాన్‌తో ఏకైక టెస్టు, ఆపై ఆగస్టులో శ్రీలంక పర్యటనలో రెండు, అక్టోబర్‌లో న్యూజిలాండ్ గడ్డపై రెండు మ్యాచులు ఉన్నాయంతే. ఈ ఐదు మ్యాచుల్లో గెలిచినా.. టాప్ 3లోని జట్ల ఫలితాలపై శుభ్‌మన్ గిల్ సేన ఆధారపడాల్సి ఉంటుంది.

## బిసిబి ఆట కట్..

### స్పాన్సర్లు వెళ్లిపోయే ఛాన్స్ ఆందోళనలో బంగ్లా క్రికెటర్లు




బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల నేపథ్యంలో ఐపిఎల్ నుంచి ముస్తాఫిజుర్ తొలగింపు అంశం బంగ్లాదేశ్ క్రికెట్‌కు ఇబ్బందిగా మారింది. ఇరు దేశాల మధ్య నెలకొన్న వివాదం ప్రభావం బంగ్లాదేశ్ క్రికెట్ పై గట్టిగానే పడే సూచనలున్నాయి. ఆ దేశ క్రికెట్ స్పాన్సర్స్.. స్పాన్సర్ షిప్ నుంచి వైదొలిగే అవకాశాలున్నాయి. ఇదే జరిగితే బంగ్లా క్రికెట్ ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంటుంది. ఇప్పుడు ఇదే అంశం ఆ దేశ క్రికెటర్లను ఆందోళనకు గురి చేస్తోందట. బంగ్లాదేశ్ క్రికెటర్లకు ఇండియాకు చెందిన ఎస్జీ (సన్స్పారీల్స్ గ్రీన్ ల్యాండ్స్) సంస్థ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. బంగ్లా కెప్టెన్ లిటన్ దాస్ సహా పలువురు క్రికెటర్లకు స్పాన్సర్‌గా ఆర్థిక అండదండలు అందిస్తోంది. అయితే, ఇండియాబంగ్లా దేశాల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో ఇకపై బంగ్లా క్రికెటర్లకు స్పాన్సర్ చేయకూడదని ఎస్జీ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే అక్కడి క్రికెటర్లు భారీగా నష్టపోతారు. దీని ప్రభావం బంగ్లా క్రికెట్ పై ఉంటుంది. అలాగే, ఇతర స్పాన్సర్లు కూడా వెనుదిరిగే అవకాశాలున్నాయి. దీంతో తమ క్రికెట్ జట్టుకు స్పాన్సర్ షిప్ లేకపోతే.. ఆర్థిక ఇబ్బందులు తప్పవని ఆ దేశ క్రికెట్ బోర్డ్ (బిసిబి) భావిస్తోంది. ఈ విషయంలో ప్రస్తుతం క్రికెటర్లు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారని ఆ బోర్డు మెంబర్ తెలిపారు. అయితే, స్పాన్సర్ షిప్ నుంచి వైదొలగడంపై ఇంకా అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. కానీ, తాజా పరిణామాలు మాత్రం ఈ నిర్ణయం తప్పదని సూచిస్తున్నాయి. ఇక.. రాబోయే టీ20 వరల్డ్ కప్‌కు సంబంధించి తమ జట్టు ఇండియాలో ఆడబోదని, మరో వేదిక నిర్ణయించాలని బిసిబి.. ఐసిసిని కోరింది. కానీ, దీనికి ఐసిసి అంగీకరించలేదు.

## అయ్యర్ ఫిట్

### కివీస్‌తో వన్డే సిరీస్‌కు లైన్ క్లియర్!




టీమిండియా బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్.. ఫుల్‌గా కోలుకున్నట్లు సమాచారం వచ్చేసింది. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో గాయపడ్డ అయ్యర్.. తాజాగా జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో రెండు వన్డేలు ఆడాడు. అతని ఫిట్‌నెస్ ఆధారంగా న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో ఆడేది లేనిది తేల్చాలని నిర్ణయించారు. అయితే బెంగుళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కీలకమైన అప్‌డేట్ ఇచ్చింది. శ్రేయాస్ అయ్యర్ అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడేందుకు మెడికల్‌గా ఫిట్ ఉన్నట్లు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పేర్కొన్నట్లు ఓ మీడియాలో కథనం వచ్చింది. దీంతో అతను కివీస్‌తో జరిగే వన్డే సిరీస్‌లో ఆడేందుకు లైన్ క్లియర్ అయ్యింది. ఆసీస్‌తో జరిగిన మ్యాచ్‌లో క్యాచ్ అందుకోబోయి అయ్యర్ కిందపడ్డాడు. ఆ సమయంలో అతని మోచేయి కడుపులో వత్తేసింది. దీంతో ఉదరంలోని స్ప్లీన్ దెబ్బతిని రక్తస్రావం జరిగింది. ఆస్ట్రేలియాలోనే అతనికి సర్జరీ జరిగింది. అయితే చికిత్స నుంచి కోలుకున్న అతను విజయ్ హజారే ట్రోఫీలో ఆడాడు.

## సైన్స్

## ద్రవ్యరాశి సూత్రాలకు 'పాక్షిక కణం' సవాలు!



భౌతిక శాస్త్రవేత్తలు ద్రవ్యరాశి గురించి చేసిన సిద్ధాంతాలు, ఇచ్చిన వివరణలను సవాలు చేసే అతి విచిత్రమైన 'పాక్షిక' లేదా క్వాసీ కణాన్ని పరిశోధకులు ఇటీవల గుర్తించారు. ఈ కణం ఒకే దిశగా కదులుతున్నప్పుడు మాత్రమే, అందుకలో ద్రవ్యరాశిని గుర్తించడానికి వీలు కలుగుతున్నది. అది భిన్న దిశల్లో చలించినా లేదా ఆగినా, ఆ ద్రవ్యరాశి దాదాపు మాయమవుతున్నది. ఇది విచిత్ర ప్రవర్తన మాత్రమేకాదు.. గమనం, క్వాంటం ఫీల్డ్స్‌పై శాస్త్రవేత్తల అభిప్రాయాలను, ఆలోచనలను కూడా మార్చే ఆవిష్కరణ. సంప్రదాయ భౌతిక శాస్త్రం ప్రకారం ద్రవ్యరాశి అనేది పదార్థానికి ఉన్న శాశ్వతమైన లక్షణం. కానీ, ఈ క్వాసీ కణం ఆ నియమానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నది. ఇది ఒకే దిశలో ప్రయాణిస్తున్నప్పుడు మాత్రమే బరువు ఉన్నట్లుగా ప్రవర్తిస్తుందని క్వాంటం పదార్థాలపై జరిగిన అధ్యయనాల్లో వెల్లడైంది. అందులోని కణాలు సాధారణ పదార్థంలోని కణాలతో పోలిస్తే పూర్తిగా భిన్నంగా ప్రవర్తిస్తాయి. ఈ వ్యవస్థలు అతిశయ పరిస్థితులను అనుకరించగలవు. దాంతో సాధారణ భౌతిక శాస్త్ర నమూనాలో కనిపించని కొత్త లక్షణాలున్న కణాలు బయటపడతాయి. శాస్త్రవేత్తలు కనుగొన్న కణం ద్రవ్యరాశి తగ్గుదల లేదా పెరుగుదలపై కాకుండా, వెళ్లే దిశపై ఆధారపడుతుందనే కొత్త ప్రతిపాదనలకు శ్రీకారం చుట్టింది. ప్రాథమిక శాస్త్రంలోనూ, సాంకేతికతలోనూ కొత్త చర్చలకు తెరతీసింది. ఇలాంటి విచిత్ర ప్రవర్తనను వేగంగా, దిశ సున్నితంగా పనిచేసే సమాచార ప్రవాహం కోసం ఉపయోగించవచ్చు. అలాగే విశ్వంలోని అసమానతల గురించి కూడా ఇది సంకేతాలు ఇస్తుంది. ఎందుకు కొన్ని ప్రక్రియలు ఒక దిశను మరొక దిశ కంటే ఎక్కువగా ప్రాధాన్యపరుస్తాయో ఇది అర్థం చేసుకోవడానికి ఈ కొత్త ప్రయోగం సహాయపడుతుంది. ప్రత్యేకించి, ఇది ద్రవ్యరాశి, దాని గమనానికి సంబంధించి శతాబ్దాలుగా ఉన్న ఊహలను సవాలు చేస్తోంది. భౌతిక శాస్త్రంలో ద్రవ్యరాశి శక్తి, గురుత్వం, జడత్వంతో అనుసంధానమై ఉంది. ద్రవ్యరాశి దిశను బట్టి కనిపిస్తే లేదా మాయమైతే, కణాలు స్థలం కాలంతో ఎలా పరస్పర చర్య చేస్తాయో అనేదాన్ని మళ్లీ ఆలోచించాల్సి రావచ్చు. సరికొత్త సిద్ధాంతాలకు ఆరంభం మాత్రమే కావచ్చు. ఇలాంటి విచిత్ర కణాలు ప్రస్తుత భౌతిక శాస్త్రం దాటి ఉన్న విశ్వపు దాగి ఉన్న నియమాలను బయటకు తేవడంలో సహాయపడతాయనడంలో సందేహం లేదు.

## 'విశ్వం' ఎందుకు ఉనికిలో ఉంది?

ప్రపంచంలోని ప్రధాన భౌతిక శాస్త్ర సంస్థలకు చెందిన పరిశోధకులు సిపిటి ఆధారంగానే క్వాంటంస్థాయి ప్రాథమిక నియమాన్ని పరిశీలిస్తున్నారు. వారి తాజా పరిశోధనలో పదార్థం, ప్రతిపదార్థం (మ్యాటర్, యాంటీమ్యాటర్) సమతుల్యతపై కీలక ఆధారాలు లభించాయి. ఇవి విశ్వం ఎందుకు ఉనికిలో ఉంది? అన్న ప్రశ్నకు సమాధానం ఇస్తాయి. మహా విస్ఫోటనంలో పదార్థం, ప్రతిపదార్థం సమానంగా పుట్టి ఉంటే, అవి పరస్పరం నాశనం అయ్యి విశ్వం శూన్యంగా ఉండాలి. కానీ వాస్తవం అలా లేదు.నక్షత్రాలు, గెలాక్సీలు, గ్రహాలు, జీవం ఉన్నాయి. దీనినే బ్యారియన్ అసిమ్మెట్రీ సమస్య అంటారు. కొత్త పరిశోధనలో శాస్త్రవేత్తలు ఉపపరమాణు కణాల క్షీణతలో అతి సూక్ష్మమైన అసమానతలు గుర్తించారు. మహా విస్ఫోటనం తర్వాత తొలి క్షణాల్లో జరిగిన ఈ చిన్న అసమానత (ప్రతి బిలియనుకు ఒక కణం మాత్రమే) పదార్థం ప్రతిపదార్థంతో పోలిస్తే కొంచెం ఎక్కువగా మిగలడానికి కారణమై, ఆ తర్వాత మొత్తం విశ్వం నిర్మాణానికి దారితీసింది. ఈ ఫలితాలు ప్రధాన సైన్స్ పత్రికల్లో ప్రచురితం కావడంతో, ఇప్పుడు విస్తృత చర్చలు జరుగుతున్నాయి. విశ్వం యాదృచ్ఛికం కాదని, దీని వెనుక ఇంకా మనకు తెలియని లోతైన భౌతిక నియమాలు, సమ్మితులు ఉండవచ్చని ఈ ఆవిష్కరణ సూచిస్తున్నది. దీనితో శాస్త్రవేత్తలు ఇప్పుడు ఈ ప్రాథమిక శక్తులను మరింత లోతుగా పరిశీలిస్తున్నారు. ఇది విశ్వ ఆవిర్భావ వాస్తవ స్వభావాన్ని అర్థం చేసుకునే దిశగా, భౌతిక శాస్త్రంలో కొత్త యుగానికి మొదటి అడుగు.



## యాదృచ్ఛికాలుకావు.. భౌతిక నియమాలే!



నిజ జీవితంలో జరిగే చాలా సంఘటనలను యాదృచ్ఛికాలుగా భావిస్తూ ఉంటాం. అనుకోకుండా జరిగిందని అనుకుంటాం. కానీ, ఇవన్నీ మనకు కనిపించని లోతైన నమూనాలను, భౌతిక నియమాల ఆధారంగా జరిగే ప్రక్రియలో భాగమని కొత్త అధ్యయనాలు ప్రతిపాదిస్తున్నాయి. క్వాంటం ప్రపంచంలో కణాలు సంభావ్యతల ఆధారంగా ప్రవర్తిస్తాయి. ఏదైనా పరస్పర చర్య జరిగే వరకు వాటికి స్థిరమైన స్థితి ఉండదు. అందువల్ల యాదృచ్ఛికంగా కనిపించే సంఘటనలు అసలు సూక్ష్మమైన, కొలవలేని మార్పుల ప్రభావం కావచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇదంతా మంత్రాల మహిమ లేదా తమ విశ్వాసాల అనుసరణ ఫలితాలుగా భావించడానికి వీల్లేదు. ఇవి భౌతిక శాస్త్రం సహజ భాగాలు. కోహేరెన్స్, ఎంటాంగిల్‌మెంట్, స్థితిగత శాస్త్రం వంటి అధ్యయనాలు ప్రారంభ పరిస్థితుల్లో చిన్న మార్పులే పెద్ద ఫలితాలను తెచ్చివేస్తాయని స్పష్టం చేస్తున్నాయి. మనం గుర్తించలేని మార్పులు ఫలితాన్ని ప్రభావితం చేస్తే, దానిని కొంత మంది అదృష్టంగా భావిస్తారు, కానీ అది భౌతిక నియమాల పనితీరేనన్నది పరిశోధకుల వివరణ. క్వాంటం పరిశీలనలో, కొలిచే చర్య కణాల ప్రవర్తనను ప్రభావితం చేస్తుంది. అంటే ఆలోచనలు వాస్తవాన్ని మారుస్తాయని కాదు.. కొలత స్వయంగా కణ స్థితిపై భౌతిక ప్రభావం చూపుతుందని మాత్రమే అర్థం. క్వాంటం భౌతిక శాస్త్రం ప్రపంచం పూర్తిగా యాదృచ్ఛికం కాదని, సంభావ్యతలు, అంతర్భాగ నమూనాలు నిర్ణయించే విధంగా పనిచేస్తుందని సూచిస్తుంది.

# విస్తృత ప్రచారం : జన సమీకరణ లక్ష్యం

### 12న ట్రాక్టర్ల ర్యాలీ, కవి సమ్మేళనం – 13న ముగ్గుల పోటీలు - 14న ఇంటింటిపై సిపిఐ జెండా

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు, ఆహ్వాన సంఘు కార్యదర్శి బాగం హేమంతరావు వెల్లడి




**ప్రజాపక్షం/ఖమ్మం:** సిపిఐ శతవసంత ముగింపు సభ విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఈ సభకు సంబంధించి విస్తృత ప్రచారం నిర్వహించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు, ఆహ్వానసంఘు కార్యదర్శి బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. భారీ జన సమీకరణే లక్ష్యంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆయన కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం ఖమ్మం జిల్లాకేంద్రంలోని స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో కొండపర్తి గోవిందరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో బాగం మాట్లాడుతూ జనవరి 18న జరిగే చారిత్రిక సభకు భారీఎత్తున జన సమీకరణే లక్ష్యంగా గ్రామగ్రామాన ఇంటింటా సిపిఐ మహాసభ ప్రచారాన్ని చేరవేయాలని ఆయన తెలిపారు. 10వ తేదీ నుంచి 17 వరకు సిపిఐ కార్యాచరణను కార్యవర్గ సమావేశంలో హేమంతరావు ప్రకటించారు. ఈనెల 10న అలంకరణ కమిటీ సమావేశంతో పాటు ఆయా కమిటీల బాధ్యుల సమావేశం జరుగుతుందని తెలిపారు. 11న ఖమ్మం నగరంతో పాటు ప్రధాన కేంద్రాల్లో కాగడాల ప్రదర్శన జరుగుతుందన్నారు. 12న బహిరంగ సభ జయప్రదం కోరుతూ ట్రాక్టర్ ర్యాలీ, పతంగులు, బెలూన్ల ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని హేమంతరావు తెలిపారు. అదే రోజు స్థానిక డిపిఆర్‌సి భవనంలో కవి సమ్మేళనం జరుగుతుందని, ఈ సమ్మేళనానికి ప్రముఖ సినీ, రచయిత సుద్దాల అశోక్‌తేజ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, అభ్యుదయ రచయితల సంఘం బాధ్యులు కెవిఎల్, పల్లేరు వీరస్వామి, రాపోలు సుదర్శన్‌లతో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ కవులు ఈ సమావేశంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. 13న ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు తమ ఇండ్లపై సిపిఐ జెండాలను ఆవిష్కరించాలని ఆయన కోరారు.14న గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించాలని కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చిందన్నారు. ఇందులో జాతీయ మహిళా సమాఖ్యతో పాటు యువజన విద్యార్థి సంఘాలు కూడా పాల్గొంటాయని ఆయన తెలిపారు. ఇప్పటికే ఐదు వేల మందికి జనసేవా దళ్ శిక్షణ ఇవ్వడం జరిగిందని మరో రెండు రోజుల్లో మరి కొంతమందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని హేమంతరావు తెలిపారు. ఇప్పటికే తొలి దఫా ప్రచారం పూర్తయిందని మండలాల్లో మలిదశ ప్రచారం ప్రారంభమైందన్నారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో జరిగిన ప్రధాన ఘట్టాలను తెలియజేసే ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. లక్షలాది మంది సభకు హాజరవుతున్నందున బహిరంగ సభకు సంబంధించి నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలో ఎల్‌ఈడి స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు హేమంతరావు తెలిపారు. ఖమ్మం నలువైపులా నుంచి నాలుగు ప్రదర్శనల ద్వారా సభాస్థలాకి చేరుకుంటారని పెవిలియన్ మైదానం నుంచి వేలాది మంది జనసేవా దళ్ కార్యకర్తల కవాతు ఉంటుందని ఆయన తెలిపారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, ఖమ్మం సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, బిజి క్లెమెంట్, అజ్మీరా రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రాజీలేని పోరాటాల ప్రతీక సిపిఐ

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్




**ప్రజాపక్షం/మందమర్రి :** దేశ రాజకీయాల్లో రాజీలేని పోరాటాలకు ప్రతీకగా నిలిచిన కమ్యూనిస్టు పార్టీ 101వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న చారిత్రక సందర్భంలో ఖమ్మంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ దేశవ్యాప్తంగా ఉద్యమాలకు దిశానిర్దేశం చేయబోతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్ స్పష్టం చేశారు. శుక్రవారం మందమర్రి పట్టణంలోని ఎఐటియుసి కార్యాలయంలో జరిగిన జిల్లా ప్రచార జాతా సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 1925లో దేశ దోపిడీకి వ్యతిరేకంగా పుట్టిన సిపిఐ పేదల ఆకలి తీర్చడం, సమసమాజ స్థాపన లక్ష్యం గా పోరాడుతోందన్నారు. కార్మికుల హక్కుల కోసం, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరల కోసం కమ్యూనిస్టులు ఎప్పుడు ముందువరుసలో ఉండి పోరాడుతారని తెలిపారు. సింగరేణి కార్మికుల హక్కుల కోసం ఎఐటియుసి ఆధ్వర్యంలో సిపిఐ రాజీలేని ఉద్యమాలు నిర్వహిస్తోందని తెలిపారు. సిపిఐ శత వసంతాల ఖమ్మం సభకు అనుబంధంగా చేపట్టిన జిల్లాలో చేపట్టన ప్రచార జాత ముగింపు సభను జనవరి 10న రామకృష్ణాపూర్‌లో నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. దీనికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సభకు జిల్లాలోని పార్టీ శ్రేణులు, కార్మికులు, రైతులు, ప్రజలు కదిలి వచ్చి విజయవంతం చేయాలని కలవేణ శంకర్ పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఎఐటియుసి మంచిర్యాల జిల్లా కార్యదర్శి మేకల దాసు, బెల్లంపల్లి డివిజన్ ఎఐటియుసి కార్యదర్శి దాగం లక్ష్మణ్, సిపిఐ పట్టణ కార్యదర్శి దుర్గరాజు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి సిద్ధం

### సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి సిద్ధమని సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్, నగర కార్యదర్శి ఓమయ్య తెలిపారు. జిల్లాకేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో శుక్రవారం సిపిఐ నగర కౌన్సిల్ సమావేశం రంజిత్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సుధాకర్ మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ ఎన్నికల గుర్తు అయిన కంకి కొడవలి గుర్తుపై పోటీ చేసేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని, ఎర్రజెండా పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం సాధ్యమని ప్రజలు గుర్తించాలన్నారు. ఈనెల 18న ఖమ్మంలో జరిగే సిపిఐ జాతీయ శతాబ్ది వార్షికోత్సవాల ముగింపు ఉత్సవాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చరిత్రలో నిలిచిపోయేలా సీపీఐ శతాబ్ది ఉత్సవాలు 18న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమకాలిన రాజకీయ పరిస్థితులు, మతోన్మాద ప్రమాదం, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు తదితర విషయాలను నేటి తరానికి తెలియజేసి భవిష్యత్తు పోరాటాలకు కార్యోన్ముఖులను చేసేందుకు ఈ సభ దోహదపడుతుందన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న జరిగే సభ విజయవంతం చేయాలని కోరుతూ ఇప్పటికే జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. కరపత్రాలు, పోస్టర్లు, జీపు జాతాల ద్వారా ప్రచారం చేశామన్నారు. సమావేశంలో సిపిఐ నాయకులు అనిల్, ఫిరోజ్, అలీ ఇమ్రాన్, గంగాధర్, సురేష్, దేవేందర్, రమేష్, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటికి ఒక్కరు.. గ్రామానికి బండి

### సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి పిలుపు


**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ వంద వసంతాల భారీ బహిరంగ సభ విజయవంతానికి ఇంటికి ఒక్కరు.. గ్రామానికి బండి చొప్పున తరలిరావాలని పార్టీ శ్రేణులకు సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను పార్టీ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ సిపిఐ వంద సంవత్సరాల ప్రస్థానంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించిందని, దేశ స్వతంత్ర పోరాటంలో అగ్ర భాగంగా నిలిచిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం నడిపి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదే అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రధాన పాత్ర పోషించి అనేక ఉద్యమాలు నిర్వహించిన పార్టీ సిపిఐ అన్నారు. ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభకు జిల్లావ్యాప్తంగా పార్టీ సభ్యులు, సానుభూతిపరులు భారీగా హాజరై విజయవంతం చేయాలని యానాల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి.ఇమ్రాన్, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అన్నేమైన వెంకటేష్, వడ్లకొండ భారతమ్మ, భువనగిరి పట్టణ సహాయ కార్యదర్శి చింతల మల్లేష్, నాయకులు పల్లపు మల్లేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.




## ప్రతీ సమస్యనూ పరిష్కరించి పార్టీ ప్రతిష్ట పెంచాలి

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్

### సిపిఐ తరపున గెలిచిన సర్పంచ్‌లకు ఘనసన్మానం



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** గ్రామాలలో నెలకొన్న మౌలిక వసతులపై అధ్యయనం చేసి ప్రతి సమస్యను పరిష్కరించి పార్టీ ప్రతిష్టను పెంచాలని సిపిఐ తరుపున గెలిచిన సర్పంచ్‌లను పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో గానుగబండ, రంగాపురం గ్రామాలలో సిపిఐ అభ్యర్థులుగా గెలిచిన సర్పంచులు కడియాల పద్మ, కట్ట కళ్యాణిలను, అలాగే వార్డుమెంబర్లను సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతికి తావులేని విధంగా నీతిగా, నిజాయితీగా పనిచేసి, ప్రజల మన్ననలు పొందాలని నూతనంగా ఎన్నికైన సర్పంచులను కోరారు. జిల్లాలో సిపిఐ పోటీ చేసిన 8 సర్పంచ్ స్థానాల్లో ఆరింటిని గెలుచుకోవడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు, పోకల వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, త్రిపురం సుధాకర్ రెడ్డి, యడ్ల అంజిరెడ్డి, వేశాల ఆంజనేయులు, పోకల ఆంజనేయులు, చింతలచెర్వు పుల్లయ్య, సైదులు, పంగ గోవింద్, ఈశ్వరచారి, నబీసాహెబ్, పీర్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి చట్టాన్ని పునరుద్ధరించాలి

### బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల

**ప్రజాపక్షం/వరంగల్ :** కేంద్రప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించి డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం వీబీ జీ రామ్ జీ (గ్రామీణ) చట్టంతో కేంద్రం నిధులు 90 శాతం నుండి 60 శాతం తగ్గుతాయని, రాష్ట్రం నిధులు 10 శాతం నుండి 40 శాతానికి పెరుగుతాయని, దీంతో రాష్ట్రాలపై పెనుభారం పడుతుందన్నారు. పేదలు ఎప్పుడు కోరిన పని కల్పించాలనే హక్కు పోతుందని, గ్రామ సభలకు ఉన్న పూర్తి హక్కులు రద్దు అయి, కేంద్రప్రభుత్వం నోటిఫై చేసిన ప్రాంతాల్లోనే పనులు చేయాల్సి ఉంటుందని, దీనితో ఉపాధి కూలీలకు, చిన్న,సన్నకారు రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. కొత్త చట్టం రద్దుచేసి పాత చట్టాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ హామీలైన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, మహిళలకు నెలకు రూ.2500, ఆసరా పింఛన్లు రూ.4 వేలకు పెంచి ఇవ్వాలని, పేదలకు ఇంటిస్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి అక్కపల్లి రమేష్, అధ్యక్షురాలు సిలువేరు విజయ, గడ్డం సంతోష్, చిలువేరు రవి, అంకూస్, పాలకుర్తి సారమ్మ, ఇస్లావత్ పూలమ్మ, ఎండి పర్వీన్, వినోద్, స్వరూప, ఉపేంద్ర, అంకూస్, స్రవంతి పాల్గొన్నారు.



## పేద ప్రజలకు సిపిఐ తప్ప మరెవరూ న్యాయం చేయలేరు

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి




**ప్రజాపక్షం/శాయంపేట :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 100 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా ఖమ్మం పట్టణ కేంద్రంలో జనవరి 18న 5 లక్షల మందితో జరిగే భారీ బహిరంగ సభకు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి పిలుపునిచ్చారు. శుక్రవారం శాయంపేట మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభ గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి మాట్లాడుతూ పేద ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ తప్ప మరెవరు న్యాయం చేయలేరని, భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) పుట్టి 100 సంవత్సరాల చరిత్రలో పేద ప్రజలకు అండగా నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమిస్తుందని తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా పేదల సమస్యలు, ముఖ్యంగా ఇండ్లు ఇండ్ల స్థలాలు, సాగు భూములు, రైతులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నడుపుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్ ఎ స్టాలిన్, మండల కార్యదర్శి బత్తిని సదానందం, మండల సహాయ కార్యదర్శి అనుకారి అశోక్, నాయకులు ఎండీ అంకుషావలి, వల్లాల రమేష్, బండారి సాంబయ్య, ముంద్రాతి రమేష్, బోగి రమేష్, బల్ల అనిల్, దైనంపల్లి సమ్మయ్య, తీగలా కల్పనా, వైద్యుల రమా, బొంకురి కోమల, గొట్టుముక్కల శాంత, చిలువేరు సంధ్య, నిమ్మల సరోజన, లక్ష్మి పాల్గొన్నారు.

## నిజాలు నిర్భయంగా రాసే దినపత్రిక 'ప్రజాపక్షం': తహసీల్దార్



**ప్రజాపక్షం/రాయపర్తి:** నిజాలు నిర్భయంగా రాయడంలో ప్రజాపక్షం దినపత్రిక ఎప్పుడు ముందుంటుందని తహసీల్దారు ముల్కనూరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో ప్రజాపక్షం 2026 నూతన క్యాలెండర్‌ను రిపోర్టర్ గా గారే సందీప్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దారు శ్రీనివాస్ మాట్లాడుతూ పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండాలని అన్నారు. ప్రజా సమస్యలను వెలికితీయడంలో ప్రజాపక్షం దినపత్రిక ముందు వరుసలో ఉంటుందని అన్నారు. భవిష్యత్తులో మంచి మంచి కథనాలను అందించాలని కోరారు. ప్రజాపక్షం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించడం సంతోషంగా ఉందని అన్నారు.

**ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ**

ప్రజాపక్షం 2026 నూతన క్యాలెండర్ రాయపర్తి గ్రామ సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి రిపోర్టర్ గారే సందీప్‌తో కలిసి మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేంద్ర బిక్షపతి మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణంలో పత్రికల పాత్ర అద్వితీయమైందని అన్నారు. ప్రజల ఆదరాభిమానాలతో ప్రజాపక్షం దినపత్రిక మరింత ముందుకు పోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొమ్మెర కళ్యాణ్, గారే శ్రీనివాస్, గారే వెంకన్న, ఐత జంపి, తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజాపక్షం' క్యాలెండర్ అవిష్కరించిన ఎస్ఐ



**ప్రజాపక్షం/టేకుమట్ల :** మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌లో ప్రజాపక్షం దినపత్రిక 2026 నూతన క్యాలెండర్‌ను ఎస్సై దాసరి సుధాకర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకం అని అన్నారు. ప్రజజా సమస్యలపై నిర్విరామంగా ప్రజాపక్షం దినపత్రిక పోరటం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య,కానిస్టేబుల్స్,ప్రజాపక్షం రిపోర్టర్ బొంగోని నరేష్,రిపోర్టర్లు బొంగగోని తిరుపతి,అంబుల కుమారస్వామి,కన్నూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై పోరాడేది ప్రజాపక్షం

**ప్రజాపక్షం/జఫర్‌గఢ్:** ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడేది ప్రజాపక్షమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లయ్య అన్నారు.శుక్రవారం ప్రజాపక్షం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఘనంగా ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటూ ప్రజాపక్షం పత్రిక ప్రజల గొంతుకను వినిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం విలేఖరి శ్రావణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు మామిడాల మధుబాబు, రాజు, రవి, రమేష్, మల్లేష్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపేటను అభివృద్ధి చేసింది కాంగ్రెస్ పార్టీనే: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం /నర్సంపేట :** నర్సంపేట ను అభివృద్ధి చేసింది కాంగ్రెస్ పార్టీనే నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశం స్థానిక ఫంక్షన్ హాల్ లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దొంతి మాధవరెడ్డి జీవోలు తేవడమే కాదు అభివృద్ధి సైతం చేస్తున్నాం, బూటకపు మాటలతో రాష్ట్రాన్ని, నర్సంపేట నియోజకవర్గాన్ని అభాసు పాలు బిఆర్ఎస్ పార్టీ చేసిందన్నారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో 30 స్థానాల్లో విజయం కాంగ్రెస్‌దేనని, నర్సంపేట మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేయడంతో పాటు పట్టణంలోని అభివృద్ధి పనులను చేస్తున్నామని,డ్రైనేజీ సిసి రోడ్ల నిర్మాణానికి 8 కోట్ల రూపాయలు, అభివృద్ధి పనులు చేస్తున్నామని జీవోలు టెండర్లు సైతం పూర్తయి పనులు కొనసాగుతున్నాయని ఇది ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో తప్పుడు జీవోలు తెచ్చి ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టారు తప్ప ఏ ఒక్క పని చేయలేదని దుయ్యబట్టారు.ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు పెండెం రామానంద్, సోంటిరెడ్డి రాంజిత్ రెడ్డి నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ పాలాయి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్‌లు వేముల సాంబయ్య గౌడ్, విజయ్, నాయకులు చింతల సాంబరెడ్డి, ఎర్ర యాకుబ్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్గ రహిత వ్యవస్థ నిర్మాణమే
# కమ్యూనిస్టు లక్ష్యం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి




**ప్రజాపక్షం/ధర్మసాగర్:** సమాజ పరిణామ క్రమంలో ఆదిమ సమాజం బానిస సమాజం, భూస్వామ్య అర్థ భూస్వామ్య సమాజం అంతరించి పెట్టుబడిదారీ సమాజం ఏర్పడిందని, ఒక్క శాతంగా ఉండే పెట్టుబడిదారీ వర్గాన్ని 99 శాతం గా ఉండే కార్మిక వర్గం వర్గ చైతన్యంతో వర్గ పోరాటాలను ఉధృతం చేసి అంతిమ విజయం సాధించి వర్గ, వర్ణ, రాజ్య రహిత సమాజాన్ని నిర్మించుకుంటుందని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, హనుమకొండ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ తెలిపారు. శుక్రవారం ధర్మసాగర్ మండలం సోమదేవరపల్లి గ్రామంలో చిల్పూర్ ప్రభాకర్ అధ్యక్షతన సిపిఐ 100 సంవత్సరాల వార్షికోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నేదునూరి జ్యోతి హాజరై మాట్లాడుతూ సమాజ మార్పును పరిణామ క్రమాన్ని ఏ ఫాసిస్ట్ శక్తులు నిరోధించలేవని, ఉత్పత్తిలో భాగస్వాములు అయ్యే శ్రామిక వర్గం దోపిడీ పీడన వివక్షత నుండి విముక్తి కలిగించుకొనుటకు వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేస్తారని తెలిపారు. ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పోరాటాలు సమ సమాజ వ్యవస్థ నిర్మాణం కోసం అనివార్యం తెలిపారు. 10 సంవత్సరాలలో పార్లమెంటు సభ్యుల ఆదాయాలు, అధికార పార్టీ నేతల ఆదాయాలు అత్యధికంగా పెరిగాయంటే శ్రామిక వర్గ శ్రమశక్తిని దోచుకోవడం వల్లనే అని ధ్వజమెత్తారు.ప్రజల శ్రమ శక్తిని ఒకవైపు దోచుకుంటూ లాభం పేరుతో దాచుకుంటూ, పోరాటాలను రాజ్య హింసతో అనుచివేయాలని చూస్తున్నారని వేదన వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను పోరాడే తిప్పి కొట్టినట్లే పెట్టుబడిదారి పారిశ్రామిక వర్గానికి దోచిపెట్టే నూతన పారిశ్రామిక విధానాలపై ప్రజలు తిరుగుబడాలని పిలుపునిచ్చారు. ఈనెల 18న ఖమ్మంలో జరుగు గొప్ప బహిరంగ సభను అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మునిగాల బిక్షపతి, ధర్మసాగర్ మండల కార్యదర్శి కొట్టే వెంకటేష్, బీసీ హక్కుల సాధన సమితి నాయకులు నేదునూరి రాజమౌళి, తుప్పేటి వెంకటస్వామి, బోనగిరి రాజు, ప్రవీణ్ కుమార్ , వెంకటేష్, నాగరాజు, భవాని తదితరులు పాల్గొన్నారు.

## పేద వర్గాల సంక్షేమానికి
# కాంగ్రెస్ పెద్ద పీట

సంక్షేమ పథకాల కోసం ఎవరికీ డబ్బులివ్వొద్దు: కడియం

**ప్రజాపక్షం/జనగామ:** పేద వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గం చిల్పూర్ మండలంలోని వరలక్ష్మి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 76 మందికి కళ్యాణలక్ష్మి పథకం ద్వారా 76లక్షల 8వేల 816 రూపాయల చెక్కులు, ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 22 మందికి 8లక్షల 89వేల రూపాయలు చెక్కులు అందజేశారు. అనంతరం కడియం శ్రీహరి మాట్లాడుతూ నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలలకు అవకాశం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. లబ్ధిదారులు ధరఖాస్తు చేసుకున్న మూడు నెలల్లో చెక్కులు అందజేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ నిలుస్తుందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, నిరుపేదలకు రేషన్‌కార్డులు, రైతులకు బరోసా ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. స్టేషన్‌ఘనపూర్‌లో తాను ఎమ్మెల్యేగా ఉన్న రోజులు అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. త్వరలోనూ చిల్పూర్ మండల కేంద్రంలో మండల కార్యాయాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొట్లపల్లి శ్రీధర్‌రావు, తహశీల్దార్, ఎండిపిఓ, సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## జిటిఏ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంపి కావ్య



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ (జిటిఏ) ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆవిష్కరించారు.ఈ మేరకు హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో జీటీఏ నాయకులు ఎంపీ డా.కడియం కావ్యను మర్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణంలో కీలకమని, వారి కృషి వల్లే విద్యార్థులు ఉత్తమ భవిష్యత్తును సాధిస్తున్నారని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఈ కార్యక్రమంలో జీటీఏ వరంగల్ జిల్లా అధ్యక్షులు ప్రకాష్ గౌడ్, నరేంద్రస్వామి, బుచ్చిరెడ్డి, శ్రీకాంత్, ఆకోజు కిరణ్, బిల్లా కోటేశ్వరరావు, గంగాధర్, రఘు, వెంకటేశ్వర్లు, భారత అశోక్, చక్రపాణి పాల్గొన్నారు.

## సిపిఐ వందేళ్ల ఉత్సవాల గోడపత్రికల ఆవిష్కరణ

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, 'ఆత్మ' కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** ఈ నెల18న ఖమ్మం లో సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. డోర్నకల్ మున్సిపల్ కేంద్రంలో సిపిఐ వందేళ్ల ఉత్సవాల గోడపత్రికలను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనిజులా సార్వభౌమత్వాన్ని మంట కలిపి అమెరికా ప్రపంచ పోలీస్ గా పలు దేశాలపై ఏకపక్షంగా దాడులు నిర్వహిస్తూ అక్కడ ఉన్న సహజ వనరులు కొల్లగొట్టే విధంగా ప్రపంచాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్న ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండించాలని అన్నారు. దేశ స్వాతంత్ర ఉద్యమంలో సంపూర్ణ స్వాతంత్రం కావాలని నిర్ణయించిన మొదటి పార్టీ సిపిఐ అని స్వాతంత్రానంతరం అన్ని వర్గాల ప్రజల హక్కుల కోసం సమరశీల ఉద్యమాలు నిర్వహించి అధికారం లేకున్నా వందేళ్లు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ సిపిఐ గర్వంగా తెలిపారు. ఈనెల 18న ఖమ్మం పట్టణంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపున ఎర్ర దండు కవాతు, భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి సిపిఐ జాతీయ కార్యదర్శి డి రాజా, వివిధ దేశాల సౌహార్ధ ప్రతి నిధులుపలు రాష్ట్రాల నాయకులు పాల్గొంటున్నారని పెద్ద సంఖ్యలో ప్రజలు పార్టీలక తీతంగా హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరి నాగేశ్వరరావు, కౌన్సిల్ సభ్యులు కె ప్రబేస్, మండల కార్యదర్శి,తురక రమేష్ , జన్ను స్వామి, పాపారావు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌ను సందర్శించిన హిమాచల్ ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి

**ప్రజాపక్షం/ములుగు :** ములుగు జిల్లాలోని పీఎం శ్రీ మోడల్ స్కూల్, బండారుపల్లి ని ఈరోజు హిమాచల్ ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి రోహిత్ ఠాకూర్, ఆ రాష్ట్ర విద్యా శాఖ సెక్రెటరీ రాజేష్ శర్మ, రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆశిష్ కోహ్లీ, డైరెక్టర్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డాక్టర్ అమర్జీత్ శర్మ మరియు ఇతర ఉన్నతాధికార బృందం సందర్శించారు.తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖలో అమలు జరుగుచున్న వివిధ పథకాల అమలు తీరుని అడిగి తెలుసుకున్నారు. పీఎం శ్రీ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ నుండి పాఠశాలకు అందుతున్న వివిధ ప్రోత్సాహకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరుపున విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి, జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీ.సంపత్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్దార్థ్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు అర్షం రాజు, శ్యామ్ సుందర్ రెడ్డి, జి. సాంబయ్య, సైకం శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ సింగారం దేవకి అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన ఆలయ నిర్మాణ పనులు

ఈనెల ఆఖరి లోగా మిగిలిపోయి పనులు పూర్తి చేయాలి
ఫిబ్రవరిలో కొడవటంచకు రానున్న సిఎం రేవంత్ రెడ్డి
ఎమ్మెల్యే గండ్ర సత్యానారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి/రేగొండ:** రాష్ట్రంలో రెండవ యాదాద్రిగా పేరుగాంచిన శ్రీ కొడవటంచ లక్ష్మణ నరసింహ స్వామి ఆలయ నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండలం కొడవటంచ గ్రామంలో శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, రెవెన్యూ, దేవాదాయ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి, ఇరిగేషన్, పోలీస్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్తు శాఖల అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు బాలాలయంలో స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న పనులను కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వచ్చే ఫిబ్రవరి నెలలో కొడవటంచ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ పునఃప్రతిష్టాపన మహోత్సవంనకు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి రానున్నట్లు తెలిపారు. ఆలయంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఈ నెల 12వ గా అందజేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అదేవిధంగా, ఇప్పటికే చేపట్టిన పనులకు సంబంధించిన ఎంబి రికార్డులను ఈనెల 19వ తేదీలోగా పూర్తి చేయాలని దేవాదాయ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టిన అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్చూర్ నాయక్, పిఆర్ ఎస్ఈ చక్రవర్తి, దేవాదాయశాఖ ఈఈ దుర్గ ప్రసాద్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈఈ శ్వేత, ఆర్‌అండ్‌బి ఈఈ రమేష్, ఇరిగేషన్ ఈఈ బసవ ప్రసాద్, ఆర్డిఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఎప్డిఓ అప్పలకొండ, శ్వేతా, దేవస్థానం మహేష్ పాల్గొన్నారు.

## 'పోష్' చట్టాన్ని అందరు తెలుసుకోవాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ:** ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించడానికి పోష్ చట్టం ఎంతగానో దోహద పడుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ అన్నారు. ప్రతి ప్రదేవాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం 2013 పై మహిళా ఉద్యోగులకు జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమం నిర్వయించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధ నివారణ, పరిష్కారాల కోసం రూపొందించిన పోష్ చట్టాన్ని అందరు తెలుసుకోవాలని సూచించారు. మహిళ సంక్షేమం కోసం ఈ చట్టం తీసుకురావడం జరిగిందని, జిల్లాలో అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేసి అందరికి తెలిసే విధఃగా విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. మహిళలకు తాము పనిచేసే ప్రదేశాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఈ కమిటీలను సంప్రదించవచ్చునానరు. ఈ కార్యక్రమంలో డిపిపి రాజమహేంద్రనాయక్, ఏసిపి పండరి చేతన్, ఇంఛార్జీ డిడబ్ల్యూ కోదండరాములు డిఆర్‌డిఓ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**గర్భస్థ లింగ నిర్ధారణ నేరం**

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పిసి, పిఎన్‌డిటి చట్టం 1944పై జిల్లా స్థాయి అధికారుల సమావేశం జరిగింది. కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ లింగ ఆధారిత గర్భస్థ శిశు లింగ నిర్ధారణను అరికట్టేందుకు చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాల పనితీరు, నమోదు స్థితి, తనిఖీలు, రికార్డుల నిర్వహణ చట్ట ఉల్లంగనలపై తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఈ సమావేశంలో డిసిపి రాజమహేంద్ర నాయక్, డిఎంహెచ్ఓ మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల యూనియన్ పాత్ర అభినందనీయం

కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ఖిలావరంగల్:** సమాజాన్ని చైతన్య పరచడంలో(టిఎస్‌జెయూ) తెలంగాణ స్టేట్ జర్నలిస్టుల యూనియన్ పాత్ర అభినందనీయమని అదర్శనీయమని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం టిఎస్‌జెయూ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగోని ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా కమిటీ అధ్యక్షులు కందికొండ మోహన్, ఉపాధ్యక్షులు ఈద శ్రీనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా వరంగల్ చౌరస్తా నుండి పోచమ్మ మైదాన్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రత్యేక ఆహ్వానితులుగా, వరంగల్ డిటిఓ శోభన్, ట్రాఫిక్ సిఐ సుజాత, జాతీయ యువజన అవార్డు గ్రహీత సామాజికవేత్త మండల పరశురాములు, వరంగల్ ఎంఆర్ఓ శ్రీకాంత్, ఎన్‌సిపి కెప్టెన్ సతీష్, ఎక్స్ కెప్టెన్ పారిజాతం, ఎల్‌టికె స్వప్న, ప్రిన్సిపల్ ఏ సంపత్, ఇంతేజార్‌గంజ్ సిఐ షుక్రు, మట్టెవాడ సిఐ కరుణాకర్ రావు, ఎస్ఐ సందీప్, వెంకటేశ్వర్లు, రవికిరణ్, కుమార్, పాల్గొన్నారు.

## గుడుంబా కేసుల్లో పట్టుబడితే పిడి యాక్ట్ నమోదు : ఎక్సైజ్ సిఐ



**ప్రజాపక్షం/తొర్రూరు:** గుడుంబా కేసుల్లో పట్టుబడితే పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ బూస అశోక్ అన్నారు. గుడుంబా తయారీకి వినియోగించే నిషేధిత నల్లబెల్లం అక్రమంగా తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్న సంఘటన పెద్దవంగర మండలంలోని అవుతాపురం గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. ఎక్సైజ్ సీఐ బూస అశోక్ తెలిపిన వివరాల ప్రకారం పెద్దవంగర మండలంలోని అవుతాపురం శివారులో ఎక్సైజ్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. గ్రామ శివారులో ట్రాలీ వాహనాలు అనుమానాస్పదంగా కనిపించగా ఆపి తనిఖీ చేయగా 48 సంచుల్లో రెండు టన్నుల నల్లబెల్లం, ఐదు సంచుల్లో 250కిలోల పటిక, పది లీటర్ల నాటు సారా లభ్యమైంది. రవాణాకు వినియోగించిన ట్రాలీ, రెండు ఫోన్లు సీజ్ చేశారు. నిందితులు గుగులోతు రాజేశ్, నునావత్ రాజేశ్‌లపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ అశోక్ మాట్లాడుతూ సారా తయారీకి వినియోగించే బెల్లం, ఇతర ముడి పదార్థాల క్రయ విక్రయాలు, రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గుడుంబా కేసుల్లో పట్టుబడితే పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ ఎన్.శంకర్, సిబ్బంది శ్రీనివాస్, ఈశ్వర్, శశివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

ప్రజాపక్షం/మహాదేవపూర్;మండలంలోని బెగ్లూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు,సంక్రాంతి ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## కొత్తగూడెం నియోజకవర్గంలో సంక్షేమ సంబరం

రూ. 22.20 కోట్ల సంక్షేమ పథకాల చెక్కుల పంపిణీ

అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యత

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** పేదవర్గాలకు మునుపెన్నడూ లేనివిధంగా పెద్దమొత్తంలో సంక్షేమ పథకాల డబ్బులు మంజూరు కావడంతో కొత్తగూడెం నియోజకవర్గంలో సంక్షేమ సంబురం నెలకొంది. 201 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంలో మంజూరైన రూ.2012 కోట్ల విలువైన చెక్కులు, అదేవిధంగా సిఎం రిలీఫ్ ఫండ్ పథకంలో 50 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.20.70లక్షల విలువైన చెక్కులను కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు, ప్రజా సంక్షేమ పథకాల అమలుకు సమ ప్రధాన్యతను ఇస్తున్నామని, పార్టీలకు అతీతంగా ప్రతీ పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందజేస్తున్నామని అన్నారు. పేద కుటుంబాల ఆర్థికభారాన్ని తీర్చేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేయటం అభినందనీయమని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరవేయటమే తన బాధ్యత అని, ముఖ్యంగా ఆడబిడ్డల పెండ్లిండ్లకు కళ్యాణలక్ష్మి పథకం ఆర్థిక భరోసా ఇస్తుండగా, ఆపద సమయంలో వైద్య ఖర్చుల కోసం సిఎం రిలీఫ్ పండ్ అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శౌరభ్‌శర్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్‌కే. సాబీర్‌పాషా, డిప్యూటీ కలెక్టర్ పానెం క్రిష్ణ, తహశీల్దార్‌లు వనం క్రిష్ణ ప్రసాద్, దారా ప్రసాద్, సర్పంచ్‌లు, మాజీ మున్సిపల్ వార్డు కౌన్సిలర్‌లు, ఎంపిటిసీలు తదితరులు పాల్గొన్నారు.

## సీతారావమ్మను పరామర్శించిన బాగం



**ప్రజాపక్షం/చింతకాని :** రాఘవాపురం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకురాలు కొల్లి సీతారావమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటివద్ద చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు శుక్రవారం సీతారావమ్మనివాసానికి వెళ్ళి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటంబ సభ్యులను ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, మండల సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, నాయకులు దొబ్బల వెంగళరావు, కొల్లి రవికుమార్, కొల్లి బాబు, వెంకటేశ్వర్లు, మల్లేష్ తదితరులు ఉన్నారు.



## కమీషన్లకు కక్కుర్తిపడి కమల్‌రాజు అసత్య ప్రచారం

**ప్రజాపక్షం/మధిర :** కమీషన్ల కోసం కక్కుర్తిపడి మధిర మున్సిపాల్టీని గ్రామస్థాయికి దిగజార్చిన లింగాల కమల్‌రాజు కల్లబొల్లి మాటలు మాట్లాడుతున్నాడని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మిరియాల రమణగుప్తా అన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల్లో మధిర మున్సిపాల్టీని గ్రామపంచాయతీకన్నా అధ్వానంగా తయారు చేసిన ఘనత బిఆర్ఎస్ పార్టీదేనని అన్నారు. మధిర మున్సిపాల్టీలో పది సంవత్సరాలు అధికారంలోకి ఉండి మధిర పట్టణానికి బిఆర్ఎస్ పార్టీ చేసిందని ఏమీ లేదని, చేయని పనులను కూడా చేశామని చెప్పి బిల్లులు చేసుకున్న ఘనత బిఆర్ఎస్ పార్టీదని విమర్శించారు. గతంలో ఎన్నడూలేనివిధంగా మధిర పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్న భట్టిపై ఉన్న అక్కుస్సుతోనే బిఆర్ఎస్ పార్టీ నాయకులు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ పార్టీ నాయకులు తమ అసత్య ప్రచారాలు మానుకుని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి సహకరించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు పాటిబండ్ల సత్యంబాబు, కోరంపల్లి చంటి, షేక్.జహంగీర్, తలుపుల వెంకటేశ్వర్లు, మాగం ప్రసాద్, షేక్.రబ్బాని, నాగబోయిన రామారావు, సువర్ణకంటి రామకృష్ణ, సాలిక సురేష్, కర్నాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## ప్రతీ అక్షరం ప్రజల పక్షాన నిలవాలి

'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరణలో టియుడబ్ల్యూజె (ఐజెయు)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాం నారాయణ, జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు

**ప్రజాపక్షం/కారేపల్లి :** ప్రజాపక్షం దినపత్రికలో వచ్చే ప్రతి అక్షరం ప్రజల పక్షాన నిలబడాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండాలని టియుడబ్ల్యూజె (ఐజెయు)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాం నారాయణ, జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు తాత శ్రీనివాసరావులు అన్నారు. శుక్రవారం సింగరేణి మండల కేంద్రంలో ప్రజాపక్షం క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు పతనమైపోతున్న ఈ రోజుల్లో ఆ విలువలను కాపాడే నిలువుటద్దంగా, అన్యాయాన్ని ప్రశ్నించే పత్రికగా ఈ ప్రజాపక్షం నిలవాలన్నారు. కొత్తపుంతలు తొక్కుతున్న మీడియా రంగంలో మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు చేసుకుంటూ ప్రజాపక్షం ప్రజల పత్రికగా పరిమిడిల్లాలనని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కారేపల్లి ప్రజాపక్షం విలేకరి రాము, టియూడబ్ల్యూ(ఐజేయూ) మండల అధ్యక్షులు ఏపూరి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కొత్తూరి శ్రీనివాసరావు, నాయకులు కొండపల్లి వెంకటేశ్వర్లు, బానోత్ బాలు, తెల్ల శ్రీనివాసరావు, గుగులోత్ కళ్యాణ్, సురేష్, నాగేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ చేసిన పనులు చెప్పకుంటూ పోతే..

# మరో పార్టీకి భవిష్యత్ ఉండదు

మధిర అభివృద్ధి చెందితేనే భవిష్యత్ తరాలకు మంచిది

మధిర పట్టణ అభివృద్ధి చేసిన వారినే గెలిపించుకోవాలి

డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క



**ప్రజాపక్షం/మధిర :** కాంగ్రెస్ పార్టీ చేసిన పనులు చెప్పుకుంటూ పోతే ఈ దేశంలో ఇంకో పార్టీ పుట్టేదే కాదు, మరోపార్టీకి భవిష్యత్ ఉండేది కాదని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. శుక్రవారం ఆయన మధిర మున్సిపాల్టీ పరిధిలోని మడుపల్లిలో కాంగ్రెస్ కీలక నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ ఇతర పార్టీలు రెండు మూడు దశాబ్ధాల క్రితం చేసిన ఐదులక్షల పనిని మైకు దొరికిన ప్రతిసారి చెప్పుకుంటూ పోతారు, కాని కాంగ్రెస్ శ్రేణులు ప్రచారం వెనుకంజలో ఉండటం మూలంగా ఇబ్బంది ఏర్పడుతుందని తెలిపారు. మధిర మున్సిపాల్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా మధిర నగరానికి వచ్చిన రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచితంగా ఆర్టిసి బస్సు ప్రయాణం వంటి పథకాలు ప్రతి నాయకుడు రోజు పదిమందికి వివరిస్తే చాలని సూచించారు. మధిర పట్టణం అభివృద్ధి చెందాలి క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంటేనే భవిష్యత్ తరాలు బాగుపడతాయని ఆలోచించే వ్యక్తులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మధిర పట్టణానికి కాంగ్రెస్ చేయని పని అంటూ లేదు అన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజి, అండర్ గ్రౌండ్ విద్యుత్, చెరువులను టూరిజం పార్కులుగా తీర్చిదిద్దడం, డిగ్రీ, ఇంటర్ హైస్కూల్ విద్యాసంస్థలకు సొంత భవనాలు, అగ్రికల్చర్ పాలిటెక్నిక్, జనరల్ పాలిటెక్నిక్, ఐటిఐ అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ మార్చడం, బస్టాండ్, ట్రెజరీ బ్యాంకులను తీసుకురావడం వంటి గొప్ప పనులు చేసామని మున్సిపాల్టీలోని ఓటర్లకు వివరించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ఒక మంచి ఇల్లు కట్టాలి అనుకున్నప్పుడు మొదట సిమెంట్, కంకర, ఇటుకలు ఎక్కడిపడితే అక్కడ ఉంటాయి చిందరవందరగా కన్పిస్తుందని కాని ఇల్లు పూర్తయిన తర్వాత అందంగా కన్పిస్తుందని అదే తరహాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనుల ప్రస్తుతం జరుగుతున్నాయని, అది పూర్తయితే నగరం సుందరంగా మారుతుందని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు పూర్తయిన చోట మట్టిని పూడ్చాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు పూర్తయిన తర్వాత మధిర పట్టణంలో మొత్తంగా కొత్త సిసి రోడ్ల నిర్మాణం జరుగుతుందని వివరించారు. మధిర మున్సిపాల్టీలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుని అభివృద్ధి పనులు చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అభివృద్ధి పనులు జరిగేతే మధిర పట్టణం అభివృద్ధి చెందుతుందని, తద్వారా భవిష్యత్ తరాలకు మంచి జరుగుతుందని వివరించారు. ఈసమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మిరియాల రమణగుప్తా, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సై అంటున్న సంతోష్

వైరా మున్సిపాలిటీ ఎన్నికల బరిలోకి

పార్టీ నిర్ణయమే శిరోధార్యం

అంటున్న సంతోష్

**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఆదేశిస్తే కట్ల సంతోష్ పోటీకి సై అంటున్నాడు. కాంగ్రెస్ పార్టీలో చురుకైన నాయకుడిగా యువకుడిగా ఉంటూ పార్టీ అడుగుజాడలోనే పార్టీ నిర్ణయం శిరోధార్యం అనే విధంగా ఉన్న కట్ల సంతోష్, వైరా మున్సిపాలిటీ ఎన్నికల్లో బరిలో నిలవనున్నాడు. పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావుకు తమ్ముడు అయిన కట్ల సంతోష్ కుటుంబం కాంగ్రెస్ కుటుంబం, పొంగులేటి సుధాకర్‌రెడ్డితో కాంగ్రెస్ పార్టీలో కట్ల రంగారావు సారధ్యంలో గత కొన్ని సంవత్సరాలుగా పార్టీలోనే ఉన్నారు. పొంగులేటి సుధాకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వదిలి బిజెపిలోకి వెళ్లినా కాని కట్ల కుటుంబం కాగ్రెస్‌లోనే ఉంది. పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ఎన్నో ఒడిదుడుగులు ఎదుర్కొన్న కట్ల కుటుంబం కాంగ్రెస్ పార్టీని మాత్రం వదలలేదు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రజా సంక్షేమ పాలన ప్రజలను మెచ్చుకుంటుంది. ఇన్ని సంవత్సరాలు పార్టీ కోసం పనిచేసిన కట్ల సంతోష్, మున్సిపాల్ ఎన్నికల బరిలో నిలవనున్నారు. పార్టీ ఆదేశిస్తే పోటీకి సై అంటున్నాడు సంతోష్, అయితే అధిష్టానం నిర్ణయమే మాకు శిరోధార్యమని కట్ల కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు.

## సభా స్థలిని పరిశీలించిన సిపిఐ నాయకులు

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల ముగింపు సందర్భంగా ఈనెల 18న బహిరంగ సభ జరగనున్న ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానాన్ని శుక్రవారం సిపిఐ నేతలు పరిశీలించారు. సభా వేదిక, కళాకారుల వేదిక నిర్మాణ ప్రాంతాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. కళాశాల మైదానం మొత్తం పరిశీలించి వాలంటీర్లకు తగు బాధ్యతలు అప్పగించారు. సభా స్థలికి హాజరయ్యే నాయకులు, కార్యకర్తలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా రాకపోకలకు అంతరాయం కలుగకుండా భారీకేడ్లను ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా సిపిఐ నాయకులు తెలిపారు. సభాస్థలిని పరిశీలించిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, బిజి క్లైమెంట్, మేకల శ్రీనివాసరావు, పోటు పూర్ణ, చింతల రమేష్, నంబూరి శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## 12న నూరేళ్ల అరుణ కేతనం ఆవిష్కరణ

-అతిథిగా హాజరుకానున్న సుద్దాల అశోక్‌తేజ, కూనంనేని




**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు శత వసంత ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ప్రత్యేక కవితా సంచిక నూరేళ్ల అరుణ కేతనంను ఈనెల 12న ఆవిష్కరించనున్నట్లు కమిటీ బాధ్యులు లెనిన్ శ్రీనివాస్ తెలిపారు. కవితా సంచిక ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా ప్రముఖ అభ్యుదయ, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు హాజరుకానున్నారని లెనిన్ శ్రీనివాస్ తెలిపారు. కవితా సంచిక ఆవిష్కరణకు సంబంధించి శుక్రవారం ఏఐటియుసి కార్యాలయంలో శింగు నర్సింహారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో లెనిన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని అభ్యుదయ రచయితల నుంచి రచనలను ఆహ్వానించామని వంద మంది కవులు తమ రచనలను పంపించారని పరిశీలన అనంతరం వాటిని అరుణ కేతనంలో ముద్రించడం జరిగిందన్నారు. 12న ఉదయం 10 గంటలకు ఖమ్మం డిపిఆర్‌సి భవనంలో కవి సమ్మేళనం జరుగుతుందని సమ్మేళనంలో పుస్తకావిష్కరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నవచేతన విజ్ఞాన సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఖమ్మం జిల్లాకు చెందిన కవులు మువ్వా శ్రీనివాసరావు, రౌతు రవి, కొంపల్లి రామయ్య, రవి మారుత్, ప్రసేన్, సీతారామ్, ఐవి రమణారావు తదితరుల పాల్గొంటారని లెనిన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, ఐజెయు జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, శింగు నర్సింహారావు, సిహెచ్ సీతా మహలక్ష్మి పాల్గొన్నారు.

## పాల్వంచ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తోడ్పాటు



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలకు సెమినార్‌లు నిర్వహించడానికి అనుమతులు రావటం అభినందనీయమని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. కళాశాలలో నిర్వహించనున్ననేషనల్ లెవల్ మ్యాథమెటిక్స్, కామర్స్ సెమినార్, కంప్యూటర్ సైన్స్ సింపోజియంలకు చెందిన బ్రోచర్లను ఆయన శుక్రవారం కొత్తగూడెం ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పాల్వంచ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని అన్నారు. మ్యాథమెటిక్స్ సెమినార్ ఫిబ్రవరి 4, 5 తేదీలలో నేషనల్ లెవల్ కామర్స్ సెమినార్ మార్చి 9వ, తేదీ నుండి 10 వరకునేషనల్ లెవల్ కంప్యూటర్ సైన్స్ సింపోజియం ఫిబ్రవరి 12, 12 తేదీలలో నిర్వహించనున్నారని అన్నారు. విద్యాసంస్థల నుండి అకాడమిషియన్‌లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని సెమినార్‌లను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, కళాశాల ప్రిన్సిపాల్ పి. పద్మ, నేషనల్ సెమినార్‌మ్యాథమెటిక్స్ కన్వీనర్ పొట్లపవ్వు శ్రీనివాస్, కామర్స్ సెమినార్ కన్వీనర్ పారెల్లి శ్రీనివాస్, కంప్యూటర్ సింపోషియం కన్వీనర్ కోటగిరి రాంబాబు, డి. రమేష్, వేముల కామేశ్వరరావు, దీపిక కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ముగ్గుల పోటీలు :** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంస్కృతి, సాంప్రదాయాలు, విలువలు ఉట్టిపడేలా రంగురంగులతో అందమైన ముగ్గులు వేశారు. దీనితో కళాశాలలో పండగ వాతావరణం కలిగింది. విజేతలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడుతూ ముగ్గుల పోటీలు విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను వెలికితీస్తాయన్నారు. దీనితో సృజనాత్మకత, భారతీయ సంస్కృతిపై విద్యార్థులకు మరింత అవగాహన కలిగిందన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కళాశాల అధ్యాపకులు విమల, హారికలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అరుణకుమారి, శెట్టి స్వరూపరాణి, ఎన్. శ్రీదేవి, నియాజ్ ఫర్వీన్, దీపిక, వకులా, లీల, సౌమ్య, తేజస్విని, విద్యార్థులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు సంక్రాంతి పండుగ సంబరాలు

**ప్రజాపక్షం/అశ్వాపురం :** అశ్వాపురంలోని ఎమిలీ పబ్లిక్ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కరస్పాండెంట్ ములకలపల్లి గోపీనాథ్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టతను గురించి వివరిస్తూ ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతులు, వ్యవసాయదారుల కుటుంబంలో సంతోషించే కాలం ఈ సంక్రాంతి పండుగ సమయం అని, పెద్దల నుండి సాంప్రదాయకంగా వస్తున్న ఈ పండుగలను ప్రత్యేకంగా జరుపుకోవాలని, పూర్వ వైభవాలను తలపించే విధంగా ప్రతి కుటుంబంలో చేసుకోవాలని సాంప్రదాయాలను మరవద్దని, ప్రతి కుటుంబం పాడిపంటలతో, సుఖ సంతోషాలతో వర్ధిలాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయురాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత

పెట్రోల్ బంక్ నిర్వాహకులకు అవగాహన

అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రోడ్డు ప్రమాదాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోడ్డు భద్రతా ప్రమాణాలపై శుక్రవారం పెట్రోల్ బంక్ నిర్వాహకులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల ఒక వ్యక్తి దురదృష్టవశాత్తు మరణించినా, వైకల్యం పొందినా ఒక కుటుంబం దెబ్బ తింటుందనాన్నరు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నియంత్రించడంలో తమ వంతు బాధ్యత నిర్వర్తించాలన్నారు. పెట్రోల్ బంక్ ఎంట్రీ, ఎగ్జిట్‌కు కొద్ది దూరం నుంచి కర్వ్ ఉంటూ ప్రధాన రోడ్డు కలిపేవిధంగా అవసరమైన మార్పులు చేసుకోవాలని పెట్రోల్ బంక్ డీలర్లకు సూచించారు. పెట్రోల్ బంక్ ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లకు దూరంలో ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పెట్రోల్ బంక్‌కు ఇరువైపులా 100 మీటర్ల దూరంలో రోడ్లపై బ్లింకర్స్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. పెట్రోల్ బంక్‌లో పనిచేసే సిబ్బంది యూనిఫాం ద్వారా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించడంపై ప్రచారం కల్పించాలన్నారు. పెట్రోల్ బంకుల్లో ఫస్ట్‌ఎయిడ్ కిట్ తప్పనిసరిగా ఉండాలని, సిబ్బందికి సిపిఆర్ ట్రైనింగ్ అందించాలని దానికి అవసరమైన కార్యాచరణ తయారు చేయాలని తెలిపారు. జిల్లాలో అధికంగా ప్రమాదాలు జరుగుతున్న 50 రోడ్లను గుర్తించి అక్కడ మున్సిపల్, ఆర్అండ్‌బి, నేషనల్ హైవే, రెవెన్యూ, రవాణా శాఖ సంయుక్తంగా పరిశీలించి ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టివో డి. జగదీష్, డిఎల్ఎంవో ప్రవీణ్‌కుమార్, ఆర్ అండ్‌బి డిఈ జి. రాధిక, పౌర సరఫరాల శాఖ కార్యాలయ సిబ్బంది, వివిధ పెట్రోల్ బంక్ నిర్వాహకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వణికిస్తున్న చలి..!

ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు



**ప్రజాపక్షం/జూలూరుపాడు :** జిల్లా వ్యాప్తంగా చలి పులి చంపేస్తోంది. రాగల రోజుల్లో చలి మరింత దారుణంగా ఉంటుందని హెచ్చరికలు జారీ చేసింది వాతావరణ శాఖ. రోజురోజుకీ పెరుగుతున్న చలి తీవ్ర తకి వృద్ధులు, చిన్న పిల్లలు అధికంగా అనా రోగ్యానికి గురవుతున్నారు. చలి అంటే అందరికీ సహజసిద్ధమైన ఋతువు. కానీ చల్లని గాలులు, ఉదయాన్నే కమ్మేసే పొగమంచు, రాత్రివేళల్లో చలికాలం తెచ్చే పణుకు ఇవన్నీ శరీరానికి కొంత అసౌకర్యాన్ని కలిగిస్తాయి. సాధారణంగా చలికాలం ఆనందదాయక మైనదే అయినా, ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోకపోతే పులిలా దాడి చేసే ప్రమాదం ఉంటుంది. అందుకే ఈ సీజన్ను సరిగ్గా ఎదుర్కోవడం చాలా అవసరం. అయితే జూలూరుపాడు మండలం చుట్టూ అడవి ప్రాంతం కాబట్టి చుట్టుపక్కన పల్లెలో చలి తీవ్రత రోజురోజుకు విపరీతంగా పెరిగిపోతోంది. ప్రతిరోజు తెల్లవారుజామున పొగమంచు విపరీతంగా పడుతోంది. ఈ పొగమంచుకి వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.

ఈ చలి తీవ్రతకి మండలంలోని గ్రామాల ప్రజలు బయటికి రావడం లేదు. వృద్ధులు, చిన్నారులు. మాత్రం అనారోగ్యబారిన పడుతున్నారు.

**వృద్ధులు, చిన్నారులపై అధిక ప్రభావం...**

చలి తీవ్రత పెరగడంతో వృద్ధులు, చిన్న పిల్లలపైనే అధిక ప్రభావం పడే అవకాశాలు ఎక్కువగా ఉంది. వృద్ధులు, ఐదు సంవత్సరాల లోపు పిల్లలు చలి ప్రభావానికి ఎక్కువగా గురవుతారు. శరీర ఉష్ణోగ్రత త్వరగా తగ్గిపోవడం వల్ల వారిలో శ్వాస కోశ సమస్యలు, జలుబు, దగ్గు, దమ్ము వంటి వ్యాధులు తలెత్తే అవకాశం ఉంది. చలికాలంలో బిగులైన, వేడిగా ఉంచే దుస్తులు. ధరించడం తప్పనిసరి. చిన్నపిల్లల్లో గురక, ఎగశ్వాస, జలుబు, డబ్బు వంటి లక్షణాలు. ఉంటుంది. శ్వాస తీసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడతారు.

**శ్వాసకోశ వ్యాధుల వారికి హెచ్చరిక..**

అస్తమా, బ్రాంకైటిస్ వంటి శ్వాసకోళ సమస్యలతో బాధపడుతున్నవారు చల్లని వాతావరణంలో ఎక్కువసేపు ఉండకూడదు. బయటకు వెళ్లేటప్పుడు ముక్కు చెవులు, మీద కప్పుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి. గోరువెచ్చని నీటిని తరచూ త్రాగడం, పొడి వాతావరణంలో తేమను నిలుపుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. గోరువెచ్చని నీరు, వేడి ఆహారం తప్పనిసరిచలికాలంలో శరీరం వేడిని కోల్పోతుంది.

అందుకే వేడి పానీయాలు, సూపులు, గోరు వెచ్చని నీరు తాగడం శరీర రక్షణకు ఉపకరిస్తుంది. పండ్లు, కూరగాయలు ఎక్కు వగా తినడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుంద వైద్యులు తెలుపుతున్నారు.

టాలీవుడ్‌కు 'సంక్రాంతి' అంటే కేవలం పండుగ మాత్రమే కాదు బాక్సాఫీస్‌కు అసలైన పరీక్ష. కుటుంబ ప్రేక్షకులు పెద్ద ఎత్తున థియేటర్లకు వచ్చే ఈ సీజన్‌ను క్యాష్ చేసుకోవడానికి స్టార్ హీరోల సినిమాలు పోటీగా విడుదలవుతుంటాయి. భారీ బిజినెస్, గ్రాండ్ ప్రమోషన్స్, రికార్డు అంచనాలతో వచ్చే ఈ సినిమాలు సాధారణంగా వసూళ్ల పండుగ జరుపుతాయని భావిస్తారు.

# రీల్

మన శంకర వరప్రసాద్ గారు

## వర్కింగ్ స్టిల్స్





చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో నిర్మించిన మన శంకర వరప్రసాద్ గారు సినిమా వర్కింగ్ స్టిల్స్‌ను విడుదల చేశారు. చిరంజీవి, వెంకటేష్, నయనతార ఇలా అందరిలో పాల్గొన్నప్పుడు తీసిన వర్కింగ్ స్టైయిల్స్‌ను సోషల్ మీడియాలో పెట్టారు. దీంతో ఈ ఫోటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. షూటింగ్ జరుగుతున్న లొకేషన్లలో చిత్రీకరించిన స్టిల్స్ ఇవి. అన్ని పనులు పూర్తి చేసుకున్న మన శంకర వరప్రసాద్ సంక్రాంతి సందర్భంగా ఈనెల 12వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. భీమ్స్ సంగీతం అందించిన ఈ సినిమాను చిరంజీవి కుమార్తె సుస్మిత కొణిదెల, సాహు గారపాటి నిర్మించారు. ఇప్పటికే విడవలైన ఈ సినిమా పాటలను శ్రోతులను అలరిస్తున్నాయి. వెంకటేష్, చిరంజీవిపై చిత్రీకరించిన సంక్రాంతి మాస్ పాట కూడా హిట్ అయింది. తప్పకుండా ఈ చిత్రం ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని దర్శకుడు అనిల్ రావిపూడి ఆశాభావం వ్యక్తం చేశారు.



## 7 సినిమాల ట్రైలర్స్ విడుదల

20 ఏళ్ల వ్యవధిలో 114 పైగా చిత్రాలు నిర్మించి చరిత్ర సృష్టించిన ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ గతేడాది ఆగస్టు 15న ఒకేసారి 15 చిత్రాలు ప్రారంభించి... ప్రపంచ రికార్డ్ నెలకొల్పడం తెలిసిందే. ఇప్పుడు ఆ 15 చిత్రాల్లో 7 చిత్రాల షూటింగ్స్ పూర్తి చేసి, ఆ చిత్రాల ట్రైలర్స్ అన్నీ ఒకే రోజు ఒకే వేదికపై ఆవిష్కరించారు. భీమవరం టాకీస్ పతాకంపై నిర్మాణమవుతూ ట్రైలర్స్ విడుదల జరుపుకున్న ఆ ఏడు చిత్రాలు... ఉదయ్ భాస్కర్ దర్శకత్వంలో 'మహానాగ', రవి బాసర దర్శకత్వంలో 'యండమూరి కథలు', విజయ్ ఎర్రంశెట్టి దర్శకత్వంలో 'మా నాన్న హీరో', నూతన్ దర్శకత్వంలో 'రోబో47', 'మహాబలుడు', హర్ష దర్శకత్వంలో 'రుద్రతాండవం', సాయి రమేష్ దర్శకత్వంలో 'మనం 2036' చిత్రాల ట్రైలర్స్ విడుదల వేడుక అత్యంత ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్, ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన ఈ వేడుకలో సుమన్, సాయికుమార్, వి.విజయేంద్రప్రసాద్, కె.ఎస్.రామారావు, రేలంగి నరసింహారావు, యండమూరి వీరేంద్రనాథ్, జె.కె.భారవి, వీరశంకర్, చంద్రమహేష్, కె.ఎల్.దామోదర్ ప్రసాద్, టి.ప్రసన్నకుమార్, కె.అశోక్ కుమార్, కవిత, కల్వ సుజాత గుప్త, వి విజయ్ కుమార్ వంటి అతిరథమహారథులు అతిథులుగా పాల్గొని ఆయా చిత్ర బృందాలకు శుభాకాంక్షలు తెలిపారు. మొత్తం 15 చిత్రాలకు సంగీత సారథ్యం వహిస్తున్న సంగీత దర్శక ద్వయం డా.ఎ.జె.సంధ్యవర్షిణి డా.వి.ఆర్.ఎ.ప్రదీప్, ఈ చిత్రాలు అన్నిటికీ పబ్లిసిటీ బాధ్యతలు నిర్వహిస్తున్న క్రియేటివ్ హెడ్ తల్లాడ సాయికృష్ణలతో పాటు... 7 చిత్రాల దర్శకులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా సత్కరించారు. భీమవరం టాకీస్ పతాకంపై నిర్మాణం జరుపుకుంటున్న 15చిత్రాల నటీనటులు, సాంకేతిక నిపుణులు పెద్ద సంఖ్యలో పాలు పంచుకున్నారు.

## 'సైలెంట్ స్క్రీమ్స్' సన్ నెక్స్ట్‌లో స్ట్రీమింగ్

తెలంగాణలోని యథార్థ సంఘటనలపై ఆధారిత కేసులను వెలుగులోకి తీసుకొచ్చిన శక్తివంతమైన క్రైమ్ డాక్యుమెంటరీ మూవీ 'సైలెంట్ స్క్రీమ్స్'. మహిళలపై నేరాలు కేవలం సంఖ్యలుగా మారిపోతున్న కాలంలో, ఆ సంఖ్యల వెనుక ఉన్న మనుషుల కథలను చెప్పేందుకు సన్ నెక్స్ట్ తీసుకొచ్చింది 'సైలెంట్ స్క్రీమ్స్'. వరంగల్, ఆసిఫాబాద్, నల్గొండ జిల్లాల్లో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందిన ఈ క్రైమ్ డాక్యుమెంటరీ, నేరాల ప్రభావం ఎంత లోతుగా కుటుంబాలు, సమాజాలపై పడుతుందో హృదయాన్ని తాకే విధంగా ఆవిష్కరిస్తుంది.






## 'ఓం శాంతి శాంతి శాంతిః' థీమ్ సాంగ్ రిలీజ్

ట్యాలెంటెడ్ ఫిల్మ్ మేకర్స్ తరుణ్ భాస్కర్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఈషా రెబ్బా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఏ ఆర్ సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రం, సహజమైన హాస్యం, ఆకట్టుకునే డ్రామాతో కూడిన వినోదభరితమైన విలేజ్ కామెడీగా తెరకెక్కించారు. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బ్యానర్స్‌పై సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ సనివరపు ఈ వెంచర్ను నిర్మిస్తుండగా, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'ఓం శాంతి శాంతి శాంతిః' థీమ్ సాంగ్ రిలీజ్ చేశారు. ప్రతి మహిళకు అంకితంగా నిలిచే ఈ పాటని జయ్ కృష్ణ హార్ట్ టచ్చింగ్‌గా కంపోజ్ చేశారు.

## 'అనగనగా ఒక రాజు' చిత్రానికి యు/ఏ సర్టిఫికెట్

హీరో నవీన్ పొలిశెట్టి నటించిన తాజా చిత్రం 'అనగనగా ఒక రాజు'తో ఈ సంక్రాంతికి అలరించనున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తుండగా, శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయిక. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. ఈ నెల 14న థియేటర్లలో అడుగుపెట్టనున్న 'అనగనగా ఒక రాజు' చిత్రానికి యు/ఏ సర్టిఫికెట్ లభించింది. ఇటీవల ట్రైలర్‌ను కూడా ఆవిష్కరించారు. 'అనగనగా ఒక రాజు.. ఆ రాజుకి చాలా పెద్ద మనసు. ఆ మనసులోకి ధగధగా మెరిసిపోయే నగలు వేసుకొని యువరాణి దిగింది' అంటూ నాగార్జున వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ ఆసక్తికరంగా ప్రారంభమైంది.



## ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

'చిట్ చాట్'లో డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్

రవి తేజ హీరోగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ కథానాయికలుగా నటించిన ఈ సినిమా జనవరి 13న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్లు డింపుల్ హయతి, ఆషికా రంగనాథ్ మీడియాతో 'చిట్ చాట్' నిర్వహించారు. ఆషిక రంగనాథ్ మాట్లాడుతూ... డైరెక్టర్ కిషోర్ తిరుమలతో ముందు ఒక ప్రాజెక్ట్ చేయాలని అనుకున్నాం. కానీ కొన్ని కారణాల వలన ఇది కుదరలేదు. తర్వాత 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' కథ చెప్పారు. కథ విన్నప్పుడే ఇందులో మోడ్రన్ గర్ల్ పాత్ర చేయాలని అనుకున్నాను. ఆయన కూడా అదే పాత్రకి అనుకున్నానని చెప్పారు. నా సామిరంగతో పోల్చుకుంటే ఇది కంప్లీట్‌గా డిఫరెంట్ క్యారెక్టర్. ఖచ్చితంగా నా కెరీర్‌లో చాలా కొత్తగా వుంటుంది. ఇందులో నా పాత్ర పేరు మానస శెట్టి. ఇప్పుడున్న అమ్మాయిలు రిలేట్ అయ్యే క్యారెక్టర్. రవితేజ ఎనర్జీని మ్యాచ్ చేయడం చాలా కష్టం. అందులోనూ నాకు తెలుగు అంతగా రాదు. అయితే డైరెక్టర్ చాలా సపోర్ట్ చేశారు. ఆయన చాలా సెన్సిబుల్ డైరెక్టర్. మా పాత్రలని చాలా జాగ్రత్తగా డిజైన్ చేశారు. కాస్ట్యూమ్స్ విషయంలో కూడా చాలా కేర్ తీసుకున్నారు. డైరెక్టర్ నా క్యారెక్టర్ చాలా అందంగా చూపించారు. రవి తేజ అద్భుతమైన పెర్ఫార్మర్. ఫన్ ఎమోషన్ అద్భుతంగా పండించారు. నా ప్రతి సినిమా డిఫరెంట్‌గా వుండాలని అనుకుంటాను, ఈ సినిమా చూసిన తర్వాత ఆడియన్స్ ఖచ్చితంగా కొత్తదనం ఫీలౌతారు. ప్రస్తుతం విశ్వంభర, సర్దార్ 2 చిత్రాలు చేస్తున్నాను. అలాగే 'అది నా పిల్లారా' అనే మరో సినిమా చేస్తున్నాను. కెరీర్ బిగినింగ్‌లోనే బిగ్ స్టార్స్‌తో కలిసి పని చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను.

డింపుల్ హయతి మాట్లాడుతూ.. డైరెక్టర్ కిషోర్ తిరుమల ఈ కథ చెప్పాగానే నచ్చింది. ఈ కథ వినగానే ఇందులో వైఫ్ క్యారెక్టర్ బాలామణి పాత్ర చేయాలని అనుకున్నాను. ఎందుకంటే అప్పటికే రవితేజ సినిమాలో ఒక మోడరన్ అమ్మాయి పాత్ర చేశాను. బాలామణి పాత్ర అయితే నాకు కొత్తగా వుంటుందనిపించింది. డైరెక్టర్ కూడా బాలామణి పాత్ర కోసమే అనుకోవడం ఆనందంగా అనిపించింది. కథ చెప్పిన తర్వాత ఇందులో హీరో రవితేజ అని చెప్పడం ఇంకా ఆనందాన్ని ఇచ్చింది. రవితేజతో ఇది నా రెండో సినిమా. ఆయన వర్క్ చేయడం ఎప్పుడూ ఆనందంగా వుంటుంది. ఇందులో నాది వెరీ స్ట్రాంగ్ ఇండిపెండెంట్ క్యారెక్టర్. డైరెక్టర్ కిషోర్ క్యారెక్టర్ చాలా అద్భుతంగా డిజైన్ చేశారు. బాలామణి పాత్రలో కనిపించడం కొత్త ఎక్స్ పీరియన్స్. ఈ సినిమాలో ఒక సర్‌ప్రైజ్ ఎలిమెంట్ వుంది. అది మీరు సినిమాలోనే చూడాలి. డైరెక్టర్ ప్రతిది నటించి చూపిస్తారు. ఆయన డైలాగ్స్ కూడా చాలా యునిక్‌గా వుంటాయి. ఈ కథ అందరికీ కనెక్ట్ అవుతుంది. కామెడీ చాలా సెన్సిబుల్‌గా వుంటుంది. ఈ మూవీ జర్నీలో నేను, ఆషిక చాలా మంచి ఫ్రెండ్స్ అయ్యాం. మా మధ్య మంచి బాండింగ్ వుంది. నేను చిన్నప్పటి నుంచి సంక్రాంతి చెన్నైలో గ్రాండ్ పేరెంట్స్‌తో కలిసి సెలబ్రేట్ చేసుకుంటాను.



## 30న 'వన్ బై ఫోర్'

తేజస్ గుంజల్ ఫిలిమ్స్, రోహిత్ గుంజల్ ఫిలిమ్స్ పతాకంపై వెంకటేష్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్, హీనా సోని హీరో, హీరోయిన్స్‌గా నటిస్తున్న యాక్షన్ క్రైమ్ డ్రామా చిత్రం వన్ బై ఫోర్. బ్లాక్ బస్టర్ బాహుబలి చిత్రానికి అసోసియేట్ డైరెక్టర్గా పనిచేసిన బాహుబలి పళని కెఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రంజన రాజేష్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న 200 థియేటర్స్‌లో ప్రపంచవ్యాప్తంగా విడుదలకి సిద్ధంగా ఉంది. 'వన్ బై ఫోర్' ఒక క్రైమ్ యాక్షన్ ఎంటర్టైనర్. సినిమా చాలా కొత్తగా ఉంటుంది. ఒక్కో సందర్భంలో మనం టంగ్ స్లిప్ అయితే జరిగే పరిణామాలు ఊహించలేం. అలాగే ఈ చిత్రంలో కూడా టంగ్ స్లిప్ అయితే ఏమి జరుగుతుందో ఒక యాక్షన్ క్రైమ్ ఎంటర్టైనర్ చిత్రంగా రూపొందించాం. యాక్షన్ ఎపిసోడ్స్, సుభాష్ ఆనంద్ సంగీతం, పాటలు, నటి నటులు పెర్ఫార్మన్స్ సాగర్ మాస్టర్ కొరియోగ్రఫీ అందరినీ ఆకట్టుకుంటుంది. బాహుబలికి పని చేసిన పళని అందరూ ఫిదా అవుతారు. రాజమౌళి స్టైల్లో ఈ మూవీని తీశారు. ఒక్క ఫ్రేమ్ కూడా బోర్ కొట్టించుకుండా సినిమాను నిర్మించాం.

## డిజిపికి భారీ ఊరట

(మొదటి పేజీ తరువాయి)

టి.ధన్ గోపాల్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రధాన పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. తదుపరి విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేశారు. డిజిపి నియామకంపై దాఖలైన పిటిషన్‌ను కొట్టివేయాలని, హైకోర్టు ఆదేశాల మేరకు ముగ్గురు సీనియర్ ఐపిఎస్ అధికారుల జాబితాను యుపిఎస్సికి రాష్ట్ర ప్రభుత్వం పంపిందని అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్‌రెడ్డి వివరించారు. డిసెంబరు 31న తాజాగా మరో జాబితాను పంపామని, అయితే ఆలస్యమైందని చెప్పి దానిని యుపిపిఎస్‌సి వెనక్కి పంపిందన్నారు. కోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం, యుపిఎస్‌సి విధిగా అమలు చేయాలన్నారు. గతంలో యుపిఎస్‌సి రాష్ట్రానికి నాలుగు లేఖలు రాస్తే వాటిలో జాప్యం ప్రస్తావనే లేదన్నారు. ఎపి ప్రభుత్వం 11 ఏళ్ల తరువాత జాబితాను పంపితే యుపిఎస్‌సి ఆమోదించిందని గుర్తు చేశారన్నారు. పిటిషనర్ అడ్వొకేట్ వాదిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం యుపిపిఎస్‌సికి ఆలస్యంగా జాబితా పంపడాన్ని తీవ్రంగా పరిణించాలన్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వులను అమలు చేయనట్లుగా పరిగణించి డిజిపి నియామకాన్ని రద్దు చేయాలని కోరారు. డిజిపిగా శివధర్‌రెడ్డిని నియమిస్తూ జారీ చేసిన జీవోను కొట్టేయాలని కోరారు. రూల్స్ ప్రకారం ఒక డిజిపి పదవీ విరమణ చేయడానికి మూడు నెలల ముందే కొత్త డిజిపి నియామకం కోసం యుపిపిఎస్‌సికి రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఐపిఎస్ అధికారుల జాబితా పంపాల్సివుందంటూ నిబంధనలను గుర్తు చేశారు. డిజిపిగా శివధర్‌రెడ్డి నియామకం శాశ్వతప్రాతిపదికపై కాదని చేయలేదని, తాత్కాలిక నియామకమని, సుప్రీం కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా నియామకం ఉందని, కాబట్టి డిజిపి నియామకంపై స్టే ఇవ్వాలని కోరారు. యుపిఎస్‌సి న్యాయవాది కులకర్ణి ప్రతివాదన చేస్తూ, సుప్రీం కోర్టు గైడ్‌లైన్సు ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. యుపిఎస్‌సికి 7 సంవత్సరాల తరువాత రాష్ట్ర ప్రభుత్వం యుపిపిఎస్‌సికి జాబితా పంపిందన్నారు. ఇది ప్రకాశ్ సింగ్ బాదల్ కేసులో సుప్రీం కోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకం కాబట్టి దీనిపై సుప్రీం కోర్టు నుంచి స్పష్టత పొందాల్సి ఉన్నందునే జాబితాను వెనక్కి పంపినట్లు వివరించారు. అన్ని పక్షాల వాదప్రతివాదనల అనంతరం న్యాయమూర్తి, రాష్ట్ర ప్రభుత్వం పంపిన జాబితాను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని యుపిపిఎస్‌సిని ఆదేశించారు. పూర్తిస్థాయి డిజిపి నియామకంపై నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. స్టే కోరుతూ దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌ను కొట్టేశారు. అయితే, ప్రధాన పిటిషన్‌పై విచారణను వచ్చే నెల 5కి వాయిదా వేశారు.

## 'ఎఐ' భవిష్యత్తు కల కాదు..

### గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



ప్రజాపక్షం/హైదరాబాద్: విద్య లక్ష్యం యంత్రాలతో పోటీ పడడం కాకుండా సమాజ హితానికి సాంకేతికతను దారి చూపగల మానవ విలువలను బలోపేతం చేయడం ఎంతో అవసరమని తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. బిట్స్ పిలానీకి చెందిన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం, 'బిట్స్ గ్లోబల్ మీట్' (బిజిఎం–26) 6వ ఎడిషన్ శుక్రవారం హైదరాబాద్‌లోని బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) పిలానీ క్యాంపస్‌లో ఘనంగా ప్రారంభమైంది. తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఈ సదస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, బిజిఎం–2026 ఛైర్ పర్సన్ అనిత సాకూరు, బిట్స్ గ్రూప్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.రామగోపాల్ రావు, ఇన్వెంటస్ క్యాపిటల్ పార్ట్‌నర్స్ ఎంజెల్ ఇన్వెస్టర్ కన్వల్ రేఖి, బిజిఎం 2026 చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మయూర్ పట్నాలా తదితరులు పాల్గొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. నేడు విద్య ఒక కీలక మలుపుతో కృత్రిమ మేధస్సు (ఎఐ), డేటా సైన్స్, ఆటోమేషన్, డిజిటల్ మార్పులు విద్యా వ్యవస్థను మౌలికంగా మలుస్తున్నాయన్నారు. ఎఐ ఇక భవిష్యత్తు కల కాదని, ఇది ఇప్పటికే విద్య, పాలన, ఆరోగ్య రంగం, పరిశ్రమలు, మానవ జ్ఞానాన్ని ప్రభావితం చేస్తోందని, తద్వారా విద్య కేవలం ఉద్యోగాల కోసం కాకుండా, మార్పులకు అనుగుణంగా ఎదగగల సామర్థ్యం, జీవితాంతం నేర్చుకునే దృక్పథాన్ని యువత అలవరచుకోవాలన్నారు. 'ఎఐ' డేటాను విశ్లేషించగలదు, నిర్ణయాలు తీసుకోగలదు, కానీ మానవ విచక్షణ, నైతికత, సృజనాత్మకత, కరుణకు అది ప్రత్యామ్నాయం కాదన్నారు.

## సీనియర్ జర్నలిస్టు ఫజల్ మృతి



ప్రజాపక్షం/హైదరాబాద్: సీనియర్ జర్నలిస్టు ఫజల్ ఉల్ రహ్మాన్(65) అకాల మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, సాక్షి, దిశ తదితర పత్రికలలో వివిధ హోదాల్లో దాదాపు 38 సంవత్సరాలకు పైగా ఆయన పని చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా 'ప్రతిపక్షం' డిజిటల్ దినపత్రికను నిర్వహిస్తున్న ఫజల్ హఠాత్తుగా క్యాన్సర్ కాటుకు గురై ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ అన్నారు. దాదాపు మూడున్నర దశాబ్దాలుగా ఉమ్మడి రాష్ట్రంలో ఎపియుడబ్ల్యుజెకు, ప్రత్యేక రాష్ట్రంలో టియుడబ్ల్యుజె సంఘాలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. కాగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన ఫజల్ వారం రోజుల క్రితం నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఆయనకు మెరుగైన చికిత్స అందేలా ఏంతో కృషి చేశామని, అయినప్పటికీ ఫలితం దక్కలేదని విరాహత్ అలీ, రాంనారాయణ అన్నారు. గత కొంతకాలంగా ఆర్థిక కష్టాలను అనుభవిస్తున్న ఫజల్ ఉల్ రహ్మాన్ కుటుంబానికి టియూడబ్ల్యుజె అండగా నిలిచి, ప్రభుత్వ పరంగా సహాయం అందేలా కృషి చేస్తుందని వారు చెప్పారు.

## కేసులు ఎత్తివేయండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాగొంతుకైన హైదరాబాద్‌లోనీ ఇందిరా పార్కు వద్ద ధర్నాలు నిర్వహించవద్దని 2016లో హైదరాబాద్ శివారు బయట ప్రాంతాలలో నిరసనలు, ధర్నాలు చేపట్టాలని బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఆ ఆదేశాలకు వ్యతిరేకంగా ఇందిరా పార్కు వద్దనే ధర్నాలు నిర్వహించుటకు, ధర్నాచౌక్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ధర్నాలు చేపట్టడం జరిగిందన్నారు. చైర్మన్‌గా తాను చాడ వెంకట రెడ్డి, కో చైర్మన్‌గా పి.ఎల్. విశ్వేశ్వరరావు, కోదండరామ్, తమ్మినేని వీర భద్రం లాంటి రాజకీయ ప్రముఖులు సభ్యులుగా ఉండి ఇందిరా పార్కు ధర్నాచౌక్ పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యాలయంను వేదికగా ఏర్పాటు చేసుకొని సుమారు నెల రోజుల పాటు ఈ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్ పునరుద్ధరణ ధర్నాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు రోజువారీగా ధర్నాలు చేయడం జరిగింది. ఇందిరాపార్కు ధర్నా చౌక్ పరిరక్షణ కమిటీ హైకోర్టులో ఇందిరాపార్కులో ధర్నాలు నిర్వహించుటకు అనుమతి ఇవ్వాలని నేను వేసిన పిటిషన్ ను హైకోర్టు స్వీకరించి, ధర్నాలు రిమోట్ ఏరియాలో ఎలా నిర్వహిస్తారు? ప్రజల గొంతును ప్రభుత్వానికి వినిపించేలా ఉండాలని, అది నగరం మధ్యలోనే ఉండాలని ఇందిరాపార్కులో ధర్నాలు చేపట్టాలని తీర్పునివ్వడం జరిగింది. దీంతో ఇందిరాపార్కు అక్రమించడానికి అన్ని రాజకీయ పార్టీల మద్దతు అక్యూపై ధర్నా చౌక్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆనాటి ప్రభుత్వం నాతోపాటు, ఇంకా అనేక మందిపై కేసులు పెట్టడం జరిగిందని పేర్కొన్నారు. అనంతర కాలంలో ఇదే ఇందిరాపార్కు వద్ద మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, బిజెపి నాయకులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తదితరులు ధర్నాలు కూడా నిర్వహించడం ప్రజాస్వామ్య విజయం. కావున ఇందిరాపార్కు ధర్నా చౌక్ పునరుద్ధరణ ఉద్యమంలో నాతో సహా వివిధ రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తల పైన నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరారు. డిజిపి శవధర్ రెడ్డి ఈ విషయంపై సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రితో చర్చించి అన్ని వామపక్ష ప్రజా సంఘ నాయకుల పైన ఉన్న కేసులన్నీ పరిశీలించి ఎత్తివేస్తామని తెలియజేశారు.

## ఆయుధం వీడిన నక్సల్స్

(మొదటి పేజీ తరువాయి)

అధికారుల ముందు లొంగిపోయారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం తమను ఆకట్టుకుందని నక్సలైట్లు చెప్పారని ఆయన అన్నారు. వారు రాష్ట్రంలోని దక్షిణ బస్తర్ డివిజన్, పశ్చిమ బస్తర్ డివిజన్, మాడ్ డివిజన్‌లో, ఒడిశా సరిహద్దు ప్రాంతాలలో చురుకుగా ఉన్నారన్నారు. వారిలో ఏడుగురిపై ఒక్కొక్కరిపై రూ. 8 లక్షల రివార్డు ఉందన్నారు. ఈ నక్సలైట్లను మావోయిస్టుల కలహండి ఏరియా కమిటీ కార్యదర్శి అయిన పక్లు అలియాస్ ప్రదీప్ ఓయం (45); డివిజనల్ కమిటీ సభ్యుడు మోహన్ అలియాస్ ఆజాద్ కడ్తి (32); అతని భార్య సుమిత్ర అలియాస్ ద్రౌపది చపా (30); భైరమగఢ్ ఏరియా కమిటీ కార్యదర్శి; హుంగి అలియాస్ రాధిక లేకమ్ (28), ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యురాలు; కంపెనీ నెం.1 సభ్యుడు సుఖరామ్ టాటి (20), కంపెనీ నెం. 7 సభ్యుడు పాండు మద్కమ్ (19), అదే విభాగానికి చెందిన సోమ్డు కడ్తి (21)గా గుర్తించారు. మరో ఏడుగురిపై ఒక్కొక్కరిపై రూ.5 లక్షలు, 8 మందిపై ఒక్కొక్కరిపై రూ.2 లక్షలు, 11 మందిపై ఒక్కొక్కరిపై రూ.1లక్ష, ముగ్గురిపై ఒక్కొక్కరిపై రూ.50,000 రివార్డు ఉందని, ఈ 36మందిపై కలిపి మొత్తం రూ.1,19,50,000 రివార్డు ఉందని ఆయన తెలిపారు. లొంగిపోయిన 63 మంది నక్సలైట్లకు తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.50,000 అందజేస్తామని, ప్రభుత్వ విధానం ప్రకారం వారికి తదుపరి పునరావాసం కల్పిస్తామని ఆయన తెలిపారు. ఈనెల 7న సుక్మా జిల్లాలో 26 మంది నక్సలైట్లు లొంగిపోయారు. 2025వ సంవత్సరంలో రాష్ట్రంలో 1,500 మందికి పైగా నక్సలైట్లు లొంగిపోయారు.

## ప్రపంచానికి చాటాలి

(మొదటి పేజీ తరువాయి)



ఎస్.ఎస్.తాడ్వాయి మండలం మేడారం హరిత హోటల్‌లో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌లతో కలిసి మీడియా ఆత్మీయ సమ్మేళన సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం 251 కోట్ల రూపాయల నిధులతో చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో మేడారం జాతర నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.మేడారం జాతరలో శాశ్వత ప్రతిపాదికన జరుగుతున్న అభివృద్ధి పనులు, జాతర నిర్వహణ అంశాలు ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు. గద్దెల పునరుద్ధరన ముఖ్యమంత్రి చేతుల మీదుగా 19వ తేదీ ఉదయం 7 గంటలకు ప్రారంభించడం జరుగుతుందని, 18వ తేదీ సాయంత్రం ముఖ్యమంత్రి మేడారం చేరుకుంటారన్నారు. ఆలయ పునరుద్ధన విషయంలో గిరిజన పెద్దలతో, పూజారులతో, ఆదివాసి సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామని, అందరి సమ్మతి, సంతకాలతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జాతర నిర్వహించడం జరుగుతుందని, జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. జాతరలో ప్రస్తుతం 5 వేల మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని, జాతర సమయంలో 30 వేల మంది సిబ్బంది, జాతర అనంతరం 5 వేల మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు. జాతర ప్రాంతాన్ని 8 జోన్స్‌గా, 42 సెక్టార్లుగా విభజించి ప్రతి జోన్‌లో 8మంది అధికారులు ఉంటారన్నారు. ఎస్‌పి రామ్‌నాథ్ కేకన్ మాట్లాడుతూ.. మేడారం జాతర సమయంలో భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమగ్ర ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తాడ్వాయి మేడారం, పసర మేడారం రహదారుల వెంట ప్రతి 2 కిలోమీటర్లకు ఒక చెక్ పోస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాతర నిర్వహణ కోసం సుమారు 20 మంది ఐపీఎస్ అధికారుల సేవలను వినియోగించుకుంటామని, భక్తులకు సేవలు అందించడానికి స్థానిక యువత సిద్ధంగా ఉన్నారని, వాహనాల పార్కింగ్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని అన్నారు. జాతర పరిసరాలను 450 సీసీ టీవీ, 20 ప్రత్యేక డ్రోన్స్ నిఘాతో పర్యవేక్షణ చేస్తున్నామని, ప్రత్యేకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీని పర్యవేక్షించడం జరుగుతుందని పేర్కొన్నారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం 20కి పైగా డ్రోన్‌లను ఉపయోగిస్తూ, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని వివరించారు.అధునాతన సాంకేతికతను వినియోగిస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హీట్ మ్యాప్ టెక్నాలజీ ద్వారా అధిక జన సాంద్రత ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో జన సమూహ నియంత్రణ మరింత సమర్థవంతంగా సాగుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, వరంగల్ ములుగు మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com